ఆగస్టు
2025

సంపుటి : 21 సంచిక : 3

232

వెల రూ. 15/-

MARXISTU

# మార్క్సిస్టు

## సైద్ధాంతిక మాసపత్రిక

ఈ సంచికలో........

ఉద్యమాల వీరుడు వివిఎస్
యువతరాన్ని అర్థం చేసుకోవడం ఎలా?
భారతదేశంలో పేదరికం-వాస్తవాలు
బీహార్‌లో పెద్ద ఎత్తున ఓట్లు తొలగించే ప్రమాదం
అస్సాంలో ముస్లింలను వేటాడుతున్న బిజెపి ప్రభుత్వం
బానిసలు సుల్తానులుగా...
పిసి జోషి : భారతీయ సాంస్కృతిక పునర్జీవనం
వ్యవసాయ రంగాన్ని దివాళా తీయించే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు
హిందూత్వ వాదం- సైన్సుకు ప్రమాదం
కష్టకాలంలో కమ్యునిస్టులకు స్ఫూర్తి ప్రదాత కామ్రేడ్ కొరటాల
కమ్యూనిస్టు కురువృద్ధుడు, ప్రజానేత కామ్రేడ్ అచ్యుతానందన్

నివాళి

# కమ్యూనిస్టు కురువృద్ధుడు, ప్రజానేత కామ్రేడ్ అచ్చుతానందన్

**గత** నెల 21వ తేదీన కన్నుమూసిన కమ్యూనిస్టు కురువృద్ధుడు, 101 ఏళ్ల సీనియర్ నేత కామ్రేడ్ విఎస్ అచ్యుతానందన్ కేరళ కమ్యూనిస్టు ఉద్యమంలోనే కాకుండా భారద దేశ కమ్యూనిస్టు ఉద్యమంలో ఒక ముఖ్యమైన పాత్ర నిర్వహించిన వ్యక్తి. సిపిఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యునిగా, కేరళ ముఖ్యమంత్రిగా పనిచేశారు. అనేక ప్రజా ఉద్యమాల్లో పాల్గని రాటుదేలిన యోధుడు. ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో తరువాత సిపిఐ(ఎం) నిర్మాణంలో ముఖ్యమైన పాత్ర నిర్వహించారు.



ఆ మహానేత మృతికి కేరళ రాష్ట్రమే కాక యావద్ భారద దేశం అశృనివాళు లర్పించింది. ప్రధాన మంత్రి, వివిధ రాష్ట్రాల ముఖ్య మంత్రులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, వామపక్ష ప్రజాతంత్ర మేధావులు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

**సిపిఐ(ఎం) పొలిట్ బ్యూరో సంతాపం:**

విఎస్ అచ్చుతానందన్ మృతి పట్ల భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ప్రగాఢ సంతాపం తెలిపింది. ఆయనో గొప్ప నాయకుడు, కమ్యూనిస్టు ఉద్యమ కురువృద్ధుడు. విఎస్ అచ్యుతానందన్ పార్టీ పొలిట్ బ్యూరో మాజీ సభ్యుడు. ఆయన వయసు 101 సంవత్సరాలు. ఆయనను అందరూ విఎస్ అని ఆదరంగా పిలుచుకుంటారు. ఆయన ఉద్యమనిర్మాణంలో దిట్ట. కేరళలోని అనేక పోరాటాలకు నాయకత్వం వహించారు. ఆస్పిన్‌వాల్ కంపెనీలో పనిచేస్తున్నప్పుడు కొబ్బరి పీచు కార్మికులను సంఘటితం చేయడంతో ఆయన తన ట్రేడ్ యూనియన్ ఉద్యమాన్ని ప్రారంభించారు.

కామ్రేడ్ ఆచ్యుతానందన్ 1940లో 17 ఏళ్ల ప్రాయంలో కమ్యూనిస్టు పార్టీలో చేరారు. కుట్టనాడ్‌లోని వ్యవసాయ కార్మికుల్లో పనిచేయాలని కామ్రేడ్ కృష్ణపిళ్లై ఆయనకు బాధ్యతలు అప్పగించారు. అప్పట్లో కుట్టనాడ్ వ్యవసాయ కార్మికులు భూస్వాముల నుండి తీవ్రమైన దోపిడీ, పీడనలు ఎదుర్కొం టుండేవారు. ట్రావన్‌కూర్ దివాన్‌కు వ్యతిరేకంగా జరిగిన పున్నప్రావాయలార్ తిరుగుబాటు సందర్భంగా విఎస్ రహస్య జీవనంలోకి వెళ్లాల్సి వచ్చింది. అయినా అరెస్టయిన విఎస్ జైలులో తీవ్రమైన చిత్రహింసల నెదుర్కొన్నారు.

1956లో ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కమిటీకి, 1958లో జాతీయ కౌన్సిల్‌కూ విఎస్ ఎన్నికయ్యారు. ఉమ్మడి పార్టీ జాతీయ కౌన్సిల్ నుండి బయటకు వచ్చి సిపిఐ(ఎం)గా ఏర్పడిన 32 మంది సభ్యుల్లో విఎస్ అచ్యుతానందన్ ఒకరు. మరణించిన చివరి వ్యక్తి. 1980 నుండి 1991 వరకు ఆయన కేరళ రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా పనిచేశారు. 1964లో పార్టీ కేంద్ర కమిటీకి ఎన్నికయ్యారు, 1085లో పొలిట్ బ్యూరో సభ్యుడైనారు. వయోభారం మీద పడ్డంతో 2022లో ఆయనను కేంద్ర కమిటీ నుండి రిలీవ్ చేసినప్పటికీ ప్రత్యేక ఆహ్వానితునిగా కొనసాగు తున్నారు.

కామ్రేడ్ ఆచ్యుతానందన్ అనేక పర్యాయాలు కేరళ అసెంబ్లీకి ఎన్నకయ్యారు. రెండు టెర్మ్‌లు శాసన సభలో ప్రతిపక్ష నాయకునిగా కొనసాగారు. 2006 రెండి 2011 వరకు కేరళ ముఖ్యమంత్రి పదవీ బాధ్యతలు నిర్వహించారు. ఆయన ముఖ్య మంత్రిగా ఉన్న కాలంలో శ్రామిక ప్రజల సంక్షేమం కోసం అనేక శాసన పరమైన, పరిపాలనా పరమైన చర్యలు తీసుకున్నారు.

పార్టీలో ఎనిమిదిన్నర దశాబ్దాల సుధీర్ఘ జీవితంలో కామ్రేడ్ విఎస్ కేరళలో కమ్యూ నిస్టు ఉద్యమ స్థిరాభివృద్ధిని చూశారు. ఆయన మంచి వక్త. ప్రజల హృదయాలకు హత్తుకునే విధంగా మాట్లాడ్డంలో దిట్ట. ఆయన చాలా సాధారణమైన జీవితం గడిపాడు. సామాజిక న్యాయం పట్ల గొప్ప నిబద్ధత గల విఎస్ కేరళ రాజకీయాల్లో తనదంటూ ప్రత్యేక ముద్ర వేశారు. ఆయన మృతితో పార్టీ, కమ్యూనిస్టు ఉద్యమం పెద్ద నష్టాన్ని చవిచూసింది.

కామ్రేడ్ విస్ అచ్యుతానందన్ మృతికి సంతాపంగా భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఎర్రజెండాను అవనతం చేసింది. ఆయన భార్యకు, కుమారుడు, కుమార్తెకు ప్రగాఢ సానుభూతి తెలియజేసింది. ❋

## ఈ సంచికలో...

1. కమ్యూనిస్టు కురువృద్ధుడు, ప్రజానేత కామ్రేడ్ అచ్చుతానందన్ .........2
2. ఉద్యమాల వీరుడు విఎస్ ఎంఎ బేబీ .....4
3. యువతరాన్ని అర్థం చేసుకోవడం ఎలా? ప్రొ॥ మాతంగి కృష్ణమూర్తి, రమా బీజాపుర్కార్.7
4. భారతదేశంలో పేదరికం-వాస్తవాలు ఉదిత్ మిశ్రా .........10
5. బీహార్‌లో పెద్ద ఎత్తున ఓట్లు తొలగించే ప్రమాదం సోని మిశ్రా......13
6. అస్సాంలో ముస్లింలను వేటాడుతున్న బిజెపి ప్రభుత్వం గ్రీష్మ కుతార్.........15
7. బానిసలు సుల్తానులుగా .. ఎంవిఎస్ శర్మ........19
8. పిసి జోషి: భారతీయ సాంస్కృతిక పునర్జీవనం అనిల్ రాజ్మీవాల్........22
9. వ్యవసాయ రంగాన్ని దివాళా తీయించే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు ఎ కోటిరెడ్డి.........27
10. హిందూత్వ వాదం- సైన్సుకు ప్రమాదం ఎస్ వెంకట్రావు........29
11. కష్టకాలంలో కమ్యునిస్టులకు స్ఫూర్తి ప్రదాత కామ్రేడ్ కొరటాల పి మధు ...33



సంపాదకుడు :
**ఎస్.వెంకట్రావు**

సంపాదక వర్గం :
**బి.వి.రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్.వీరయ్య**
**తెలకపల్లి రవి**

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున

ప్రచురణ కర్త, ముద్రాపకుడు: బి.వి.రాఘవులు
సంపాదకుడు : ఎస్.వెంకట్రావు
**ఫోన్: ఎడిటర్ : 94900 99333**

**ముద్రణ:** ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
**మేనేజర్: కె.హరికిషోర్: 94900 99422**
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com
visitcpi(m)site at:cpim.org


# భూముల కోసం....

బెంగళూరు గ్రామీణ జిల్లా దేవనహల్లి తాలూకా, చెన్నరాయపట్న హోబ్లికి చెందిన 13 గ్రామాల ప్రజలు తమ భూములను బలవంతంగా లాక్కోవడానికి వ్యతిరేకంగా 1,198 రోజులపాటు ఏకధాటిగా ఆందోళన చేసి విజయం సాధించడం దేశవ్యాపితంగా బలవంతపు భూ సేకరణకు వ్యతిరేకంగా రైతాంగం జరుపుతున్న పోరాటాలకు గొప్ప స్ఫూర్తినిస్తుంది. ఇప్పటికే ఈ 13 గ్రామాల్లో 1,300 ఎకరాల పంట భూమిని పారిశ్రామికాభివృద్ధి పేరుతో కార్పొరేట్ భూబకాసురులకు దారాదత్తం చేశారు. 2022లో నాటి బిజెపి రాష్ట్ర ప్రభుత్వం మరో 1,777 ఎకరాల సారవంతమైన భూమిని కార్పొరేట్లకు దారాదత్తం చేయడానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. గతంలో భూములిచ్చిన తమ తోటి గ్రామస్తులు అనుభవిస్తున్న బాధలను చూసిన 13 గ్రామాల ప్రజలు చెన్నయపట్టణ భూసేకరణ-వ్యతిరేక పోరాట కమిటీగా ఏర్పడి 2022 ఏప్రిల్ 4 నుండి పట్టు వదల కుండా సుధీర్ఘపోరాటం చేశారు. కిసాన్ సభకు చెందిన కర్నాటక ప్రాంత రైతు సంఘ, ఇతర సంఘాలు రైతాంగానికి మద్దతుగా నిలబడ్డాయి. ఆ పోరాటానికి దిగివచ్చిన రాష్ట్ర ప్రభుత్వం భూ సేకరణను రద్దు చేస్తూ పోరాట కమిటీతో ఒప్పందం చేసుకుంది.

పెట్టుబడిదారీ పారిశ్రామిక విస్తరణ కోసం ఒకనాడు బ్రిటన్‌లో పొలాలకు కంచెలు వేసి రైతులను బలవంతంగా బయటకు నెట్టివేసినట్లే ఇప్పుడు నయా-ఉదారవాద విధానాల్లో భాగంగా రైతులను బలవంతంగా భూములనుండి తరిమేసి పారిశ్రామికాభివృద్ధి పేరుతో ప్రభుత్వాలు కార్పొరేట్లకు వేల ఎకరాలు కట్టబెడుతున్నాయి. ఈ బలవంతపు భూ సేకరణలకు వ్యతిరేంకగా రైతాంగ ప్రతిఘటన కూడా తీవ్రమవుతున్నది.

ప్రకాశం జిల్లా కరేడు గ్రామంలో ఇండోసోల్ ఫాక్టరీకోసం 8,500 ఎకరాల సారవంతమైన భూమిని బలవంతంగా లాక్కోడానికి రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రయత్నాలను అక్కడి ప్రజలు తీవ్ర స్థాయిలో ప్రతిఘటిస్తున్నారు. శ్రీకాకుళం జిల్లా మందసలో కార్గో ఎయిర్‌పోర్టు నిర్మాణం పేరుతో రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుండి భూములు లాక్కుని కార్పొరేట్లకు కట్టబెట్టడానికి చేస్తున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా చుట్టుపక్కల గ్రామాల రైతులు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో అదానీకి కేటాయించిన హైడ్రో పంప్డ్ స్టోరేజీకి భూములు కేటాయింపుపై అక్కడి ప్రజలు ఆందోళనకు దిగడంతో ప్రభుత్వం జీఓ ఉపసంహరించుకుంది.

ఆంధ్ర ప్రదేశ్ రాజధాని అమరావతి కోసం ఇప్పటికే 33 వేల ఎకరాల భూమిని సమీకరణ పద్ధతిలో సేకరించిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు మరింత విస్తరణ పేరుతో మరో 20,494 ఎకరాల సమీకరణకు నడుం కట్టింది. గతంలో అమరావతి కోసం భూములిచ్చిన వారి అష్టకష్టాలు చూసిన రైతులు సరికొత్తగా భూములు ఇవ్వడానికి ససేమిరా అంటున్నారు. మరోవైపు పచారీలు అమ్ముకునే లులూ సంస్థకు విజయవాడలోని అత్యంత విలువైన ఆర్టీసి భూమిని కారుచౌకగా కట్టబెడుతోంది ప్రభుత్వం. విశాఖలో కూడా బీచ్‌రోడ్డులో ఈ సంస్థకు భూములు కేటాయిస్తోంది. రాష్ట్ర మంత్రి వర్గ సమావేశం జరిగితే చాలు వివిధ ప్రయివేటు సంస్థలకు భూముల పందేరం ఒక పెద్ద ఎజెండాగా ఉంటోంది, కానీ పేద ప్రజలకు ఇళ్లు, ఇళ్ల స్థలాల కేటాయింపు మాత్రం దానికి పట్టడం లేదంటే ఈ ప్రభుత్వ వర్గ స్వభావాన్ని అర్థం చేసుకోవచ్చు.

అనేక అక్రమాలకు పాల్పడిన అదానీ గ్రూపుకు సోలార్ విద్యుత్ పేరుతోనూ, పోర్టుల పేరుతోనూ వేలాది ఎకరాలు దారాదత్తం చేస్తున్న ప్రభుత్వానికి ప్రభుత్వ రంగంలోని విశాఖ ఉక్కు ఫాక్టరీకి కాప్టివ్ మైన్స్ కేటాయించడానికి మాత్రం చేతులు రావడం లేదు. పోలవరం నిర్వాసితులకు కనీస వసతులు కల్పించకుండా వేలాది మంది ప్రజలకు నిత్యం నరకం చూపిస్తున్నది.


విదేశీ పెట్టుబడుల పేరుతోనూ, పారిశ్రామీకరణ పేరుతోనూ ప్రభుత్వం కార్పొరేట్లకు ఈ భూముల పందేరం చేస్తున్నది. కానీ వాస్తవానికి భూములు తీసుకున్న కార్పొరేట్లలో అత్యధిక శాతం పరిశ్రమలు పెట్టిన పాపాన పోవడం లేదు. విలువైన భూములను ఉపయోగించుకుని బ్యాంకులను మోసగిస్తున్నారు. నయా-ఉదారవాదం పెంచి పోషిస్తున్న ఆశ్రిత పెట్టుబడిదారీ విధానంలో భాగంగానే ప్రజలకు చెందిన వనరులను ప్రభుత్వాలు కార్పొరేట్లకు దోచిపెడుతున్నాయి.

అయితే రైతాంగం కదులుతున్నది. ఈ దోపిడీ ఇకపై సాగబోదని నినదిస్తున్నది. అవకాశం ఉన్న చోటల్లా సంఘటితమై పోరాడుతున్నది. ఈ పోరాటాలు మరింత ఉధృతం కావాల్సి ఉంది. ఇంకా బూర్జువా ప్రభుత్వాలపై భ్రమల్లో ఉన్న రైతులను, ప్రజలను చైతన్య పరచాలి. తమ భూములను రక్షించుకోడానికీ, భూమిలేని పేదలు భూములపై హక్కులు సాధించడానికీ సంఘటిత పోరాటాలకు మించిన ఆయుధం లేదు.

నివాళి

# ఉద్యమాల వీరుడు విఎస్

ఎంఎ బేబీ



రచయిత భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ప్రధాన కార్యదర్శి

భారత దేశంలో జీవించి ఉన్న అతి పెద్ద వయసు కమ్యూనిస్టు కామ్రేడ్ విఎస్ అచ్యుతానందన్. జులై 21న కనుమూసిన ఆ వృద్ధ కమ్యూనిస్టు యోధునికి అంతిమ నివాళు లర్పించేందుకు వచ్చిన మహాజన ప్రవాహం వర్ణించనలవి కానిది. ఆయనతో నేరుగా కలిసి పనిచేసే భాగ్యం కలిగిన వృద్ధ స్త్రీపురుషులు, ఆయన నాయకత్వ శక్తిని ఎరిగిన మధ్య వయస్కులు, ఆయనను రాష్ట్ర ముఖ్యమంత్రిగా, ప్రతిపక్ష నేతగా చూసిన యువత, ఇటీవల ఆరోగ్య రీత్యా ప్రజాజీవనంలో కనిపించనప్ప టికీ ఆయన జీవితాన్ని కథలుగా విన్న చిన్న పిల్లలు కూడా ఆయన్ను కడసారి చూసేందుకు మహాసమూహంగా జాతీయ రహదారికి రువైపులా నిలబడ్డారు. తిరువనంతపురం నుండి అలెప్పీ వరకు 150 కిలోమీటర్ల పర్యంతం ఆయన అంతిమ యాత్ర సాగినంత దూరం ప్రజలు నిలబడి ఆ మహానేతకు అశ్రునయనాలతో అంతిమ వీడ్కోలు చెబుతూనే ఉన్నారు. ఈ మార్గంలో అంతిమ యాత్ర సాగడానికి మామూలుగా అయితే 4 నుండి 5 గంటలు పడుతుంది. అయితే, కామ్రేడ్ విఎస్‌కు తుది వీడ్కోలు పలకడానికి త్రోవ పొడుగునా నిలబడి ఉన్న ప్రజలు చూడ్డానికి వీలుకల్పించాలంటే కనీసం 8 గంటలైనా పడుతుందనుకున్నాం. కానీ, విఎస్ మృత దేహం ఉన్న వాహనం నడవడానికి 22 గంటలు పట్టింది. కారణం! రాత్రిపగలూ అనకుండా, వర్షాన్ని కూడా లెక్కచేయకుండా త్రోవపొడుగునా నిలబడి వందేళ్ల నిండు జీవితం అనుభవించిన తమ విప్లవ నేతను వీక్షించడానికి ఆరాటపడిన ప్రజా సమూహాన్ని కంట్రోల్ చేయడం కష్టమైపోవడమే. తుదివీడ్కోలు పలకడానికి వచ్చిన వారిలో స్త్రీలు, యువకులు పెద్ద సంఖ్యలో ఉండడం మరో విశేషం. విప్లవ వీరుని తుది ప్రయాణం అంతటా అమరుడా అచ్యుతానందన్ అనే నినాదాలు మిన్నంటాయి.

నేను కామ్రేడ్ అచ్యుతానందన్‌ను తొలిసారి దగ్గరగా 1970లో కొల్లం రైల్వే స్టేషన్ వద్ద జరిగిన సిపిఐ(ఎం) బహిరంగ సభలో చూశాను. అప్పట్లో ఆయన బలిష్టంగా ఉండేవారు. ఆయన ప్రసంగాలు భావోద్వేగ పూరితంగా ఉండేవి. మాట్లాడుతున్నప్పుడు శక్తివంతంగా హావభావాలు ప్రదర్శించేవారు. శక్తినంతా కూడదీసుకుని ప్రసంగించేవారేమో, ప్రసంగం ముగిసే సరికి ఆయన చెమటలతో తడిసిపోయేవారు. ఆయన కుర్తా శరీరానికి వేలాడు తుండేది. ఆయన ఆ స్వరూపం నా మదిలో ముద్రపడిపోయింది. ఎమర్జెన్సీ తరువాత 10వ అఖిలభారత పార్టీ మహాసభకు ముందు జరిగిన కొల్లం జిల్లా మహాసభలో నేను జిల్లా కమిటీ సభ్యునిగా ఎన్నికయ్యాను. అప్పుడు నాకు ఆయన గురించీ, ఆయన నాయకత్వం గురించీ మరింత లోతుగా తెలిసింది. మొదట చూసినప్పుడు ఆయనను నేను కఠినమైన మనిషి అనుకున్నాను. కానీ, ఆయన విమర్శను బాగా స్వీకరించేవారు. దీనికి సంబంధించి నాకు ఒక ఉదాహరణ గుర్తుంది. 1980లో కామ్రేడ్ ఇకె నయనార్ ముఖ్యమంత్రి అయనప్పుడు విఎస్ పార్టీ కార్యదర్శిగా పనిచేశారు. 1985లో జరిగిన సిపిఐ(ఎం) రాష్ట్ర మహాసభలో ఎంవి రాఘవన్ ప్రత్యామ్నాయ పత్రం ప్రవేశ పెట్టడంతో దాని చుట్టూ పెద్ద చర్చ జరిగింది. అయితే, అదే సమయంలో మరో అంశం మీద కూడా అంటే, అన్ని స్థాయిల్లో కామ్రేడ్స్ పట్ల నాయకత్వం మరింత సానుభూతితో, సహృదయంతో వ్యవహరించాల్సిన అవసరం గురించి చర్చ జరిగింది. ఆ మహాసభ జరిగిన కొద్ది వారాల తరువాత, మేము కొల్లంలోని పొలయతోడ్‌లో గల జిల్లా కమిటీ కార్యాలయ వరండాలో కూర్చుని వార్తాపత్రికలు చదువుకుంటున్నాం. అప్పుడు విఎస్ ఆఫీసుకు వచ్చారు. సాధారణంగా ఆయన బిజీ షెడ్యూల్ వల్ల జిల్లా కార్యదర్శి గదిలోకి వెళ్లిపోతుంటారు. కానీ, ఆ రోజు మాత్రం ఆయన పద్ధతి మారింది. ఆయన అక్కడ ఉన్న అందరినీ పలకరించారు, ఎలా ఉన్నారని వాకబు చేశారు, కొద్ది నిమిషాలు కామ్రేడ్స్‌తో మాట్లాడి తన కార్యాలయ గదిలోకి వెళ్లారు. ఎర్నాకుళం మహాసభకు హాజరైన వారు ఈ మార్పును గమనించి వుంటారు. ఆ క్షణాన ఆయనలో నిజమైన కమ్యూనిస్టుకుండాల్సిన లక్షణం, అంటే విమర్శను స్వీకరించి తద్వారా ఆత్మపరిశీలన చేసుకుని మార్పు పొందడానికి సిద్ధంగా ఉండడం అనేది కనిపించింది.

విఎస్ జీవితంలో వ్యక్తిగత, రాజకీయ జీవితాలు రెండూ సుదీర్ఘ పోరాటాలే. ఆయన చాలా పేద కుటుంబంలో జన్మించారు. ఆయన నాలుగేళ్ల ప్రాయంలో ఉండగా తల్లి చనిపోయింది. 11 ఏళ్ల ప్రాయంలో ఆయన తండ్రిని కూడా పోగొట్టుకున్నారు. దాంతో ఆయన ఏడవ తరగతిలోనే పాఠశాలకు స్వస్తిచెప్పాల్సి వచ్చింది. ఇతర పిల్లలు పాఠశాలల్లో చదువుకుంటున్న వయసులో ఆయన తన అన్న వద్ద టైలరింగ్ నేర్చుకుంటున్నారు. తరువాత ఆయన ఆస్పిన్‌వాల్ కంపెనీలో కొబ్బరి పీచు కార్మికుడుగా చేరాడు. అక్కడ ఆయన ట్రేడ్‌యూనియన్ కార్యకలాపాల్లో పాల్గొన్నాడు. 17వ ఏట ఆయన కమ్యూనిస్టు పార్టీలో చేరారు. ఉద్యమ నిర్మాత కామ్రేడ్ పి.కృష్ణ పిళ్లై యువకుడైన విఎస్‌కు, కుట్టనాడ్‌లో వ్యవసాయ కార్మికులను సమీకరించే పనిని అప్పగించారు. పున్నప్ర- వాయిలార్

తిరుగుబాటు తరువాత వియస్ రహస్య జీవనానికి వెళ్లిపోయారు. రహస్యంగా ఉంటూనే పనిచేశారు. తరువాత పోలీసులు ఆయన్ను అరెస్టు చేసి చిత్రహింసలు పెట్టారు. అయినప్పటికీ ఆయన యవ్వనంలో ప్రారంభిం చన పోరాటం నుండి ఒక్కడుగుకూడా పక్కకు వేయలేదు, 101 ఏళ్ల వయసు వరకు మొక్కవోని దీక్షతో ఆసుపత్రి మంచం మీద ఉండి కూడా కొనసాగించారు.

కుట్టనాడ్‌లో వ్యవసాయ కార్మికులను సమీకరించడం కేరళ పోరాట చరిత్రకు వియస్ అందించిన మహోన్నత సేవ. ఆయన వారికి తలెత్తుకుని నిలబడ్డం నేర్పించాడు. తమ డిమాండ్లకోసం పోరాడ్డం ఎలాగో నేర్పించాడు. యువకుడైన వియస్‌లోని గొప్ప సామర్థ్యాన్ని పి. కృష్ణ పిళ్లై గుర్తించారు. కుట్టనాడ్‌లోని వ్యవసాయ కార్మికులను ఎర్రజెండా కింద సమీకరించే పనిని ఆయనకు అప్పగించారు. వియస్ అక్కడ ఎంతో ధైర్యంగా, చలాకీగా పనిచేసి వ్యవసాయ కార్మికోద్యమానికి పునాది వేశారు. అప్పటివరకు అక్కడ పెత్తందార్ల పదఘట్టనల కింద నలిగిపోతూ, జంతువుల కన్నా హీనంగా బ్రతుకులీడ్చిన ప్రజలు తలలెత్తి నిలబడ్డారు. చేతులు పైకెత్తి పిడికిళ్లు బిగించారు. "మేము బానిసలం కాము, ఇంకెంతమాత్రం తలదిం చం" అన్న నినాదాలు అక్కడి వరి పొలాల్లో ప్రతిధ్వనించాయి. వియస్ ప్రజా పోరాట నిర్మాణ దక్షతకు అది నిలువెత్తు నిదర్శనంగా నిలిచింది. ఆయనకు పార్టీ ఏ పని అప్పగించినా – అది రాజకీయ లేక పార్టీ పని ఏదైనా గానీ దాన్ని నమ్మకంగా నిర్వహించేవారు.

1964లో రివిజనిజానికి వ్యతిరేకంగా సిపిఐ నేషనల్ కౌన్సిల్ సమావేశం నుండి వాకౌట్ చేసి వచ్చేసిన 32 మంది సభ్యుల్లో వియస్ ఒకరు. ఆ విధంగా కూడా ఆయన భారత దేశ కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో చెరిపివేయలేని ఒక పాత్ర నిర్వహించారు. 1965 నుండి 2016 వరకు ఆయన పది సార్లు శాసన సభకు పోటీ చేశారు. ఏడు సార్లు గెలిచారు, మూడు సార్లు ఓడిపోయారు. అయితే, ఏ ఓటమీ ఆయన స్థైర్యాన్ని నీరుగార్చలేక పోయింది. ఆయన పర్యావరణ సమస్యలు తీసుకుని పోరాడారు, మహిళా సమస్యలపై పోరాడారు, అంతే కాకుండా ఒక నిజమైన విప్లవకారుని వలె అన్ని రకాల అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడారు. ఒక దశలో మీడియా ఆయన్ను తప్పుత్రోవ పట్టించింది. కానీ తరువాత అవే మీడియా సంస్థలు ఆయనను "ప్రజా నాయకుడు" అని పొగడాల్సి వచ్చింది.

**"కుట్టనాడ్‌లో వ్యవసాయ కార్మికులను సమీకరించడం కేరళ పోరాట చరిత్రకు వియస్ అందించిన మహోన్నత సేవ. ఆయన వారికి తలెత్తుకుని నిలబడ్డం నేర్పించాడు. తమ డిమాండ్లకోసం పోరాడ్డం ఎలాగో నేర్పించాడు. యువకుడైన వియస్‌లోని గొప్ప సామర్థ్యాన్ని పి. కృష్ణ పిళ్లై గుర్తించారు. కుట్టనాడ్‌లోని వ్యవసాయ కార్మికులను ఎర్రజెండా కింద సమీకరించే పనిని ఆయనకు అప్పగించారు."**



వియస్ అచ్యుతానందన్ అంతిమ యాత్ర

వియస్ ఉన్నత విద్య నభ్యసించకపోయి నప్పటికీ ఆయనకు అది తన బాధ్యతల నిర్వహణకు అడ్డంకిగా మారలేదు. పార్టీలోనూ, ట్రేడ్‌యూనియన్ ఉద్యమంలోనూ ఆయన లెక్కలేనన్ని పాఠాలు నేర్చుకున్నారు. ఆయన 2006-2016 మధ్య ముఖ్యమంత్రిగా, ప్రతిపక్ష నాయకునిగా ఎంత నిక్కచ్చిగా వ్యవహరించే వారో అర్థంచేసుకునే అవకాశం నాకు కలిగింది. అప్పుడు నేను కేరళ శాసన సభ్యునిగా ఉన్నాను. ఆయన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యనూ ఎంతో సామర్థ్యంతో పరిష్కరించేవారు. ఆయన చాలా షార్ప్‌గా నిర్ణయాలు తీసుకునేవారు. దీనికి ఒక మంచి ఉదాహరణ, 2006-11 మధ్య ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం కేరళలో చేపట్టిన 'ఐటిఎస్కూల్' కార్యక్రమం. ఆయన మంత్రివర్గంలో నేను విద్యా శాఖ మంత్రిగా ఉన్నాను. 1996-2001 కాలంలో కామ్రేడ్ నయనార్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం నియమంచిన ప్రొఫెసర్ యుఆర్ రావు కమిటీ ఇచ్చిన 'విద్యలో ఐటి: విజన్ 2010' నివేదిక ఆధారంగా రూపొందించిన ఈ 'ఐటిఎస్కూల్' కార్యక్రమాన్ని ప్రారంభించాం. కానీ 2001-06 కాలంలో పరిపాలించిన యుడిఎఫ్ ప్రభుత్వ హయాంలో, కేరళ ఐటి విద్యను మైక్రోసాఫ్ట్ వంటి కార్పొరేట్లకు అప్పగించేస్తున్నారన్న గగ్గోలు ప్రారంభమైంది. అప్పుడు ప్రతిపక్ష నాయకునిగా ఉన్న వియస్ ఆ సమస్యను సీరియస్‌గా తీసుకున్నారు. 2006లో ఎల్‌డిఎఫ్ తిరిగి అధికారంలోకి వచ్చిన వెంటనే అది ప్రభుత్వ విద్యలో ఫ్రీ సాఫ్ట్‌వేర్ సాంకేతికతను సమర్థవంతంగా ఉపయోగించుకునేందుకు పూనుకున్నది.

2007లో ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం అనుసరించిన ఐటి విధానం కేరళకు ఫ్రీ సాఫ్ట్‌వేర్ ప్రపంచపు తలుపులు తెరిచింది. 2008 మార్చి నాటికి కేరళ ప్రభుత్వ విద్య మొత్తంగా ఫ్రీ సాఫ్ట్‌వేర్‌కు బదిలీ అయ్యింది. విద్యార్థులు ఐటి ని నేర్చుకోవడం బదులుగా ఐటిలో అన్ని పాఠ్యాంశాలు నేర్చుకోవడం ప్రారంభించారు.

**❝ విఎస్ గొప్ప వ్యూహకర్త కూడా. 1958లో ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ అమృతసర్‌లో మహాసభ నిర్వహిస్తున్నప్పుడు, దేవికుళంలో ఉపఎన్నిక జరిగింది. ఆనాడు కేరళలో ఇఎంఎస్ నంబూద్రిపాద్ ప్రభుత్వానికి సంబంధించినంతవరకు ఇది కీలకమైన ఉప ఎన్నిక. పార్టీ విజ్ఞప్తి మేరకు విఎస్ మహాసభను వదిలిపెట్టి ఉపఎన్నిక క్యాంపెయిన్‌కు నాయ కత్వం వహించారు. నువ్వానేనా అన్నట్లు జరిగిన పోటీలో పార్టీ అభ్యర్థి ఎన్నిక కావడం వెనుక విఎస్ నైపుణ్యం ముఖ్య భూమిక పోషించింది. ❞**

2008 నాటికి అన్ని ప్రభుత్వం, ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలు, ఉన్నత సెకెండరీ పాఠశాలలు బిఎస్ఎన్ఎల్ ద్వారా బ్రాడ్ బాండ్ కనెక్టివిటీ పొందాయి. 2016-2021 నాటికి ముఖ్యమంత్రి పినరయి విజయన్ ముఖ్యమంత్రిత్వంలో ప్రాథమిక, ఉన్నత ప్రాథమిక పాఠశాలలకు బ్రాడ్‌బాండ్‌ను విస్తరించడం జరిగింది. 'ఐసిటిఏస్కూల్' కేంద్ర ప్రభుత్వ పథకం (75 శాతం కేంద్రం, 25 శాతం రాష్ట్రం) క్రింద 2007-08 లో 1,016 పాఠశాలలకు మంజూరు చేయడం జరిగింది. ఈ పథకాన్ని సమీక్షించిన తరువాత మరో 3,055 పాఠశాలలకు మంజూరు చేయడం జరిగింది. మొత్తం మీద 4,071 పాఠశాలలకు అయిదేళ్లలో రూ. 270 విలువ గలిగిన లాప్‌టాప్‌లు, ప్రొజెక్టర్‌లు, ప్రింటర్‌లు, డిజిటల్ కెమెరాలు, టివీలు, జనరేటర్లు వంటి పరికరాలు అందించడం జరిగింది. పగిలిపోయిన కంప్యూటర్లను విద్యార్థుల సహాయంతో బాగుచేసే హార్డ్‌వేర్ క్లినిక్‌లను నెలకొల్పడం ఒక విశిష్టమైన ప్రయోగంగా నిలిచింది. ఫ్రీ సాఫ్ట్‌వేర్ యూజర్ ఫ్రెండ్లీగా ఉంటుందా, పనికి వస్తుందా లేదా అనే ఆందోళనలను పటాపంచలు చేస్తూ 'ఐటిఏస్కూల్' కార్యక్రమం, దాంతోపాటు కేరళ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ టెక్నాలజీ ఫర్ ఎడ్యుకేషన్ (కైట్) కార్యక్రమమూ పనిచేసే కార్యక్రమాలని నిరూపించుకోవడమే కాక, అంతర్జాతీయ నివేదికల ప్రకారం రాష్ట్రానికి రూ. 3,000 కోట్ల రూపాయలు ఆదా చేశాయి. కేరళ డిజిటల్ విద్యా విధానం ప్రపంచానికే ఒక మోడల్ అని యునిసెఫ్ పేర్కొనడం విశేషం. ఇది కేవలం పేద దేశాలకే కాకుండా ధనిక దేశాలకూ కూడా ఒక నమూనా అని యునిసెఫ్ పేర్కొంది. ఈ పరివర్తనలో విఎస్ నాయకత్వంలోని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం కీలకమైన పాత్ర నిర్వహించింది.

విఎస్ గొప్ప వ్యూహకర్త కూడా. 1958లో ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ అమృతసర్‌లో మహాసభ నిర్వహిస్తున్నప్పుడు, దేవికుళంలో ఉపఎన్నిక జరిగింది. ఆనాడు కేరళలో ఇఎంఎస్ నంబూద్రిపాద్ ప్రభుత్వానికి సంబంధించినంతవరకు ఇది కీలకమైన ఉప ఎన్నిక. పార్టీ విజ్ఞప్తి మేరకు విఎస్ మహాసభను వదిలిపెట్టి ఉపఎన్నిక క్యాంపెయిన్‌కు నాయకత్వం వహించారు. ఆయన లేకపోయినా మహాసభ ఆయనను జాతీయ కౌన్సిల్‌కు ఎన్నుకున్నది. నువ్వానేనా అన్నట్లు జరిగిన పోటీలో పార్టీ అభ్యర్థి ఎన్నిక కావడం వెనుక సమర్థవంతమైన రాజకీయ నిర్మాణ దక్షునిగా విఎస్ నైపుణ్యం ముఖ్య భూమిక పోషించింది. ఆ క్యాంపెయిన్‌లో ఇళయరాజ, ఆయన సోదరుడు గంగై అమ్మన్ కూడా విప్లవ గీతాలు ఆలపిస్తూ పాల్గొన్నారు. రాజకీయ పోరాటాలకు సాంస్కృతిక కోణం కూడా ఉండాలన్న విషయాన్ని విఎస్ ఆనాడే అర్థం చేసుకున్నారన్న విషయం మనకు బోధపడుతుంది.

భారత దేశంలోని ఇతర ప్రాంతాలతో పోలిస్తే కేరళలో ప్రజల ఆయు:ప్రమాణం ఎక్కువన్న విషయం అందరికీ తెలిసిందే. దీన్ని సాధించడం వెనుక భూ సంస్కరణలు కీలక పాత్ర పోషించాయని అనేక అధ్యయనాలు తెలిపాయి. 1957లో ఇఎంఎస్ ప్రభుత్వం కేరళలో భూ సంస్కరణలకు శ్రీకారం చుట్టిన విషయాన్ని అందరూ అంగీకరిస్తారు. కానీ భూ సంస్కరణలు వాస్తవ రూపం ధరించడానికి విఎస్ ఎంతగానో సహకరించారన్న విషయం చాలా మందికి తెలియదు. 1969లో రెండవ ఇఎంఎస్ ప్రభుత్వాన్ని కాంగ్రెస్, దాని మిత్ర పక్షాలు కలిసి కూల్చేసిన తరువాత సిపిఐ(ఎం), కిసాన్, వ్యవసాయ కార్మిక సంఘాలు భూ సంస్కరణలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టాయి. కర్షక సంఘం, కర్షక తొజిలాలి యూనియన్‌ల ఆధ్వర్యంలో అరవుకడ్, అల్లపూజ లలో ప్రజలు పెద్ద ఎత్తున కదిలారు. విఎస్ ప్రధాన నాయకత్వంలో 1969 డిసెంబర్ 13-14 తేదీల్లో వేలాది మంది నిరసన కారులు సమీకరించబడ్డారు. సభకు నాటి సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య, పొలిట్ బ్యూరో సభ్యులు కామ్రేడ్ ఇఎంఎస్ నంబూద్రిపాద్, ఎకె గోపాలన్, కిసాన్ సభ నాయకుడు కామ్రేడ్ హరేక్రిష్ణ కోనార్ హాజరయ్యారు. భూ సంస్కరణల చట్టానికి రాష్ట్రపతి అనుమతివ్వకపోవడంతో, ప్రజలే దాన్ని అమలు చేస్తారని ఎకె గోపాలన్ ప్రకటించారు. ఆ తరువాత విఎస్ నేతృత్వంలో సాగిన పోరాటాల్లో పాల్గొన్న లక్షలాది మంది వాలంటీర్లు కేరళ వ్యాపితంగా అదనపు భూములను ఆక్రమించారు, ఎర్రజెండాలు పాతి ఆ భూములకు తామే యజమానులమని ప్రకటించారు. కొబ్బరి చెట్లు ఎక్కి మొత్తం పరిస్థితులను తమ చేతుల్లోకి తీసుకోవడం ద్వారా వాళ్లు పోలీసు దాష్టీకాన్ని, హింసాకాండనూ, అరెస్టులనూ, జైళ్లనూ ఎదిరించారు. ఈ వీరోచిత పోరాటంలో 18 మంది అమరులైనారు. వారిలో కవలోమ్ శ్రీధరన్, కల్లికాడ్ నీలకంఠన్, భార్గవిలు ఉన్నారు. రక్తంతో నిండిన ఈ పోరాటం ద్వారా సుమారు 28 లక్షల మంది కౌలు రైతులు అయిదు లక్షల మందికన్నా ఎక్కువ భూమి లేని కుటుంబాలు భూమి పై యాజమాన్య హక్కులు పొందారు. కులతత్వ భూస్వాములకు వ్యతిరేకంగా శతాబ్దాలుగా జరుగుతున్న పోరాటానికి అరవుకడ్ నిరసన ఒక మలుపుగా మారింది. దోపిడీకి గురవుతున్న, పీడిత ప్రజల హక్కుల కోసం పోరాడ్డమే విఎస్ జీవిత లక్ష్యం. ఒక గొప్ప ముఖ్యమంత్రిగా, మహోన్నత ప్రజా నాయకుడుగా, కేరళ ఎన్నడూ చూసి ఎరుగని ధీరోదాత్త ప్రతిపక్ష నాయకునిగా విఎస్ చిరకాలం మన జ్ఞాపకాల్లో నిలిచిపోతారు. ఒక టైలర్, కొబ్బరి పీచు కార్మికుని స్థాయి నుండి ఆయన పోరాటాల ద్వారా ఆయన ఉద్యమ శిఖరానికీ, ప్రభుత్వ శిఖరానికీ చేరుకున్నారు. అన్ని విధాలా ఆయన తిరుగులేని పోరాటయోధుడు, కార్మికోద్యమానికి నిజమైన నాయకుడు. ఒక నిజమైన చేతిపనివాని స్థానం నుండి ఆయన శిఖరాగ్రానికి చేరుకున్నాడు. 20వ శతాబ్దాన్ని, 21వ శతాబ్దంతో కలిపిన నిరంతర పోరాట జీవితం...అదే కామ్రేడ్ విఎస్ అచ్యుతా నందన్.

❃

ఈ మాసం ప్రత్యేకం

# జనరేషన్ ‘జెడ్’ యువతరాన్ని అర్థం చేసుకోవడం ఎలా?



ప్రొ॥ మాతంగి కృష్ణమూర్తి మద్రాసు ఐఐటిలో ఆంథ్రపాలజీ అసోసియేట్ ప్రొఫెసర్



రమా బిజపుర్కార్ మార్కెటింగ్ పరిశోధకురాలు, భారత దేశంలోని వినియోగదారీ వ్యవహారాలు నిపుణులు

ప్రొ॥మాతంగి కృష్ణమూర్తి, రమా బిజాపుర్కార్



ఎన్నికల అనంతరం మళ్లీ మన ముందు ఈ ప్రశ్న తలెత్తుతోంది. అత్యధిక జనాభా కలిగి ఉన్న మన దేశ భవిష్యత్తు ఎలా ఉండబోతోంది? ఈ అవకాశాన్ని మనం ఎలా ముందుకు తీసుకెళ్లాలి అనుకుంటున్నాం. ఇప్పుడున్న లెక్కల ప్రకారం చూసినా రాబోయే 30 ఏళ్లలో మన దేశం యువ జనాభాతో అలరారుతూ ఉంటుంది. పది నుండి 24 ఏళ్ల వయసు ఉండే అత్యధిక యువతను శ్రామిక జనాభాతో ఏ మేరకు ఈముద్చుకోగలుగుతాం? అందుకు గల అవకాశాలు ఏమిటి? ఇవీ మనం పరిష్కరించాల్సిన ప్రశ్నలు.

దేశ యువత – “జనరేషన్ జెడ్” – లక్షణాలు గురించి విస్తృతమైన కథనాలు ఉన్నాయి. ఒక వంక వాళ్ళని అతి జ్ఞానవంతులుగా, అతి కలివిడి భావం కలవారిగా, అతి వ్యక్తికరణ స్వభావం ఉన్న వాళ్లుగా చూస్తూనే మరోవైపు పని పట్ల నిబద్ధత లేనివారుగానూ, విమర్శను భరించలేని వాళ్ల గాను, వాతావరణ మార్పులకు తట్టుకోలేని వాళ్ల గాను పరిగణిస్తున్నారు. అంతేకాదు వాళ్ళకి ఉన్న లేక జ్ఞానపరిమితి మూలంగా అతి సున్నితత్వ ధోరణి, భావోద్వేగాలపరంగా ఇట్టే కిందమీదులయ్యే వ్యవహార శైలికి లోనవుతుంటారు కాబట్టి వీళ్ళతో కలిసి పనిచేయడం కష్టమని నిష్టురంగా చెబుతుంటారు. సామాజిక మాధ్యమాల నైపుణ్యంలో అత్యున్నత భాషా పటిమ భావోద్వేగాలను ఏక్‌దమ్‌గా ప్రదర్శిస్తూ స్వీయ అస్తిత్వ గుర్తింపు కోసం తహతహలాడుతుంటారు అని కూడా చెప్పుకొస్తుంటారు. కొట్టొచ్చినట్లు కనబడే ఇంత భారీ సంఖ్యలో ఉన్న యువత స్వదేశీ జ్ఞానవంతులైన ఇంత పెద్ద జనాభా గురించి ఈ రకమైన అంచనాలకు రావడం పైపై వ్యాఖ్యలే అనిపిస్తాయి. మరీ ముఖ్యంగా కులము, వర్గము, జెండర్ ప్రాతిపదికన వీరిని వర్గీకరించ చూస్తే పైన చెప్పుకున్న లక్షణాలు గంపగుత్తగా అందరికీ వర్తించేవి కాదు అనిపిస్తుంది. అయితే మరి ఈ యువతరంలో నెలకొన్న ప్రత్యేక లక్షణాలు గుర్తించడం ఎలా? వాటిని సందర్భోచితంగా రూపొందించడం ఎలా, ఇంత పెద్ద సంఖ్యలో యువతరం పొందడమే మన దేశానికి కలిసి వచ్చే అవకాశం అయినప్పుడు ఈ యువత ఎవరు, ఎలా ఉన్నారు అనే అంశాలు లోతుగా పరిశీలించాలి.

2023 – 2024లో మేము టైర్ 1, టైర్ 2 కు చెందిన 12 నగరాలలోని మధ్య తరగతి కుటుంబాలలోని 18, 24, 25, 30 ఏళ్ల వయసు గల యువతరం మీద ఒక అధ్యయనం నిర్వహించాం. ఇందులో సగం మంది ఆయా కుటుంబాలలో కాలేజీ విద్యకు నోచుకుంటున్న తొలితరం ప్రతినిధులు. ఈ అధ్యయనంలో మాకు పదే పదే అనేక వైరుధ్యాలు ఎదురయ్యాయి. ఈ వైరుధ్యాల గురించి వివరించడం అంత తేలికైన విషయం కాదు. ఎందుకంటే ఇవి చిన్న చిన్న వైరుధ్యాలు కాదు. ఎవరి ఆసక్తులకు అనుగుణంగా వారు స్పందించారు. ఎవరికి వాళ్లే ప్రత్యేకంగా అనిపించారు. ఐతే వీరు తీవ్ర అనిశ్చితితో ఉన్నారు. తమకు అవరోధంగా ఉన్న సామాజిక, ఆర్థిక రాజకీయ అంశాలను అధిగమించడానికి ఎంతో శ్రమిస్తున్నారు. ఈ అధ్యయన ఫలితాలను కూలంకషంగా విశ్లేషించిన తరువాత ఈ యువతరం ఈ ప్రపంచాన్ని ఎలా అర్థం చేసుకుంటున్నది, అందులో వాళ్ల స్థానం ఏమిటని భావిస్తున్నదో విశాల ప్రాతిపదికన ఒక అంచనాకు రాగలిగాం.

### చరిత్ర నోయలేని తరం

ముందుగా చెప్పుకోవాలంటే, ఈ తరం తమకు చరిత్ర స్పృహ లేనట్లుగానే స్పందించింది. ఈ పిల్లల తల్లిదండ్రులు గత మూడు దశాబ్దాల నయా–ఉదారవాద విధానాల నేపథ్యంలో ఆర్థికంగా పైకి ఎదిగిన పరిస్థితులు ఇందుకు పాక్షిక కారణంగా మనం భావించవచ్చు. సాపేక్షంగా ఆర్థికోన్నతి సాధించడంతోపాటు ప్రపంచవ్యాప్తంగా వెల్లువెత్తిన సమాచార వ్యాప్తి ప్రభావంతో

> **"చరిత్ర పట్ల తగినంత పరిజ్ఞానం లేకపోవడం వల్ల దీర్ఘకాలంలో వాటిలో నష్టం ఏమిటో ఈ యువతరం గ్రహింపులో లేదు. అగమ్య గోచరంగా ఉన్న భవిష్యత్తులో వాళ్ళు ఏం సాధించినా దాన్ని తమ నియమ నిబంధనలకు అనుగుణంగా సాధించుకున్నాం అనే ధోరణి ప్రదర్శిస్తు న్నారు. నేటి ప్రపంచంలో ఎలా ముందుకు పోవాలి అనే విషయమై ఎవరి లెక్కలు వాళ్ళకి ఉన్నాయి."**

యువతరం ఒక విధమైన అహంకారపూరిత ధోరణులతో వెలుగుతున్నారు. నయా-ఉదారవాద సిద్ధాంతం వ్యక్తివాద తత్వాన్ని పెంపొందిస్తుంది. ఈ ప్రభావంలో పడి యువతరం ఎవరికివారు తన జీవిత గమ్యానికి, లక్ష్యానికి తానే రాజు, తానే మంత్రి, తానే సైనికుడ్ని అని భావించుకుంటున్నారు. కానీ పాత సమాజపు అవ లక్షణాలు అయిన జెండర్, కులంతో పాటు వర్గం, అలానే విఫల విద్యా వ్యవస్థ మూలంగా యువతరం వాళ్ళ కలలను సాకారం చేసుకోలేని పరిస్థితిని ఎదుర్కొంటున్నది.

చరిత్ర పట్ల తగినంత పరిజ్ఞానం లేకపోవడం మూలంగా దీర్ఘకాలంలో వాటిలో నష్టం ఏమిటో ఈ యువతరం గ్రహింపులో లేదు. అగమ్య గోచరంగా ఉన్న భవిష్యత్తులో వాళ్ళు ఏం సాధించినా దాన్ని తమ నియమ నిబంధనలకు అనుగుణంగా సాధించుకున్నాం అనే ధోరణి ప్రదర్శిస్తున్నారు. నేటి ప్రపంచంలో ఎలా ముందుకు పోవాలి అనే విషయమై ఎవరి లెక్కలు వాళ్ళకి ఉన్నాయి. ఈ ప్రపంచంలో నా విలువ ఏమిటో ఎలా చాటి చెప్పుకోవాలి? నా విలువను గుర్తించడానికి నన్ను నేను ఈ ప్రపంచానికి ఎలా పరిచయం చేసుకోవాలి? నేను నా కాలాన్ని ఎంత మేరకు 'విలువ' గా మార్చుకోవాలి అన్న రంధిలో మునిగి తేలుతున్నారు. అవకాశాలు మెండుగా ఉన్నాయని చెబుతున్న ఈ ప్రపంచంలో అవకాశాలు అందుకోవడానికి సరళమైన మార్గాలను గానీ, నిర్మాణాలు గానీ లేని కారణంగా యువతరం ఈ గందరగోళ సాంస్కృతిక, ఆర్థిక అవరోధాలన్నిటిపీ నెట్టుకొనే అవకాశాలను దొరకబుచ్చుకోవడానికి తీవ్రంగా శ్రమిస్తున్నారు. తేలింది ఏమిటంటే యువతరం ఆ అవకాశాలు దక్కించుకోవడానికి వివిధ శిక్షణలు, విద్యలను అభ్యసిస్తూ దొరికిన చిన్నా చితక కొలువుల్లో చేరుతున్నారు. ఈ కొలువులన్నీ తాత్కాలికమే. నైపుణ్యం సంపాదించడానికి అవసరమైన విద్య నేర్వాలన్నా, శిక్షణ పొందాలన్నా వేలకు వేలు ఫీజులు చెల్లించాల్సి వస్తోంది.

**ప్రపంచంతో అస్థిర, అయోమయ సంబంధం**

ఈ రకమైన పెనుగులాటలో విలవిలలాడుతున్న నేటి యువతరం వర్తమాన ప్రపంచంతో అస్థిర, అయోమయ సంబంధాలో కూరుకు పోతున్నారు. సంరక్షణ పొందుతున్నారు. అందుకే విపరీత ధోరణు లకు, పరాయి కరణకు ఇట్టే దగ్గరవుతున్నారు. వాళ్ళని అర్థం చేసుకొని, యథాతథంగా వారిని స్వీకరించే దయగల సమాజం కోసం అర్రులు చాస్తున్నారు. దీనితో వీరు తీవ్రమానసిక, శారీరక ఒత్తిడికి గురవుతున్నారు. తరచు అనారోగ్యం పాలవడం, మానసిక దుర్బల త్వానికి లోనవ్వ డం పరిమితిగా మారింది. ఈ ప్రపంచంలో నా అస్తిత్వం ఏమిటి అన్న వేదనకు గురవుతున్నారు. ఇలా పరాయీకరణకు గురయిన సందర్భంలో కుటుంబ సభ్యుల నుండి కొంత సహకారం అందుతున్నా అది వాస్తవిక అవగాహనతో అందుతున్న సహకారమా కాదా అనేది సందేహాస్పదంగానే మిగిలి పోతుంది.

తల్లిదండ్రులు, ఇతర కుటుంబ సభ్యులు సహజంగానే ఇలాంటి పరిస్థితులలో అండగా నిలబడుతున్నా తగిన సంరక్షణ అందించే నైపుణ్యాలు వారి దగ్గర ఉండవు.

మా అధ్యయనంలో తేలిన మరో ఆశ్చర్యకర అంశం ఏమిటంటే - ఈ యువతరం జీవితంలో తమకు స్థిరత్వాన్ని ఇచ్చే వ్యవస్థ కావాలని బలంగా కోరుకుంటున్నారు. ప్రేమ, శృంగారం వంటివి పక్కదోవ పట్టించే విషయాలు, తమ ఎదుగుదలకు ఆటంకాలు - ఇరవైలు నిండే నాటికి స్థిరమైన ఏదో ఒక ప్రభుత్వ ఉద్యోగంలో కుదురుకున్నాక ఆ తర్వాత పెళ్లి, సంసారం, పిల్లల గురించి ఆలోచించుకుందాం అన్న అభిప్రాయాలతో ఉన్నారు. సమాజం పట్ల, కుటుంబ వ్యవహారాల మీదా వీరంతా ఒకే విధమైన సంకుచిత భావాలతో ఉన్నారు. ఈ గందర గోళ కాలం, వ్యవస్థల నుండి ఎప్పుడెప్పుడు తప్పుకొని జీవితంలో స్థిరపడతామో అన్ని ఆకాంక్షలతో ఉన్నారు. అంతు చిక్కని సంతోషం, శాంతం, సౌఖ్యాల కోసం పరితపించిపోతున్నారు.

**నిరంతరం ఉపశమనం, ప్రక్కతోవల కోసం వెతుకులాట**

నిత్యజీవితంలో ఎదురవుతున్న ఒత్తిడిల నుండి బయటపడడానికి ఉపశమనం పొందడానికి పక్క త్రోవల కోసం వెతుకులాటలో ఉన్నది నేటి యువతరం. ఇందులో భాగంగానే అన్నీ తెలిసి కూడా పైపై మెరుగుల వ్యవహారాల వెంటబడి కొట్టుకు పోతున్నారు. కొంతమంది దీనిని విచ్చలవిడి వినియోగదారి తత్వంగా చూస్తున్నారు కానీ వేగంగా ప్రపంచీకరణ వైపు అడుగులు సాగుతున్న ఈ దేశంలో సరుకులు మానవ అస్తిత్వానికి దాఖలాగా మారుతూ, సాంఘిక హోదాను కట్టబెడుతున్న ధోరణులు ప్రబలి పోవడమే ఇందుకు కారణం అని గుర్తించాలి. ఖరీదైన, భారీ ఆర్భాటపు సరుకులు, వస్తువుల మీద దృష్టి ఉన్న వీళ్ళు చౌకగా వచ్చే వాటిని కొనుగోలు చేసి పైపై మెరుగులు ప్రదర్శి స్తుంటారు. ఈ యువతరానికి విపరీతమైన సమాచార దాహం ఉన్నది. ఎక్కడ లేని సమాచారమూ వీళ్ళకే కావాలి. తాజా సమాచారంతో పాటు ఉపశమనం కలిగించే సమాచారం కోసము అన్వేషిస్తుంటారు. అంటే నికరంగా ఏదో ఒక అంశం మీద అపేక్షను పెంచుకోవడం కాకుండా తక్షణ వర్తమాన సమాచారంతో ఎక్కువగా సాన్నిహిత్యం నెరపుతుంటారు. నిరంతరం వాళ్లు వినోదం కానీయండి, ఉపశమనం కోసం కానీయండి, గుర్తింపు కోసం కానీయండి - ఏదో ఒకదానితో నిమగ్నమై ఉంటారుల.

ఎంత సులువుగా వినోదం దక్కించు కోవాలని చూస్తారో, సమాచారం కూడా అంత సులువుగా దక్కాలని చూస్తుంటారు తప్పితే విషయం లోతులకు పోరు. తాము అందుకునే సమాచారం విశ్వసనీయమైనదా కాదా అనే పట్టింపు కూడా విళ్ళలో లేదు. రకరకాల మాధ్యమాల ద్వారా అంటే పుక్కిటి జ్ఞానం అంతా పోగేసుకుంటూ ఉంటారు. అందుకే వీళ్ళు ఏ సిద్ధాంతాల వైపు మొగ్గ చూపరు. స్వానుభవంలో వాళ్ళ జీవితాలకు అతి సమీపంగా ఉంటే తప్ప వీరిలో సిద్ధాంత దృష్టి ఉండదు. అభివృద్ధి అంటూ నోటి మాటగా

వల్లె వేసే పదాల పట్ల విపరీతమైన ఆకర్షణ ఉంటుంది గానీ ఆ పదం పట్ల లోతైన అవగాహన కూడా లేదు వీళ్ళకు. అలాగే వీళ్ళు చేసే విమర్శలు కూడా నిర్దిష్టమైన రాజకీయ అవగాహనతో చేసేవి కావు. వాళ్ళ దృష్టిలో ప్రభుత్వం, దేశం, వేర్వేరు అంశాలు. ప్రభుత్వం పనికిమాలినది అయినా దేశం గురించి గొప్పలు చెప్పుకోవాలి అనే ధోరణి వీళ్ళది. స్థిరమైన భవిష్యత్తు కోసం మరల అదే ప్రభుత్వం మీద ఆశలు పెట్టుకుంటారు. ఏతావాతా ఈ తరం యువతరం ఏ నిర్దిష్ట రాజకీయ సిద్ధాంతానికో, రాజకీయ పార్టీకో కట్టుబడి లేరు అని అర్థం చేసుకోవచ్చు.

**శుభవార్త**

ఇప్పటివరకు మనం నేటి యువతరం గురించి తెలుసుకున్నవన్నీ చెడు వార్తలే కాబట్టి వాళ్ల గురించి శుభవార్తలు కూడా తెలుసుకుందాం. మేం కలిసిన యువతరం ప్రతినిధులు అందరూ తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్న వాళ్లే కానీ ఆశలు వదిలేసుకున్న వాళ్ళు కాదు. వీళ్ళలో ఇంకా ఆలోచనా జ్ఞానం నశించిపోలేదు. ఆకాంక్షలు సమసిపోలేదు. జీవితంలో పైకి ఎదగాలన్న లక్ష్యాన్ని వదులుకోలేదు. అందుకోసం కావల్సిన సమాచార కేంద్రాలు, పనుల కోసం నిరంతరం అటో, ఇటో, ఎటో ప్రయాణం కడుతూనే ఉన్నారు. కానీ వారు ఆశించిన లక్ష్యాన్ని చేరుకోలేకపోతున్నారు. ఇవాళ దేశంలోని యువతరాన్ని నడిపిస్తున్నది ఏమిటి, దీని స్వరూప స్వభావాలు ఏమిటి? అని లోతుగా వివేచించడంలేదు. అందుకే ఒక లక్ష్యం కాకపోతే ఇంకో లక్ష్యం (ఒక కల కాకపోతే మరొక కల)ను నెరవేర్చుకోవడానికి, మనిషిగా సార్థకత సమకూర్చుకోవడానికి నిరంతరం తన నైపుణ్యాలకు మెరుగు పెట్టుకునే సరికొత్త నైపుణ్యాలను అలవర్చుకునే పనిలో ఉంటున్నారు. ఫలితంగా తరచూ ఒత్తిడికి, విసుగు వేర్పాట్లకు లోనవుతున్నారు.

దుర్బలమైన ఆర్థిక వ్యవస్థ, ఉద్యోగ అవకాశాల కొరత ఉన్న ఈ ప్రపంచంలో పరాయి కరణకు గురవుతున్న యువతరం పర్యావరణ మార్పులు, విద్య, జెండర్, కులం తదితర సమస్యలపై కృషి చేసే సమూహాలతో కలిసి పని చేస్తున్నారు. నిరాశలో కూరుకుపోయి ఇటు మళ్ళారా అని అనుకోవడానికి లేదు. ఎందుకంటే కుల వివక్షకు వ్యతిరేకంగా పనిచేస్తున్న వారెందరో సమాజంలో ఆ రకమైన వివక్షకు గురయినవారే, అలాగే ఈ అమానవీయ ఆచారాలు, సంప్రదాయాలు దుంపనాశనం అయిపోవాలని బలంగా ఆకాంక్షించేవారే. ఒకపక్క ఆధునిక ప్రపంచం ఈ యువతరాన్ని ఒంటి కొమ్ము కుందేలు వెతుకులాటలోకి నిరంతరాయంగా నెట్టెస్తుంటే మరో వంకన ఇలాంటి సామాజిక ఉద్యమాలు వారికి ఏదో ఒక మేరకు అలవిమాలిన సంతోషాన్ని. జీవితార్థన్ని కలిగిస్తున్నాయి.

"ఇప్పటివరకు మనం నేటి యువతరం గురించి తెలుసుకున్నవన్నీ చెడు వార్తలే కాబట్టి వాళ్ల గురించి శుభవార్తలు కూడా తెలుసుకుందాం. మేం కలిసిన యువతరం ప్రతినిధులు అందరూ తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్న వాళ్లే కానీ ఆశలు వదిలేసుకున్న వాళ్ళు కాదు. వీళ్ళలో ఇంకా ఆలోచనా జ్ఞానం నశించిపోలేదు. ఆకాంక్షలు సమసిపోలేదు. జీవితంలో పైకి ఎదగాలన్న లక్ష్యాన్ని వదులుకోలేదు."



గణేషోత్సవాల్లో యువతరం

**ముఖ్యాంశాలు**

ఈ వ్యాస రచయితలు నిర్వహించిన అధ్యయనంలో తేలిన ముఖ్యాంశాలు ఏమిటంటే యువతరం కుదురుగా లేరు. ఆర్థిక, సామాజిక, రాజకీయ అవరోధాలను అధిగమించి తమ లక్ష్యాన్ని సాధించుకోవడానికి తీవ్రంగా శ్రమిస్తున్నారు.

ఈ యువతరం తల్లిదండ్రులు గత మూడు దశాబ్దాల నయా–ఉదారవాద విధానాల పర్యవసానంగా ఆర్థికంగా ఒక మెట్టు పైకి ఎగబాకిన నేపథ్యంలో ఈ యువతరానికి చరిత్ర పట్ల సరైన స్పృహ లేకుండా పోయింది.

వీళ్లు తీవ్ర సమాచార దాహంతో ఉంటారు. వ్యక్తి వాద అహంభావ ధోరణులు పొడసూపుతూ ఉంటాయి. తమ లక్ష్యసాధనకు ఎదురయ్యే అన్ని అవరోధాలు, ఆటంకాలను అధిగమించాలని తపన పడుతుంటారు. జీవితంలో స్థిరపడి ప్రశాంతంగా, ఆనందంగా గడపాలనే ఆకాంక్షలతో ఉన్నారు.

సామాజిక శాస్త్ర పరిభాషలో చెప్పుకోవాలంటే, ఈ సమాచారాన్ని నిర్మాణం – 'ప్రవర్తన స్వేచ్ఛ' (స్ట్రక్చర్ – ఏజెన్సీ) ల పద్ధతిన మూల్యాంకనం చేయాలనుకుంటే – ఈ నిర్మాణాలతో తలపడుతూ అందమైన భవిష్యత్తు సాధించడానికి వ్యక్తిగత సామర్థ్యం సరిపోదు. ఇది ప్రమాదకరమైన పరిస్థితులకు సూచిక. ఈ యువతరం సంస్థాగత నిర్మాణాలకు వ్యతిరేకంగా తమ శక్తి యుక్తులన్నీ వినియోగించి పోరాడేందుకు సిద్ధంగా ఉన్నారు. కానీ దిశా నిర్దేశం లేని, ఒక రకంగా చెప్పాలంటే నిర్మాణరాహిత్య, క్రమ పద్ధతి రాహిత్యా పరిస్థితులను ఎదుర్కొంటున్నారు.

**ఆటంకాలను అధిగమించాలన్న ఆశావహ దృక్పథం**

అదే వాళ్ళ సొంత జీవితాల విషయానికి వస్తే వాళ్ళలో నిర్మాణరహిత్యం, నిరాశవాదం కానీ కనిపించవు. వాళ్ళు జీవితం పట్ల రోజువారి ఘటనలు, ఆచారాలు, సంప్రదాయాలు పట్ల ఉల్లాసంగా ఉంటారు. వీరు అనేక ఆటంకాలు ఎదురయినా వాటిని ఏదో ఒక విధంగా అధిగమిస్తాం అనే ఆశావహ దృక్పథంతో ఉన్నారు. 'నాకు కావలసిన వనరులు

(మిగతా 14వ పేజీలో)

# భారతదేశంలో పేదరికం-వాస్తవాలు



రచయిత ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రిక డిప్యూటీ అసోసియేట్ ఎడిటర్

**ఉదిత్ మిశ్రా**

భారతదేశంలో ఎంత శాతం పేదరికం ఉన్నదన్న అంశంపై, అంటే అధికారికంగా పేదలుగా ఉన్నవారి శాతంపై గత కొన్ని మాసాలుగా విస్తృతంగా వార్తలు వస్తున్నాయి.

మొదటగా ఏప్రిల్ 25వ తేదీన 'దారిద్రంపై పోరాటంలో భారతదేశం విజయం సాధించింది" అన్న పేరుతో భారత ప్రభుత్వం ఒక అధికారిక పత్రికా ప్రకటనను విడుదల చేసింది. అందులో 2025, ఏప్రిల్‌లో ప్రపంచ బ్యాంకు విడుదల చేసిన నివేదికలో "గత 10 సంవత్సరాలలో భారతదేశంలో 17.1 కోట్ల మందిని తీవ్ర దారిద్ర్యం నుండి బయటకు తీసుకొచ్చారు" అని పేర్కొన్న అంశాన్ని అందులో ఉటంకించారు.

తర్వాత జూన్ నెల ప్రారంభంలో దారిద్ర్యాన్ని అంచనా వేసే పద్ధతులు, దారిద్ర్య రేఖను గురించి ప్రపంచ బ్యాంకు పేర్కొన్నది. "2011-12లో భారతదేశంలో 27 శాతం మంది దారిద్ర్యంలో ఉండగా, ప్రస్తుతం 5.75 శాతం మంది మాత్రమే దారిద్ర్యంలో ఉన్నారు" అని చెప్పింది.

మొదటి అంశం, గతంలో వేసిన అంచనాలతో పోలిస్తే ప్రపంచబ్యాంకు వేసిన కొత్త అంచనాల ప్రకారం భారతదేశంలో దారిద్ర్యం తక్కువగా ఉన్నది. ఉదాహరణకు 1977-78 లో భారతదేశంలో దారిద్ర్యం 64 శాతం కాక, 47 శాతమే ఉన్నది! ఈ విధంగా ప్రపంచ బ్యాంకు గతంలో ఉన్న దారిద్ర్యం శాతాన్ని తగ్గించి చూపుతున్నది.

రెండవ అంశం: ప్రపంచబ్యాంకు కొత్త అంచనాలలో కొత్త దారిద్ర్య రేఖను అమలు చేయటం ప్రధానంగా ఉన్నది. రోజుకు, తలకు మూడు డాలర్లు ఆదాయం ఉన్నవారిని దారిద్ర్య రేఖ ఎగువన ఉన్నట్లుగా కొత్త అంచనాలు పరిగణిస్తున్నాయి. ఈ కొత్త ఆదాయ స్థాయి ప్రకారం పూర్తి దారిద్ర్యంలో బతుకుతున్న భారతీయులు 2011-12లో 27 శాతం- అంటే 34.44 కోట్లమంది- ఉండగా, 2022-23 నాటికి ఇది 6 శాతానికి- అంటే 7.5 కోట్లమంది-తగ్గింది.

ఈ వార్తపై ఎంత సంతోషం వ్యక్తం చేస్తున్నప్పటికీ, అనేకమంది ఈ అంకెలను పొరపాటుగా అర్థం చేసుకొంటున్నారు. ఈ అంకెలు చెబుతున్న నిజమైన అర్థం ఏమిటి? అనేకమంది ఈ అంకెలను ఎందుకు ప్రశ్నిస్తున్నారు? అనేది పరిశీలించాలి.

ఉదాహరణకు రోజుకు మూడు డాలర్లు దారిద్ర్యరేఖకు కొలబద్ధగా ఉన్నపుడు మనం దానిని 85 రూపాయలతో (అమెరికా డాలరు, భారతదేశపు రూపాయి మధ్య ప్రస్తుతం ఉన్న మారకం రేటు) హెచ్చవేస్తే రోజుకు 255 రూపాయలు అవుతుంది. ఈ ఆదాయం వస్తున్న ఒక భారతీయుడు పేదవాడా కాదా అని అంచనా వేయాలి!

కానీ ఆ విధంగా రూపాయి-డాలరు మారకం రేటు ప్రకారం రూపాయి విలువను పరిగణనలోకి తీసుకుంటే మనం పొరపాటు చేసినవారం అవుతాం. డాలర్ కొనుగోలు శక్తిని ప్రాతిపదికగా తీసుకొని, రోజుకు మూడు డాలర్ల ఆదాయం వస్తే దారిద్ర్యరేఖను దాటవచ్చునని నిర్ణయించారు. ఒక డాలరుతో కొనగల సరుకులు, 85 రూపాయలతో కొనగల సరుకులు- రెండింటి కొనుగోలు శక్తిని- పోల్చిచూస్తే డాలరుకు 85 రూపాయలు కాక, 20.6 రూపాయలు మాత్రమే వస్తాయి.

**దారిద్ర్యరేఖ అంటే ఏమిటి?**

సాధారణమైన మాటలలో చెప్పుకోవాలంటే ఏ ఆర్థికవ్యవస్థలోనైనా ఎవరు పేదలు అని నిర్ణయించటానికి ప్రాతిపదికగా ఉపయోగించేది ఆదాయ పరిమితి. దారిద్ర్యరేఖ నిర్ణయం అర్థవంతంగా ఉండాలంటే దానిని నిర్ణయించే ప్రాంతాన్ని, కాలాన్ని పరిగణనలోకి తీసుకోవటం కీలకమైనది. ఉదాహరణకు 1975లో నెలకు వెయ్యి రూపాయల జీతం తీసుకొనే భారతీయుడ్ని పేదగా పరిగణించకపోవచ్చు. కాని ఈ రోజు ఆ మొత్తం (రోజుకు 33.33 రూపాయలు)తో కొనగలిగినది చాలా తక్కువగా ఉంటుంది.

ఆ విధంగానే ఈ రోజు పాట్నాలో నెలకు లక్ష రూపాయల-రోజుకు 3,333 రూపాయలు- జీతం వస్తున్న వ్యక్తి సుఖంగానే జీవించవచ్చు. కాని అదే జీతంతో న్యూయార్క్ లేదా ప్యారిస్‌లలో అంత సుఖంగా జీవించ లేదు.

అందువలన దారిద్ర్యం అనేది ఒకే స్థాయిలో లేనపుడు- ఒకరికి మంచి జీవితం గడిపే స్థాయి మరొకరికి పర్వాలేదనిపించేలా, ఇంకొకరికి అస్తుబిస్తుగా ఉండవచ్చు. ఆ పరిస్థితులు, విశ్లేషణలను ఉపయోగించి, అనేక దారిద్ర్యరేఖలను రూపొందించుకోవచ్చు.

**దారిద్ర్యరేఖ కొలవడం వల్ల ఉపయోగం ఏమిటి?**

అభివృద్ధి చెందుతున్న, పేద దేశాలలోని ప్రభుత్వాలు వారి దేశంలో దారిద్ర్యం ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవాలని కోరుకుంటాయి. ఇది తెలుసుకోవటం వలన రెండు రకాల ఉపయోగాలు ఉన్నాయి. ఒకటి, దారిద్ర్యం ఎంత ఉందో తెలుసుకొని, పేదలుగా ఉన్నవారికి సహాయం అందించటం కోసం సంక్షేమ పథకాలను రూపొందించవచ్చు. రెండవది, తాము రూపొందించిన విధానాలు వాస్తవంగా ఆశించిన ఫలితాలను ఇస్తున్నాయా, దారిద్ర్యాన్ని తగ్గించి, సంక్షేమానికి దోహదం చేస్తున్నాయా, లేదా అన్న అంశాలను ప్రభుత్వాలు, విధాన నిర్ణేతలు, విశ్లేషకులు అర్థం చేసుకోవటం సాధ్యమౌతుంది.

దేశంలోని దారిద్ర్యాన్ని అంచనా వేయటం కోసం ప్రపంచబ్యాంకు నిర్ణయించిన


దారిద్ర్యరేఖను ప్రభుత్వం ఎందుకు ఉపయోగిస్తున్నది? చారిత్రకంగా చూస్తే భారతదేశంలోని ప్రభుత్వం దారిద్ర్యాన్ని అంచనా వేస్తున్న, అందుకు అవసరమైన సమాచారాన్ని సేకరించే విధానం తమ దేశాలలోని దారిద్ర్యాన్ని అంచనా వేసుకోవటానికి ఇతర దేశాలకు మార్గదర్శిగా నిలిచింది. దారిద్ర్యాన్ని అంచనా వేయటంలో భారతదేశం ప్రపంచంలో అగ్రస్థానంలో ఉన్నది.

అయినప్పటికీ భారతదేశంలో అధికారికంగా నిర్ణయించిన దారిద్ర్యరేఖను 2011-12లో రూపొందించారు. ఢిల్లీలోని ఆర్థికవేత్తలలో ప్రముఖుడైన సురేశ్ టెండూల్కర్ నాయకత్వంలోని కమిటి 2009లో రూపొందించిన ఫార్ములా ప్రాతిపదికగా ఈ దారిద్ర్యరేఖను నిర్ధారించారు. ఆ తర్వాత ఈ పద్ధతిని ఆధునీకరించలేదు.

కొత్త పద్ధతిని రూపొందించటం కోసం ఆర్‌బిఐ మాజీ గవర్నర్ సి రంగరాజన్ నేతృత్వంలో 2014లో కమిటీని ఏర్పాటు చేశారు. కానీ వారి ప్రతిపాదనలను అధికారికంగా ఆమోదించలేదు.

ఆ తర్వాత సమాచారాన్ని సేకరించే విధానంలో మార్పులు చేయటం, కొన్ని అంశాలను శూన్యంగా వదిలివేయటం వలన భారతదేశం నీతి ఆయోగ్ రూపొందించిన బహుళ అంశాలతో కూడిన దారిద్ర్యరేఖ, (దారిద్ర్యాన్ని అంచనా వేయటంలో ఇది మౌలికంగా భిన్నమైనది) లేదా ప్రపంచబ్యాంకు రూపొందించిన దారిద్ర్యరేఖపై ఆధారపడు తున్నది.

"టెండూల్కర్ కమిటి సిఫార్సులకు ముందు భారతదేశం అంతర్గతంగా రూపొందించుకున్న దారిద్ర్య రేఖ ప్రకారం 2009లో పట్టణ ప్రాంతంలో తలసరి రోజుకు 17 రూపాయలు, గ్రామీణ ప్రాంతంలో తలసరి రోజుకు 12 రూపాయల ఆదాయం దారిద్ర్యరేఖకు ప్రాతిపదికగా తీసుకున్నారు."



భారత దేశ పట్టణాల్లో తరచుగా కనిపించే మురికివాడ

**ప్రపంచబ్యాంకు దారిద్ర్యరేఖ అంటే ఏమిటి? దానిలో దారిద్ర్యాన్ని ఎలా అంచనా వేస్తారు?**

ఇంతకు ముందు ప్రస్తావించినట్లుగానే ఒక ప్రత్యేకమైన సమయం, అందుకు ఎంచుకున్న ప్రాంతంలో అపుడు ఉన్న కొనుగోలు శక్తిపై ఆధారపడి దారిద్ర్యరేఖకు ప్రాధాన్యత ఉంటుంది. సమాన కొనుగోలు శక్తి (పిపిపి) ప్రాతిపదికగా ప్రపంచబ్యాంకు దారిద్ర్యరేఖను రూపొందించింది.

రోజుకు డాలర్ ఆదాయం ప్రాతిపదికగా మొదటిసారి దారిద్ర్యరేఖను రూపొందించారు. దానిని రూపొందించిన విధానం: 1990లో కొందరు స్వతంత్ర పరిశోధకులు, ప్రపంచ బ్యాంకు నిపుణులు కలిసి ప్రపంచంలో పేదరికంలో ఉన్న కొన్ని దేశాలలోని దారిద్ర్య రేఖలను పరిశీలించారు. ఆ దేశాల ద్రవ్య మారకం రేటును ఉమ్మడి ద్రవ్యంగా మార్చి, కొనుగోలు శక్తిని ప్రాతిపదికగా తీసుకున్నారు. వివిధ దేశాలలో సరుకులు, సేవలు ఒకే ధరకు అందుబాటులో ఉంటాయన్న భావనతో మారకం రేటు, కొనుగోలు శక్తిని నిర్ధారించారు. ఆ విధంగా ఉమ్మడి ద్రవ్యంలోకి మార్చిన తర్వాత, 1980 ప్రాంతంలో అత్యంత దారిద్ర్యంలో ఉన్న ఆరు పేద దేశాలలో 1985లో ఉన్న ధరలను ప్రాతిపదికగా తీసుకున్నారు. ఆ ధరల ప్రాతి పదికగా దారిద్ర్యాన్ని కొలవటానికి తలకు రోజుకు డాలర్ ఆదాయాన్ని నిర్ణయించారు. ఈ విధంగా రోజుకు డాలర్ ఆదాయంతో మొదటి అంతర్జాతీయ దారిద్ర్య రేఖను ప్రపంచబ్యాంకు నిర్ధారించింది.

కాలం గడిచేకొద్దీ అన్ని దేశాలలోనూ ధరలు పెరుగుతుండటంతో ప్రపంచబ్యాంకు దారిద్ర్యరేఖను నిర్ణయించే ఆదాయ పరిమితిని పెంచింది. ఆదాయ పరిమితిని 2025, జూన్ నెలలో రోజుకు, తలకు 3 డాలర్లుగా నిర్ణయించారు.

2025లో సమాన కొనుగోలు శక్తిని అనుసరించి మన 85 రూపాయలు 20.6 రూపాయలుగా ఉన్నాయి. ఆ విధంగా తీవ్రమైన దారిద్ర్యం, లేక దారిద్ర్యంలో ఉన్నట్లు భావించటానికి అమెరికాలో తలకు, రోజుకు 3 డాలర్ల కన్నా తక్కువ ఆదాయం ఉండాలి. అదే భారతదేశంలో అయితే రోజుకు, తలకు 62 రూపాయల కన్నా తక్కువగా ఉండాలి.

కొనుగోలు శక్తిని ప్రాతిపదికగా తీసుకుంటే బ్రిటన్ పౌండ్ 0.67 డాలర్లు కాగా, చైనా రెన్‌మిన్‌బి 3.45 డాలర్లుగా, ఇరాన్ కరెన్సి అత్యధికంగా 1,65,350 రియాల్స్‌కు ఒక డాలరుగా ఉంది.

**భారతదేశంలో అంతర్గత దారిద్ర్యరేఖలు గతంలో ఏ విధంగా ఉన్నాయి?**

టెండూల్కర్ కమిటి సిఫార్సులకు ముందు భారతదేశం అంతర్గతంగా రూపొందించుకున్న దారిద్ర్యరేఖ ప్రకారం 2009లో పట్టణ ప్రాంతంలో తలసరి రోజుకు 17 రూపాయలు, గ్రామీణ ప్రాంతంలో తలసరి రోజుకు 12 రూపాయల ఆదాయం దారిద్ర్యరేఖకు ప్రాతిపదికగా తీసుకున్నారు.

2009లో టెండూల్కర్ పట్టణ ప్రాంతాలలో తలసరి ఆదాయ పరిమితిని 29 రూపాయలకు, గ్రామీణ ప్రాంతాలలో 22 రూపాయలకు పెంచాడు. తర్వాత 2011-12లో వరుసగా 36, 30 రూపాయలకు ఈ పరిమితిని పెంచాడు.

> **"దారిద్ర్య రేఖను గురించి దేశీయంగా స్థిరమైన, తాజా అంచనాలు లేకపోవటం, సమాచారాన్ని సేకరించటంలో చేసిన మార్పులు, కొన్ని అంశాలను శూన్యంగా వదలటం వలన దరిద్రాన్ని గురించి భారతదేశం వేస్తున్న అంచనాలు తీవ్రమైన గందరగోళానికి, వివాదాలకు కారణమౌతున్నాయి. దారిద్ర్యాన్ని అంచనా వేయటానికి అనుసరిస్తున్న భిన్నమైన పద్ధతుల వలన దేశంలో దరిద్రం అతి తక్కువగా రెండు శాతం, అత్యధికంగా 82 శాతంగా ఉన్నాయని అంచనాలు వేస్తున్నారు."**

దారిద్ర్యరేఖ పరిమితిని పట్టణాలలో 47, గ్రామాలలో 33 రూపాయలకు పెంచాలని 2014లో రంగరాజన్ సిఫార్సు చేశాడు.

**దారిద్ర్యంపై భారతదేశ అంచనాలను సవాల్ చేస్తున్న నిపుణులు**

ఢిల్లీలోని జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీలో ఆర్థికశాస్త్రంలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్న ఆర్థికవేత్త హిమాన్షు, చివరి అధికారిక దారిద్ర్య రేఖను రూపొందించేటపుడు టెండూల్కర్‌తో కలిసి పనిచేసిన మరొకరు ఈ అంశంపై విస్తృతంగా రచనలు చేశారు.

దారిద్ర్య రేఖను గురించి దేశీయంగా స్థిరమైన, తాజా అంచనాలు లేకపోవటం, సమాచారాన్ని సేకరించటంలో చేసిన మార్పులు, కొన్ని అంశాలను శూన్యంగా వదలటం వలన దరిద్రాన్ని గురించి భారతదేశం వేస్తున్న అంచనాలు తీవ్రమైన గందరగోళానికి, వివాదాలకు కారణమౌతున్నాయి.

దరిద్రాన్ని అంచనా వేయటానికి అనుసరిస్తున్న భిన్నమైన పద్ధతుల వలన దేశంలో దరిద్రం అతి తక్కువగా రెండు శాతం, అత్యధికంగా 82 శాతంగా ఉన్నాయని అంచనాలు వేస్తున్నారు. దారిద్ర్యం శాతాన్ని తగ్గించి చూపటంలో కూడా ఇదే విధమైన మార్పులు ఉంటున్నాయి. అత్యంత ఎక్కువగా, లేదా అతి తక్కువగా దారిద్ర్యం ఉన్నదని అంచనాలు వేస్తున్నారు.

ఎక్కువ మంది ప్రజలు తక్కువ ఆదాయం పొందుతుండటం వలన వినియోగ వ్యయం తక్కువగా ఉంటున్నది. దారిద్ర్యాన్ని అధ్యయనం చేయటంలో భారతదేశానికి ప్రతిష్ఠాత్మకమైన రికార్డు ఉన్న పరిస్థితులలో, అధ్యయనం చేసే వారి దృక్పథాన్ని బట్టి దారిద్ర్యపు స్థాయి ఉంటున్నది.

ఒక వ్యక్తి పేదవాడా కాదా అని ఏ విధంగా నిర్ణయిస్తారు? ఎంతమంది పేదలు ఉన్నారు? రోజుకు 62 రూపాయల కన్నా తక్కువ –కొనుగోలు శక్తి ప్రాతిపదికగా– ఆదాయం వచ్చే 5.75 శాతం మంది మాత్రమే దరిద్రులని వారు పేర్కొంటారా?

భారతదేశం లాంటి దిగువ మధ్య తరగతి ఆదాయం వస్తున్న దేశాలలో 24 శాతం మంది దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నారన్న అంచనాలను తీసుకుంటారా? అత్యంత తక్కువ వేతనాల కోసం పని చేయటానికి స్వచ్ఛందంగా బారులు తీరుతున్న 20 శాతం మంది భారతీయులు దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నట్లు భావిస్తారా? లేక చట్ట ప్రకారం ఉచితంగా ఆహారధాన్యాలను పొందుతున్న 66 శాతం మంది దారిద్ర్య రేఖ దిగువన ఉన్నట్లు లెక్కిస్తారా?

ఈ సంవత్సరం ప్రారంభంలో కేంద్ర బడ్జెట్‌ను ప్రతిపాదించేటపుడు సంవత్సరానికి 12 లక్షల రూపాయల వరకు ఆదాయం పొందుతున్న వారి ఆదాయపు పన్నును ప్రభుత్వం రద్దు చేసింది. సంవత్సరానికి 12 లక్షల రూపాయలు అంటే రోజుకు 3,288 రూపాయల ఆదాయం వస్తుంది. సారాంశం చూస్తే అటువంటి వారిపై ఆదాయపు పన్ను వేసి, అధిక పన్నుల భారం మోపటం వారి వినియోగాన్ని కుదిస్తుందని, ఆర్థికవ్యవస్థ విస్తృతిని అడ్డుకుంటుందని ప్రభుత్వం భావిస్తున్నది.

పరస్పరం విరుద్ధమైనవి కానప్పటికీ ప్రపంబ్యాంకు లెక్కలను పరిశీలించటంలో రెండు దృక్పథాలు ఉన్నాయి. ఒకటి, రోజుకు 3 డాలర్లు– కొనుగోలు శక్తి ప్రాతిపదికన రోజుకు 62 రూపాయలు– ఆదాయం వస్తున్న వారిసంఖ్య తగ్గటాన్ని దరిద్రరేఖ దిగువ ఉన్నవారి సంఖ్య తగ్గటంగా పరిగణించి సంబరాలు చేసుకోవటం. రెండవది, రోజుకు 171 రూపాయల ఆదాయంతో 83 శాతం మంది భారతీయులు బతుకులీడుస్తున్నారు కాబట్టి వాస్తవ ఆర్థిక పరిస్థితులను అర్థం చేసుకోవటానికి మనం ప్రయత్నం చేయాలి. దారిద్ర్య రేఖ నిర్ధారణలో అన్ని ఆదాయాలు, ఖర్చులను పరిగణనలోకి తీసుకుంటారని గుర్తుంచుకొండి.

**(అనువాదం: ఎ కోటిరెడ్డి)**

**'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా.**

**సెల్: 9490099333** email: venkataraosankarapu@gmail.com

ఎన్నికల భారతం

# బీహార్‌లో పెద్దఎత్తున ఓట్లు తొలగించే ప్రమాదం

**సోని మిశ్రా**



రచయిత ఢిల్లీ కేంద్రంగా పనిచేస్తున్న జర్నలిస్టు, ఫ్రంట్‌లైన్ డిప్యూటీ ఎడిటర్

బీహార్‌లో నాలుగు నెలల్లో శాసన సభ ఎన్నికలు జరగబోతున్నాయనగా జూన్ 24న రాష్ట్రంలో ప్రత్యేక తీవ్ర ఓట్ల రివిజన్ (ఎస్ఐఆర్‌సర్) నిర్వహిస్తున్నట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. ప్రకటించిన మరునాడే అమలు కూడా ప్రారంభించింది.

బీహార్‌లో 7.9 కోట్ల మంది ఓటర్లున్నారు. గతంలో 2003 జనవరిలో నిర్వహించిన తీవ్ర ఓట్ల రివిజన్ తరువాత రాష్ట్రంలో చేరిన 4.96 లక్షల మంది ఓటర్లు ఓటరు నమోదు దరఖాస్తులను నింపి సమర్పించాలని ఎన్నికల కమిషన్ చెప్పింది. మిగిలిన 2.93 కోట్ల మంది తమ అర్హతలను నిరూపించుకునే పత్రాలను సమర్పించాలనీ, అందులోనూ 1987 తరువాత పుట్టిన వారు తమ తల్లిదండ్రుల పత్రాలను కూడా సమర్పించాలని ఆదేశించింది. అయితే అటువంటి తల్లిదండ్రుల పేర్లు గనుక 2003 ఓటర్ల జాబితాలో ఉన్నట్లయితే ఆ జాబితాలో వారి పేర్లున్నట్లు కాపీ ఇస్తే సరిపోతుందని చెప్పింది.

ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం జూన్ 24వ తేదీన బీహార్ ఎన్నికల అధికారికి 19 పేజీల లేఖను పంపింది. ఇందులో మూడు పేజీల్లో ప్రత్యేక ఇంటెన్సివ్ ఓట్ల రివిజన్ (సర్)కు సంబంధించిన సవివరమైన మార్గదర్శకాలు ఉన్నాయి. జులై 25 నాటికి ఓట్ల నమోదు పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. ఆ తేదీనాటికి పత్రాలు సమర్పించిన వారి పేర్లను మాత్రమే ఆగస్టు 1 నాడు విడుదల చేసే ముసాయిదా ఓట్ల జాబితాలో ఉంచుతారు. ఆ తరువాత ఓట్లకోసం నమోదు చేసుకున్న వారి పత్రాలు తనిఖీ చేస్తారు. ఆగస్టు 1 నుండి సెప్టెంబర్ 1 మధ్య అభ్యంతరాలు, క్లెయిములు ఉంటే సమర్పించుకోవచ్చు. సెప్టెంబర్ 30 నాటికి తుది ఓట్ల జాబితాలు విడుదల చేస్తారు.

20 ఏళ్ల తరువాత బీహార్‌లో ఇంటెన్సివ్ ఓట్ల రివిజన్ జరుగుతోంది. దేశం మొత్తం మీద గానీ, లేక దేశంలోని కొన్ని ప్రాంతాల్లో గానీ ఇంటెన్సివ్ ఓట్ల రివిజన్ 1952–56, 1957, 1961, 1965, 1966, 1983–84, 1987–89, 1992, 1993, 1995, 2002, 2003, 2004 సంవత్సరాల్లో జరిగింది.

కానీ బీహార్ 'సర్' మీద తీవ్రమైన ఆందోళన వ్యక్తమవుతోంది. "దళితులు, వెనుకబడిన తరగతులు, బాగా వెనుకబడిన తరగతులు, మైనారిటీలకు ఓటు హక్కు నిరాకరించడం కోసమే ఈ సర్ అనే కుట్రకు తెరలేపారు. సర్‌లో అడిగిన పత్రాలు లేని కుటుంబాలు లక్షల్లో ఉన్నాయి. వారంతా ఓట్ల జాబితా నుండి తొలగించబడతారు" అని రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్‌జెడి) అధికార ప్రతినిధి చిత్రంజన్ గగన్ అన్నారు.

సర్ వెనుక నున్న దురుద్దేశాన్ని గురించి పక్కనే ఉన్న పశ్చిమ బెంగాల్‌లోని అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ప్రశ్నించింది. ఇక్కడ 2006లో శాసన సభ ఎన్నికలు జరగనున్నాయి. ఈ మొత్తం కార్యక్రమానికి వాస్తవ లక్ష్యం పశ్చిమ బెంగాలేనని ఆ పార్టీ పేర్కొంది. ఓటర్లే తమ పౌరసత్వాన్ని రుజువు చేసుకోవాల్సి రావడం అంటే జాతీయ పౌర రిజిస్టర్ (ఎన్ఆర్‌సి)ని దొడ్డిదోవన అమలు పరచడానికి జరిగే "కుట్ర" ఇది అని అది పేర్కొంది.

సర్ వల్ల పెద్ద ఎత్తున ప్రజలు ఓటు హక్కు కోల్పోతారని ప్రజాస్వామ్య సంస్కరణల సంఘం వ్యవస్థాపక సభ్యుడు, ప్రస్తుత ట్రస్టీ అయిన జగ్‌దీప్ ఎస్. ఛోకర్ అన్నారు. "సర్ మార్గదర్శకాల్లో 11 పత్రాలు సమర్పించాలని కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశించింది. వాటిలో ఒకటి జనన ధృవ పత్రం. మిగిలిన పది పత్రాలు కూడా జననాన్ని ధృవీకరించేందుకు సంబంధించిన పత్రాలే. బీహార్‌లో చాలా మంది ప్రజలకు ఈ పత్రాలు లేవు. ఆసక్తికరమైన విషయం ఏమంటే ఈ పత్రాలు వేటిలోనూ ఆధార్ ధృవీకరణ లేదు. కానీ చాలా మంది దగ్గర ఆధార్ కార్డులున్నాయి" అని ఛోకర్ చెప్పారు.

వలసలు అనేవి చర్చించాల్సిన సమస్య. ఎందుకంటే, భుక్తి కోసం అనేక మంది ప్రజలు పెద్ద ఎత్తున రాష్ట్రం వీడి ఇతర రాష్ట్రాలకు వలస వెళారు. వారి ఓట్లు పెద్ద జాబితా నుండి తొలగించబడ్డాయి. "ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో ఓట్ల చేర్పింపు పత్రాలు ఉన్నాయి, ఓటర్లు వాటిని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు అని కేంద్ర ఎన్నికల సంఘం చెబుతోంది. ఢిల్లీలో ఉన్న ఒక భవన నిర్మాణ కార్మికుడు, లేక పంజాబ్‌లో ఉన్న ఒక వ్యవసాయ కార్మికుడు పత్రాన్ని డౌన్‌లోడ్ చేసుకోలేడు కాదా" అని ఆయన అన్నారు.

2003, 2024 సంవత్సరాల మధ్య దాదాపు 1.76 కోట్ల మంది ప్రజలు బీహార్ నుండి వలస వెళ్లిపోయారని బీహార్ జోడో అభియాన్‌కు చెందిన పరిశోధకుడు రాహుల్ శాస్త్రి విశ్లేషించారు. ఈ విశ్లేషణ హిందూ దిన పత్రికలో కూడా ప్రచురితమైంది. ఓటర్ల నమోదు కోసం ఆధారాలు చూపే పత్రాలు సమర్పించే విషయానికి వస్తే, ఇదేమంత సులువైన విషయం కాదని ఆయన అన్నారు. బీహార్‌లో చాలా మందికి సరైన పత్రాలు ఉండవు. 2001, 2005 సంవత్సరాల్లో పుట్టిన ప్రజల్లో 2.8 శాతం మంది వద్ద మాత్రమే జనన ధృవీకరణ పత్రాలున్నాయి. ఇక మిగిలిన పత్రాల విషయం కూడా అంతే.

సర్ కార్యక్రమాన్ని చాలా హడావిడిగా ప్రారంభించినట్లుంది అని ఛోకర్ అన్నారు. "జూన్ 24న సర్ ఆదేశం జారీచేయబడింది. వెంటనే జూన్ 25న దాన్ని అమలు చేయడం ప్రారంభించారు. ఇంత తక్కువ కాలంలో పత్రాలను ప్రింట్ చేయడం, బూత్ స్థాయి అధికారులకు శిక్షణ నివ్వడం ఎలా సాధ్యం?" అని ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

ఓట్ల జాబితా నుండి పేర్ల తొలగింపు, ఓటరుగా పేరు నమోదు నిబంధనలకు సంబంధించి 'సర్' ఎన్నికల చట్టాలను ఉల్లంఘిస్తున్నదని ఆయన చెప్పారు. చట్టాన్ని

> **“ 'సర్' కార్యక్రమాన్ని చాలా హడావిడిగా ప్రారంభించినట్లుంది అని ఛోకర్ అన్నారు. “జూన్ 24న సర్ ఆదేశం జారీచేయబడింది. వెంటనే జూన్ 25న దాన్ని అమలు చేయడం ప్రారంభించారు. ఇంత తక్కువ కాలంలో పత్రాలను ప్రింట్ చేయడం, బూత్ స్థాయి అధికారులకు శిక్షణ నివ్వడం ఎలా సాధ్యం?” అని ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ”**

ఉల్లంఘిస్తున్నందుకు ఓట్ల రివిజన్‌ను కోర్టులో సవాలు చేయవచ్చునని అన్నారు.

అయితే ఈ క్రమం చాలా సరళతరమైనది, రాజ్యాంగ నిబంధనలకు అనుగుణమైనది అని కేంద్ర ఎన్నికల సఘం పదేపదే చెబుతోంది. దేశ పౌరులను మాత్రమే ఎన్నికల జాబితాలో చేర్చాల్సిన రాజ్యాంగపరమైన భాధ్యత తనమై ఉన్నదని అది అంటోంది.

గతంలో నిర్వహించిన 'సర్' తరువాత ఓటర్ల చేర్పులు తొలగింపుల వల్ల ఓటర్ల జాబితాలో గణనీయమైన మార్పులు వచ్చాయని జూన్ 24న జారీచేసిన ఆదేశంలో ఎన్నికల సంఘం పేర్కొంది. శీఘ్ర పట్టణీకరణ, ప్రజలు తరచూ విద్య, జీవనోపాధి, ఇతర కారణలతో వలసలు పోవడం అనే ఆనవాయితీగా మారడంతో ఓటర్ల జాబితాల్లో తరచూ మార్పులు జరుగుతున్నాయని అది పేర్కొంది.

'సర్' నిర్వహించడానికి క్రింది స్థాయిలో 77,895 మంది బూత్ స్థాయి అధికారులు సిద్ధంగా ఉన్నారని కేంద్ర ఎన్నికల సంఘం ఘనంగా చెప్పుకున్నది. కొత్త పోలింగ్ స్టేషన్ల కోసం మరో 20, 603 మందిని కూడా నియమించింది. రాజకీయ పార్టీలు 1.5 లక్షల మందికి పైగా బూత్ స్థాయి ఏజెంట్లను నియమించారని ఎన్నికల సంఘం చప్పింది. వీరంతా బూత్ స్థాయి అధికారులతో కలిసిపనిచేస్తారని చెప్పింది.

2003 కటాఫ్ తేదీగా తీసుకున్నందున 1200 మంది ఉండే ప్రతి పోలింగ్ బూత్ వద్ద బూత్ స్థాయి అధికారులు 400 నుండి 450 మంది ఓటర్ల వెరిఫికేషన్‌పై దృష్టి కేంద్రీకరించాలని మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) ఓ.పి రావత్ చెప్పారు. “బూత్ స్థాయి అధికారులను ప్రలోభపెట్టొచ్చని రాజకీయ పార్టీలు చెబుతున్నాయి. కానీ ఓట్లను చేర్చే లేక తొలగించే అధికారం వారికి లేదు. వారు పత్రాలను ఎన్నికల రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఇఆర్‌ఓ)కు సమర్పిస్తారు. ఓటర్ల లిస్టులో పేర్లు చేర్చే, తొలగించే అధికారం అతనికి మాత్రమే ఉంటుంది. ఇఆర్‌ఓ ఒక డిప్యూటీ కమిషనర్. ఈయన క్లాస్-2 స్థాయి గజిటెడ్ అధికారి. అక్కడ పత్రాలను తిరస్కరిస్తే అప్పీలు చేసుకునే నిబంధన కూడా ఉంది” అని ఆయన చెప్పారు.

బీహార్‌లో నేడు జరుగుతున్న 'సర్' కార్యక్రమం గతంలో జరిగిన మాదిరిది కాదని మాజీ సిఇసి టిఎస్ కృష్ణమూర్తి చెప్పారు. ఆయన హయాంలోనే 2004లో బీహార్‌లో గత 'సర్' కార్యక్రమం జరిగింది. ఎన్నికల జాబితాకు సంబంధించిన 2024 ఎన్నికల సంఘం మాన్యువల్ ప్రకారం 'సర్' కార్యక్రమం సందర్భంగా ఎన్యూమరేటర్లు ఇంటింటి వెరిఫికేషన్ కోసం వెళ్లేటప్పుడు వారి వద్ద ప్రస్తుత ఓటర్ల వివరాలతో కూడిన వర్కింగ్ కాపీ ఉంటుంది. ప్రస్తుత సమాచారాన్ని సవరించడం కోసం, లేక కొత్త పేర్లు చేర్చడం కోసం ఆ పత్రంలో కొంత ఖాళీ ప్రదేశం ఉంటుంది. కానీ బీహార్ 'సర్' కార్యక్రమంలో అలా లేదనీ, మారిన పరిస్థితులకు అనుగుణంగా అది ఉందని కృష్ణమూర్తి చెప్పారు. ‘‘ఇటీవలి కాలంలో ఎన్నికల జాబితా విశ్వసనీయతపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. 'సర్' అనేది ఎన్నికల జాబితాను ప్రక్షాళన చేయడం కోసమే ఉద్దేశింపబడింది” అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమం అంతా చివరికి ఎన్‌ఆర్‌సి అమలు దగ్గర తేలుతుంది అనే వాదనకు ఆయన సమాధానం ఇస్తూ…“ఎన్నికల జాబితా ఉద్దేశం, అర్హతగల ఓటర్లు మాత్రమే ఉండేట్లు చూడ్డం, అందులోనూ వారు భారతీయ పౌరులై, 18 ఏళ్లు పైబడ్డవారై ఉండేట్లు చూడ్డమే. పౌరులు కాని వారిని ఏరివేస్తే రాజకీయ పార్టీలకు అభ్యంతరం ఉండకపోవచ్చు” అన్నారు.

అయితే ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక ఇంటెన్సివ్ ఓట్ల రివిజన్ (సర్) కార్యక్రమం లోపరహితమైన ఓట్ల జాబితాను తయారుచేయడానికి ఉపయోగపడుతుందో లేక పెద్ద వినాశనంగా మారుతుందో చూడాల్సి ఉంది. ❋

# యువతరాన్ని అర్థం చేసుకోవడం ఎలా?

(9వ పేజీ తరువాయి)

అందుబాటులో ఉండి ఉంటే నా 16వ ఏటనే ఈ ప్రపంచాన్ని జయించి ఉండేవాడిని' అని ఒక యువకుడు ఈ అధ్యాయంలో భాగంగా మాతో వివరించి చెప్పాడు. దీన్నిబట్టి యువతరం ఏ లోటును ఎదుర్కొంటుందో అర్థం చేసుకోవచ్చు. మేం మా అధ్యయనం ముగించేసరికి యువతరంలో ఉన్న స్వకీయ చైతన్యం, వ్యక్తివాదం అర్థాలే వేరుగా అనిపించాయి. దీనిని మనం ఒక రోగ లక్షణంగా గుర్తించాలి. వాళ్ళ చుట్టూ ఉన్న ప్రపంచం పరాయిదిగా తోచినప్పుడు, యువతరం దానిని నియంత్రించలేనప్పుడు ఎవరి స్వార్థం వాళ్ళు చూసుకోవడం కన్నా గత్యంతరం ఏముంటుంది వాళ్ళకు? అయితే ఈ స్వకీయ దృష్టి మూలంగా తలెత్తే పర్యవసానాలు భిన్నంగా ఉంటాయి. వాళ్లు ఎదుర్కొన్న సమస్యలకు బదులు వాళ్ళు ఎంచుకున్న మార్గంలో ఇవి ప్రతిఫలిస్తాయి. మేం ఇంటర్వ్యూ చేసిన వారిలో చాలామంది శారీరక, మానసిక సమస్యలు ఎదుర్కొంటున్నారు. దీనికి కారణం – వాళ్ళ బలీయమైన ఆకాంక్షాలు, వారిలోని స్వకీయ చైతన్యానికి వీరికి ఎదురయ్యే సమస్యలు అడగమించలేని నిస్సహాయతకు మధ్య జరిగే ఘర్షణే.

ఈ అధ్యయనంలో మేం అనేక విషయాలు గ్రహించాం. అందులో కొన్ని మాత్రమే ఇక్కడ ప్రస్తావించాం. ఈ యువతరాన్ని జనరేషన్ “జడ్” అని ముద్దు పేరుతో వ్యవహరిస్తున్నాం. కానీ అది సరికాదు. ఈ యువతరానికి కళ్ళు చేదిరే భవిష్యత్తు ఉన్నది. వాళ్ళని ఆ రకంగా అర్థం చేసుకోవాలంటే వాళ్ళ అభిప్రాయాలను మనం అధ్యయనం చేయాలి. వర్తమాన ఆర్థిక సామాజిక సాంస్కృతిక రాజకీయ పరిస్థితులపై వారి అంచనాను, ఈ పరిస్థితులు అధిగమించడానికి వారు సూచించే పరిష్కారాలు, ప్రత్యామ్నాయాల గురించి చెవి ఒగ్గి వినాలి. మన యువతరం ఎలా ఉన్నారు అంటే 'బాగులేరు' అని ఎవరైనా అంటుంటారు. కానీ దానికి గల కారణాలు ఏమిటో మనం ఎన్నడైనా గ్రహించామా? కారణం ఏమిటో వారిలో ఒకరు ఇలా చెప్పుకొచ్చారు – జీవితంలో ఈ నిలకడ లేని తనం మా ప్రాణాలు తోడేస్తోంది, విసుగు పుట్టిస్తోంది. అయినప్పటికీ వాళ్ళు ఇంకా పూర్తిగా అలసిపోలేదు చురుగ్గా ఉన్నారు. సరైన మార్గం పట్టిస్తే అద్భుతాలు సృష్టించగల శక్తివంతులు ఈనాటి యువతరం.

(అనువాదం: కె.సత్యరంజన్)

మతతత్వం

# అస్సాంలో ముస్లింలను వేటాడుతున్న బిజెపి ప్రభుత్వం

గ్రీష్మ కుతార్



రచయిత న్యాయవాది, జర్నలిస్టు

కొద్ది సంవత్సరాల క్రితం గువాహటిలో జరిగిన ఒక చర్చను 73 సంవత్సరాల వయసులో ఉన్న ప్రొఫెసర్ మునిరుల్ హుస్సేన్ గుర్తు చేసుకున్నాడు. ఆయన అస్సాం లో ప్రయాణం చేస్తున్నపుడు తటస్త పడిన ఒక కొత్తవ్యక్తితో జరిగిన చర్చల ముగింపులో ఆ వ్యక్తి ఆయన పేరు అడిగాడు. ఆయన తన పేరు చెప్పగానే అతను ఆశ్చర్యంతో "ఓహ్! మీరు అగ్జామియా అనే నేనూ భావిం చాను" అని చెప్పాడు. దానితో వారు అస్సామీయులను ఏ విధంగా నిర్ణయిస్తారు, హిందువుల పేర్లతో ఉన్న వారిని మాత్రమే అస్సామీయులుగా పరిగణిస్తారా అని ప్రొఫెసర్ ఆందోళనతో అడిగాడు. కాని అంతలోనే ఆ సంభాషణ ముగియటంతో ఆయన ప్రశ్నలకు సమాధానం లభించలేదు.

ప్రొఫెసర్ హుస్సేన్ జీవితం గువాహటి నగరంలో ఉన్న కాటన్ కాలేజితో ప్రారంభమైంది. డాక్టరేట్ అనంతర విద్యాభ్యాసం కోసం ఆయన ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీకి వెళ్ళాడు. పొలిటికల్ సైన్స్ డిపార్ట్‌మెంట్‌లో లెక్చరర్‌గా పని చేస్తున్నపుడు మొదటగా ఆయన రాసిన 'అస్సాం ఉద్యమం, జాతీయత గుర్తింపు, వర్గం, సిద్ధాంతం' పుస్తకాన్ని 1993లో ప్రచురించారు. అందులో ఆయన అస్సాం జాతీయవాదాన్ని తీవ్రంగా విమర్శిం చాడు.

అస్సాంవాసులు ఎవరు అన్న అంశంపై సంకుచిత దృక్పథంతో వ్యవహరించటాన్ని ఆయన విమర్శించాడు. ఉన్నత తరగతులు, వర్గాలకు చెందిన వారు ముస్లింలను వలస వచ్చిన వారిగా ప్రచారం చేయటం, ప్రభుత్వ వ్యతిరేకులని వారిపై ముద్రవేయటం, అస్సాం ఉద్యమానికి అవసరమైన సిద్ధాంతాన్ని రూపొందించటం, దానిని నడపటం చేస్తున్నారని, వారే ఆ ఉద్యమాన్ని అదుపు చేస్తున్నారని ఆయన పేర్కొన్నాడు. ప్రొఫెసర్ హుస్సేన్ అస్సాం జాతి వ్యతిరేకి అని, అస్సాం జాతీయ వాదానికి ఆయన శత్రువు అని ప్రచారం చేశారు. అయినప్పటికీ ఆయన రాయటం ఆపలేదు.

అస్సాంలోని ప్రజానీకంలో ముస్లింలు 30 శాతం ఉన్నారని, కానీ ఈ చర్చలు జరిగిన మూడు దశాబ్దాల తర్వాత కూడా ఒక్క జిల్లాలో కూడా పోలీసు కమిషనర్ లేదా సూపరింటెండెంట్‌గా కాని ముస్లింలు లేరని జామియా మిలియా ఇస్లామియా యూనివర్సిటీలో సామాజిక శాస్త్రాల విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న నిజాముద్దీన్ సిద్ధికి పేర్కొన్నాడు. కానీ హుస్సేన్ రాస్తున్న కాలంలో కనీసం భిన్నాభిప్రాయాలను ప్రచురించుకోవటానికి అవకాశం ఉండేది. ఇపుడు ముస్లింలను పూర్తిగా వేరు చేస్తున్నారనీ, వారి పట్ల సామాజిక వివక్షను ప్రదర్శిస్తున్నారనీ సిద్ధిక్ చెప్పాడు."భారతీయ ముస్లింలను ప్రభుత్వం నిర్బంధంగా సరిహద్దు ప్రాంతాలకు తరలిస్తున్నది. రాష్ట్రంలో ఉన్న దాదాపు అన్ని సంస్థలూ వారిని లక్ష్యంగా చేసుకున్నాయి. దీనిని గురించి ఏ ఒక్క వార్తాపత్రిక కనీసం సంపాదకీయం కూడా రాయటం లేదు. ఇదంతా ఎలా జరుగుతున్నది?" అని ఆయన ప్రశ్నించాడు.

### అస్సాం జాతీయవాదం

బ్రిటిష్ వారి నుండి అధికారం బదిలీ అయిన తర్వాత దేశంలోని ప్రతి ప్రాంతంలోనూ సామాజికాభిప్రాయాలను రూపొందించటం ఆధిపత్య కులాల ప్రత్యేక హక్కుగా మారింది. దేశ నిర్మాణంలో ఏ ప్రాంతం, ఏ విధమైన గుర్తింపును కలిగి ఉంటుందన్నది ఈ కుల సంస్థల నిర్మాణంతో సన్నిహితంగా ముడిపడి ఉన్నది. తమ సాంస్కృతిక వారసత్వాన్ని ఘనంగా చాటుకుంటూ, అట్టడుగు తరగతులు, తెగలను వీరి భావాలకు కట్టుబడిన, అణిగి మణిగి ఉన్నవారుగా చూయించారు. "ఆ విధమైన గొప్ప భావాల" లో వారిని భాగం చేశారు.

అస్సాం జాతీయవాదం కూడా ఇదే చేసింది. ఆధిపత్య కులాలు అధికారం చెలాయిస్తూ, విస్తృతంగా ఉన్న అట్టడుగు తరగతులను-గత ఫ్యూడల్ రాజ్యాలలో పాలితులుగా ఉన్నవారిని, గిరిజన తెగలు, చారిత్రకంగా అట్టడుగున ఉన్న తరగతులను- "దేశ ప్రజలు"గా కలిపివేశారు.

"బయటి వారు, వలస వచ్చిన వారు, విదేశీయులు" అన్న విభేదాలను పెంచటం ద్వారానే ''స్వదేశీయులు'' అన్న భావన ప్రాముఖ్యతను సంతరించుకున్నది. గతంలో "బయటి వారు"లో ముస్లింలతో పాటు హిందువులు కూడా ఉండేవారు. కానీ ఇప్పుడు కేవలం ముస్లింలను మాత్రమే బయటి వారుగా చూస్తున్నారు. ఒక తరగతి ముస్లింలను "అంగీకార యోగ్యమైనవారు"గా, "స్వదేశీయులు"గా పరిగణిస్తున్నారు. మిగతా వారిపై శతృవులని ముద్ర వేస్తున్నారు.

తన ప్రఖ్యాత గ్రంథం "మధ్య యుగాల, వలసవాద తొలి దశలో అస్సాం"లో వలస వచ్చిన థాయ్ అహోం రాజుల నుండి బ్రిటిష్ పాలన వరకు ఈ ప్రాంతంలో రూపుదిద్దుకున్న సామాజిక నిర్మాణాన్ని గురించి అమలేందు గుహ వివరించాడు. స్వాతంత్ర్యానికి ముందు బలమైన పాలక వర్గం రూపుదిద్దుకోవటంలో వలసలు, సంకుల సమరాలు, బ్రాహ్మణులు చేసిన మత మార్పిడులు, వివిధ గ్రూపుల మధ్య ఆధిపత్యం కోసం జరిగిన పోరాటాలు ముఖ్యమైన పాత్ర నిర్వహించాయని ఆయన పేర్కొన్నాడు.

ముఖ్యంగా భాష, భూమి, ఉద్యోగాల సమస్యపై 1850లలో "అసామీయ జాతీయవాదం" తలెత్తడాన్ని, తర్వాత శతాబ్దంలో అది నిర్వహించిన పాత్రను గురించి గుహ ప్రముఖంగా పేర్కొన్నాడు.

అస్సాం సాహిత్య సభకు చెందిన కొందరు నాయకులు గత వైభవాన్ని గొప్పగా చెబుతూ, బెంగాలీయుల పెత్తనాన్ని గురించి భయపెడుతుండే వారు. "సిల్హెట్‌లో జరిగిన సంఘటనలు మధ్య తరగతిని ఆందోళనకు గురి చేసిన తర్వాత, అస్సామీయ మధ్య తరగతి మరింత బలపడటంతో పాటు వారి ఆకాంక్షలు కూడా పెరిగాయి. దానికి ఉన్న కొద్దిపాటి జాతీయవాదం దురహంకారంగా, మైనారిటీలను ద్వేషించటంగా మారింది.

> **“ ఉత్తరప్రదేశ్‌లోని సరస్వతి శిశుమందిర్ లు లేదా ఇతర రాష్ట్రాలలో ఉన్న అదే విధమైన పాఠశాలలు ఆర్ఎస్ ఎస్ నిర్వహించే విద్యా భారతి పాఠశాలలలో భాగంగా ఉన్నాయి. ఈ సంస్థ దేశంలోనే అత్యధికంగా 12,000 పైగా పాఠశాలలను నిర్వహిస్తు న్నది. మధ్య యుగాలలో రాష్ట్రంలో వైష్టవ ఉద్యమాన్ని నిర్వహించిన శంకర్‌దేవ్ పేరును ప్రత్యేకంగా ఈ పాఠశాలలకు పెట్టారు. ”**

### ఆసుకు మద్దతు

అస్సాంలోని కొత్తతరం జాతీయవాదులు ఈ భావాలను విస్తృతంగా ప్రచారం చేశారని, ప్రజలకు సన్నిహితంగా ఉన్న మీడియా వారి ఆధిపత్యంలోకి రావటంతో దానిని ఈ ప్రచారానికి వినియోగించుకున్నారని ఆయన చెప్పాడు. అస్సామీయుల ప్రయోజనాలను కాపాడాలనే కార్యక్రమానికి నాయకత్వ స్థానంలో ఉన్న ఆల్ అస్సాం స్టూడెంట్స్ యూనియన్– ‘ఆసు’ కు ఉద్యమం ఉన్నత స్థాయిలో ఉన్నపుడు, తర్వాత కూడా మీడియా నుండి పూర్తి మద్దతు లభించింది.

ఇప్పుడు కూడా ఈ జాతీయవాదానికి వ్యతిరేకంగా విమర్శలు వచ్చిన వెంటనే గుంపులుగా వారిపై దాడి చేయటం, వేధించటం జరుగుతున్నది.

ఆసు ఏర్పడటంలో ఉన్న ప్రత్యేకతలను మనం అర్థం చేసుకొంటే అస్సాం జాతీయతకు అధికార కేంద్రాలు ఏవో స్పష్టం అవుతాయి. ఆసు తన గుర్తింపును ఏ విధంగా స్థిరపరచుకొన్నది అన్న అంశంతో పాటు, అస్సాంలో ప్రతి తెగకు ప్రత్యేకంగా విద్యార్థిసంఘం ఉన్నదన్నది కూడా వాస్తవం.

ఆసు మనల్ని నమ్మించటానికి ప్రయత్నం చేస్తున్నట్లుగా అస్సాంలోకి విదేశీయులు వచ్చి స్థానికుల భూములను కాజేస్తున్నారన్నది ప్రధానాంశం కాదు. అస్సాంలోని ప్రభుత్వాలు కూడా తమను బలవంతంగా భూముల నుండి తొలగిస్తున్నాయని ఈ విలేకరి మాట్లాడిన ప్రతి తెగ నాయకుడూ చెప్పాడు. స్వాతంత్ర్యానికి ముందూ, తరువాత కూడా వివిధ తెగలకు చెందిన వారిని భూముల నుండి హింసాత్మకంగా తొలగించటంలో ఆనాటి ప్రభుత్వాలు ప్రధాన పాత్ర నిర్వహించాయి.

ఈ ఆందోళనలు, చీలికలను ఎవరూ గమనించక పోలేదు. ఇటువంటి సమయంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ – ఆర్ఎస్ ఎస్ ప్రవేశించింది.

### ఆర్ఎస్ఎస్ స్థానం సంపాదించుకోవటం

1990 దశాబ్దం మధ్యలో ధేమాజి జిల్లాలోని నదీతీర పట్టణం శిలాపథర్‌లో తమ పిల్లలను మంచి పాఠశాలలలో చదివించుకోవాలనుకొనే వారికి చాలా తక్కువ అవకాశాలు మాత్రమే ఉన్నాయి. అటువంటి సమయంలో 1996లో ఏర్పాటు చేసిన శంకర్‌దేవ్ శిశు విద్యానికేతన్‌లో చేరాలని ఉత్సాహపడిన విద్యార్థులలో మనోరంజన్ పెగు సోదరులు కూడా ఉన్నారు. ఆర్ఎస్ఎస్ గిరిజన తెగల గుర్తింపులను స్వంతం చేసు కొంటూ, అస్సాంలోని తెగలను హిందుమత చట్రంలోకి తీసుకొచ్చిన విధానాన్ని గురించి మైసింగ్ సమూహంలో విద్యావంతుడైన పెగు విస్తృతంగా రాశాడు.

ఉత్తరప్రదేశ్‌లోని సరస్వతి శిశుమందిర్ లు లేదా ఇతర రాష్ట్రాలలో ఉన్న అదే విధమైన పాఠశాలలు ఆర్ఎస్ఎస్ నిర్వహించే విద్యా భారతి పాఠశాలలలో భాగంగా ఉన్నాయి. ఈ సంస్థ దేశంలోనే అత్యధికంగా 12,000 పైగా పాఠశాలలను నిర్వహిస్తు న్నది. మధ్య యుగాలలో రాష్ట్రంలో వైష్టవ ఉద్యమాన్ని నిర్వహించిన శంకర్‌దేవ్ పేరును ప్రత్యేకంగా ఈ పాఠశాలలకు పెట్టారు.

### శ్రీమంత శంకర్‌దేవ్

శ్రీమంత శంకర్‌దేవ్ అస్సాంలో16 వ శతాబ్దంలో పండితుడైన యోగి. ఆయన ప్రజలను ప్రభావితం చేసిన ఏకసరణ ధర్మ మత ఉద్యమాన్ని ప్రారంభించాడు. సంగీతం, సాహిత్యం, నాట్యం, నాటకరంగాలలో నూతన ధోరణులను ప్రవేశపెట్టాడు.

“గిరిజన ప్రాంతాలలో పాఠశాలలు, మౌలిక సదుపాయాలు లేనందున ఆర్ఎస్ఎస్ నిర్వహిస్తున్నప్పటికీ అనేకమంది తమ పిల్లలను ఈ పాఠశాలలలో చేర్చారు. ఆర్ఎస్ఎస్ దీనిని మొదట్లోనే అర్థం చేసుకున్నది’’. అస్సాంలో ప్రవేశించినప్పటి నుండి తన కార్యకలా పాల లోనూ, గిరిజనులను హిందుమత పరిధిలోకి తీసుకురావటంలోనూ ఆర్ఎస్ఎస్ ఏ విధంగా పట్టువిడుపులతో వ్యవహరించిందన్న విషయాన్ని పెగు తన రచనల్లో పేర్కొన్నాడు.

ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు సేవా భారతి సంస్థ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహించటం, వనవాసి కల్యాణ ఆశ్రమాల ద్వారా గిరిజనులకు దగ్గర కావటం, విద్యా భారతి ద్వారా పాఠశాలలు నిర్మించటం, అంతిమంగా బంగ్లాదేశ్ నుండి వస్తున్న శరణార్థులకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమాన్ని బలపరచటం తదితర ప్రయోగాలద్వారా కాలక్రమంలో ఆర్ఎస్ఎస్ స్థానిక సంస్థగా మారింది.

### మత, సాంస్కృతిక గుర్తింపు

ఒక రాజకీయ భావజాలాన్ని పెంపొందించటం కోసం మత, సాంస్కృతిక గుర్తింపులను రెండింటిని కలిపి వినియోగించుకోవటంలో ఆర్ఎస్ఎస్ మొదటిది కాదనే అంశాన్ని మనం గుర్తుంచుకోవాలి. అహోం సామ్రాజ్యం అంతకు ముందే ఈ పని చేసింది. వైష్ణవ మతాన్ని రాజ్య మతంగా ప్రకటించారు. గిరిజన సమూహాలతో సంబంధాలను పెంపొం దించుకోవటానికి వైష్ణవ మత కేంద్రాలను ఉపయోగించుకున్నారు. ఈ సంబంధాలు అవసరానుగుణ్యంగా ఉండేవి. గిరిజనులు అణిగిమణిగి ఉండటం ఈ సంబంధాలకు ప్రాతిపదికగా ఉండేది.

కొన్ని గిరిజన సమూహాలకు చెందినవారు మత బోధనలు చేయటం ప్రారంభిస్తే రాజులు వారిని కఠినంగా అణచివేశారు. ఆ విధంగా వైష్ణవుల మతపరమైన క్రతువులు, మత మార్పిడి అంశాలలో బ్రాహ్మణులు కేంద్ర స్థానంలో ఉండేలా చర్యలు తీసుకున్నారు.

దక్షిణాదిలో హిందుమత విస్తరణ గురించి ఈ విలేకరి 2018లో ఆర్ఎస్ఎస్ పురాతన పత్రాలను అధ్యయనం చేస్తున్నపుడు దాదా రావు పరమార్థ్ పేరు పదే పదే కనిపించింది. ఆర్ఎస్ఎస్ స్థాపకుడైన కేశవ్ బలిరాం హెడ్గేవార్‌కు అత్యంత విశ్వాసపాత్రుడైన అనుచరునిగా ఉన్న పరమార్థ్‌ను మొదట దక్షిణాదికి పంపారు. తమ ప్రాంతాలలో ఆర్ఎస్ఎస్‌ను విస్తరించటానికి పూనుకున్న వ్యాపారులు, వడ్డీ వ్యాపారులు, ఇతరులకు ఆయన మద్రాస్ ప్రెసిడెన్సి నుండి మద్దతును అందించాడు.

ఆయన జోక్యంతోనే మంగుళూరులో ఆర్ఎస్ఎస్‌ను ప్రారంభించారు. అక్కడి నుండి అది దక్షిణాదిలో బలమైన సంస్థగా విస్తరించింది. ఈ విధంగా అనుభవం సంపాదించిన పరమార్థ్‌ను 1946లో అస్సాంకు పంపారు.

ఆయనా, ఆయన అనుచరులు గువాహటి, డిబ్రూగర్, షిల్లాంగ్‌లలో షాపులను ఏర్పాటు చేశారు. అప్పటికే ఆర్ఎస్ఎస్ కృషిని గురించి ప్రచారం చేస్తున్న బ్రాహ్మణవాద అనుకూల సంఘాలతో సంబంధాలు పెంపొందించుకున్నారు.

ముస్లింలు ఆక్రమణదారులని జాతీయ స్థాయిలో ప్రచారం చేస్తున్న ఆర్ఎస్ఎస్ ప్రవేశానికి అనేకమంది మద్దతు తెలిపారు. ఈ విధమైన సంబంధాల ద్వారా అస్సాంలోని రాజకీయ, సాంస్కృతిక, సామాజిక సంస్థలలోకి ఆర్ఎస్ఎస్ ప్రవేశించింది. తాను కలిసిన ఏ సమూహానికీ ఇబ్బంది కలిగించని భాష మాట్లాడుతూ, ముఖ్యమైన స్థానాలు, ప్రాంతాలలోకి ప్రవేశించటానికి ఆర్ఎస్ఎస్ ఈ సంబంధాలను ఉపయోగించుకొన్నది.

1981లో కామరూప్‌లో జరిగిన విశ్వ హిందు పరిషత్ నాలుగవ మహాసభకు సెకండరి ఎడ్యుకేషన్ బోర్డు ఛైర్మన్‌గా ఉన్న శరత్‌చంద్ర గోస్వామి అధ్యక్షత వహించటంతో అది ప్రభుత్వ మద్దతును కూడా పొందింది. రాష్ట్రంలో ఆర్ఎస్ఎస్ ఎంత లోతుగా వేళ్ళూనుకున్నది, అధికారుల నుండి ఆ సంస్థకు ఏ విధంగా మద్దతు లభిస్తున్నది అన్న దానికి ఇది ప్రత్యక్ష ఉదాహరణ. ఒక దశాబ్దం కన్నా తక్కువ కాలంలోనే శంకర్‌దేవ్ పాఠశాలలు రాష్ట్రంలో పుట్టగొడుగుల్లా విస్తరించాయి.

ఈ పాఠశాలలలో ఎక్కువ భాగం ప్రభుత్వం నుండి సహాయాన్ని అందుకుంటున్నాయి. ఏకల్ విద్యాలయాలు లేక ఏకోపాధ్యాయ పాఠశాలలు గిరిజన జిల్లాలలో ఎక్కువగా విస్తరించాయి. ఈ పాఠశాలల నుండి అనేక మంది విద్యార్థులను ఇతర రాష్ట్రాలకు పంపి, అక్కడ ఆర్ఎస్ఎస్ లేదా వారి అనుయాయులు నడుపుతున్న పెద్ద పాఠశాలలలో వారిని చేర్చుతున్నారు. ఆ పాఠశాలలు వేదాలతో పాటు హిందు మెజారిటీ గుర్తింపును పెంపొందించే భావాలను వ్యాప్తి చేస్తూ, ఈ విద్యార్థుల స్వంత గుర్తింపును తుడిచి వేస్తున్నాయి. అదే సమయంలో విద్యార్థుల ఇరుగు పొరుగు ప్రాంతాలలో హిందు దేవాలయాలను నిర్మించటంతో మత మార్పిడి కార్యక్రమం పూర్తి అవుతున్నది.

### ముస్లింలు బంగ్లాదేశ్ నుండి వచ్చారని ప్రచారం

గిరిజనులు ప్రధానంగా భయపడాల్సింది, వారి సంస్కృతి, గుర్తింపులను రద్దు చేస్తున్నది, వారి ప్రాంతాలను ఆక్రమిస్తున్నది "బంగ్లాదేశ్ నుండి వచ్చే ముస్లిం"లని ఈ సంస్థలు వారి మనసులో నాటుకు పోయేలా ప్రచారం చేస్తున్నాయి.

> "ఆర్ఎస్ఎస్ ద్వితీయ నాయకుడైన ఎం ఎస్ గోల్వాల్కర్ కాలం నుండి "బంగ్లాదేశ్ నుండి వలస వస్తున్న" వారికి వ్యతిరేకంగా ఆర్ఎస్ఎస్ ప్రచారం చేయటం పెరిగింది. ఈ జోక్యం పెరిగిన కొద్దీ ఆర్ఎస్ఎస్‌కు ఆమోద యోగ్యత పెరిగిందని విలేకరి మసాయో అవుం గషి, ప్రొఫెసర్ మాలిని భట్టాచార్య తెలిపారు. అస్సాంలోని ప్రజల పొందికను మార్చటానికి బెంగాలీ ముస్లింలు దుర్మార్గమైన కుట్ర చేశారని ఆర్ఎస్ఎస్ నాయకులందరూ జాతీయ స్థాయిలో ప్రచారం చేయటం ప్రారంభించారు"

అస్సాంలోని గిరిజన తెగలు తమకు మద్దతు ఇస్తున్నాయని ఆర్ఎస్ఎస్, అస్సాం జాతీయవాద గ్రూపులు చెబుతున్నారు. వాస్తవమేమిటంటే మైసింగ్ తెగకు చెందినవారి భూములను ప్రభుత్వ అధికారులు తరచుగా చట్ట విరుద్ధమైన పద్ధతులలో, బలవంతంగా స్వాధీనం చేసుకొంటున్నారు. "ఆదుకోవటానికి అపుడెవ్వరూ కనిపించటం లేదు" అని పెగు చెప్పాడు.

"గిరిజనుల రక్షిత ప్రాంతాలు, బ్లాక్"లలోని మైసింగ్ తెగ లాంటి రక్షిత గిరిజనులకు చెందిన భూములను గిరిజనేత రులు స్వాధీనం చేసుకోకూడదు. అస్సాం ప్రభుత్వం కూడా ఈ భూములను తీసుకో కూడదు. కాని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవ టానికి వీలుగా ఆ భూములకు ఉన్న రక్షణలను జిల్లా కమిషనర్‌లు క్రమబద్ధంగా తొలగిస్తు న్నారు.

కోక్రఝార్, దిమా హసావో జిల్లాలలోని రెండు ప్రాంతాలలో 13,000 బిఘాల గిరిజనుల భూములను అదాని సంస్థకు అప్పగించటాన్ని గిరిజన గ్రూపులు తీవ్రంగా విమర్శించాయి. భూమిని తీసుకోవటానికి ముందు స్థానిక ప్రజలతో తప్పనిసరిగా చర్చలు నిర్వహించాలి. కోక్రఝార్‌లో భూమిని తీసుకోవటానికి ముందు ప్రభుత్వం ఎటువంటి చర్చలు జరపలేదని, దానిపై ప్రజలు నిరసన తెలియజేస్తున్నట్లు బోడో నేషనల్ స్టూడెంట్ యూనియన్ ప్రెసిడెంట్ బోన్జిత్ మంజిల్ బసుమటారి తెలిపాడు. ప్రభుత్వం తమ హక్కులను హరించి, భూములను కాజేయటానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఈ ఆందోళనలకు భూ సమస్యలపై పని చేస్తున్న కొద్దిమంది సీనియర్ కార్యకర్తలు మినహా, అస్సాం జాతీయవాద గ్రూపులకు చెందిన వారెవరూ మద్దతు తెలపటం లేదని పెగు చెప్పాడు.

ఆర్ఎస్ఎస్ అనుబంధ విద్యార్థి సంఘం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఎబివిపి) అస్సాం ఉద్యమంలో పూర్తిస్థాయిలో పాల్గొనటం ప్రారంభించిన తర్వాత, అస్సాంలోని ఆధిపత్య కులాలలో హిందు జాతీయవాదం తీవ్రం అయింది. 1970లలో ప్రభుత్వ యంత్రాంగం, హిందు జాతీయవాదుల మధ్య సంబంధాలు బలపడ్డాయి.

ఆర్ఎస్ఎస్ ద్వితీయ నాయకుడైన ఎం ఎస్ గోల్వాల్కర్ కాలం నుండి "బంగ్లాదేశ్ నుండి వలస వస్తున్న" వారికి వ్యతిరేకంగా ఆర్ఎస్ఎస్ ప్రచారం చేయటం పెరిగింది. ఈ జోక్యం పెరిగిన కొద్దీ ఆర్ఎస్ఎస్‌కు ఆమోద యోగ్యత పెరిగిందని విలేకరి మసాయో అవుం గషి, ప్రొఫెసర్ మాలిని భట్టాచార్య తెలిపారు. అస్సాంలోని ప్రజల పొందికను మార్చటానికి బెంగాలీ ముస్లింలు దుర్మార్గమైన కుట్ర చేశారని ఆర్ఎస్ఎస్ నాయకులందరూ జాతీయ స్థాయిలో ప్రచారం చేయటం ప్రారంభించారు. అదే సమయంలో బంగ్లాదేశ్ నుండి వస్తున్న బెంగాలీ హిందువులు అక్కడ అణచివేతను ఎదుర్కొంటున్నారని, వారికి దేశంలో ఆశ్రయం కల్పించాలని వాదించారు. అ విధంగా ఆశ్రయం కల్పించటం వలన "అస్సాం హిందు మెజారిటీ"గా మారుతుందని ఆర్ఎస్ఎస్ ప్రచారం చేసింది.

దీనిని జాతీయాంశంగా చేయటం కోసం "సేవ్ అస్సాం టుడే టు సేవ్ ఇండియా టుమారో"-రేపు భారతదేశాన్ని కాపాడటం కోసం ఈ రోజు అస్సాంను కాపాడండి- పేరుతో 1980 నుండి ఎబివిపి ఢిల్లీలో కార్యక్రమాలు నిర్వహించటం ప్రారంభించింది. ఆర్ఎస్ఎస్, ఆసు కలిసి రెచ్చగొట్టిన ముస్లిం వ్యతిరేకత అస్సాంలోని ఆధిపత్య కులాలలోని హిందువులు, టివ, కర్బి తెగలకు చెందిన వారు కలిసి నెల్లిలో 2,000 మంది ముస్లింలను హత్య చేసిన నెల్లి మారణకాండకు దారితీసింది. బాధితులకు న్యాయం జరగలేదు. అస్సాం ఉద్యమంలో మరణించిన 855 మందిని

> **" 2018లో ఆర్‌ఎస్‌ఎస్ ఈశాన్య రాష్ట్రాల లో అతి పెద్ద సభను నిర్వహించినపుడు ఆసు మాజీ నాయకులు ఇద్దరు వేదికపై ఆశీనులు కావటంతో హిందు జాతీయవాదం, అస్సాం జాతీయవాదాలకు మధ్య పూర్తి స్థాయి సంబంధాలు ఏర్పడటం పూర్తయింది. వారిలో ఒకరు అప్పటి ముఖ్యమంత్రి సర్బానంద సోనోవాల్ కాగా, మరొకరు ప్రస్తుత ముఖ్య మంత్రి హిమంత బిశ్వశర్మ. "**

ముందుకు తెచ్చి, ఈ సంఘటనలో హత్యకు గురైన వారి జ్ఞాపకాలను ప్రజల మస్తిష్కం నుండి తుడిచివేయటానికి ప్రయత్నం చేశారు.

**అస్సాం జాతీయవాదం, హిందూత్వ**

2018లో ఆర్ఎస్ఎస్ ఈశాన్య రాష్ట్రాల లో అతి పెద్ద సభను నిర్వహించినపుడు ఆసు మాజీ నాయకులు ఇద్దరు వేదికపై ఆశీనులు కావటంతో హిందు జాతీయవాదం, అస్సాం జాతీయవాదాలకు మధ్య పూర్తి స్థాయి సంబంధాలు ఏర్పడటం పూర్తయింది. వారిలో ఒకరు అప్పటి ముఖ్యమంత్రి సర్బానంద సోనోవాల్ కాగా, మరొకరు ప్రస్తుత ముఖ్య మంత్రి హిమంత బిశ్వశర్మ.

2016లో బిజెపి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత రెండు సంవత్సరాలకు ఏర్పాటు చేసిన ఈ సభకు "లుట్ పోరియా హిందు సమావేశం" అని పేరు పెట్టారు. అస్సాంలోని కర్బి, టివ, మైసింగ్ తదితర 10 తెగలకు చెందిన నాయకులను వేదికపైకి ఆహ్వానించారు. వైష్ణవ మతాలకు చెందిన 10 మందికి పైగా మత నాయకులను కూడా వేదికపైకి ఆహ్వానించారు. ఆర్ఎస్ఎస్ అగ్ర నాయకులతో పాటు ఐదుగురికి పైగా బిజెపి శాసనసభ్యులు వేదికపై కూర్చున్నారు.

మతపరమైన చిహ్నాలతో పాటు అహోం రాజ్యానికి చెందిన ప్రఖ్యాత సైనిక జనరల్ బోర్ఫుఖన్‌ను ఉదహరిస్తూ అస్సాం, ఇతర ఈశాన్య రాష్ట్రాలకు రక్షణ కావాలని ఆర్ఎస్ ఎస్ నాయకులు ప్రసంగించారు. "హిందు మతంలో వైవిధ్యం ఉన్నదని" వేదికపై కూర్చున్న గిరిజన నాయకులకు బోధించటానికి ఆర్ఎస్ ఎస్ నాయకులు ప్రయత్నం చేశారు. "ఆర్ఎస్ ఎస్ మాత్రమే అస్సాంను రక్షించగలదని" అప్పటి బిజెపి శాసనసభ్యుడు శిలాదిత్య దేవ్ ప్రకటించాడు. "లూట్‌పోరియా హిందు అమి" (మేం బ్రహ్మపుత్ర ప్రాంత హిందువులం) అన్న అస్సాం గీతాన్ని పాడి కార్యక్రమాన్ని ముగించారు.

ఆర్ఎస్ఎస్, ఆసులు విడిగానూ, ఐక్యం గానూ అస్సాం ప్రజల రక్షకులుగా ఫోజు పెట్టి, అస్సామీయులలో ఆధిపత్య కులాల హిందు వులు ఎవరు అన్నది నిర్ధారిస్తున్నారు. అమ్ముడు పోయే గ్రూపులు తయారై, మరింత కఠినమైన చర్యలు తీసుకోవటం ద్వారా తాము "విదేశీ యుల" సమస్యను పరిష్కరిస్తామని ప్రకటిం చాయి.

**హింసాత్మక చర్యలకు పాల్పడే గ్రూపులు**

అటువంటి వాటిలో వీర్ లచిత్ సేన ఒకటి. అస్సాంను రక్షించటానికి అవసరమైతే ఆయుధాలు తీసుకోవటానికి సందేహించ బోమని అది ప్రకటించింది. తమకు లక్షలాది మంది యువ కార్యకర్తలు ఉన్నారని గొప్పలు చెప్పుకుంటూ, "అక్రమంగా ఆక్రమించు కున్నవి" అన్న పేరుతో ముస్లింల ఆస్తులను లక్ష్యంగా చేసుకొంటున్నారు. ప్రదర్శనలు నిర్వ హిస్తూ, వలస వచ్చిన వారిని బెదిరిస్తున్నారు.

"అస్సాంలో 3.5 కోట్లమంది ప్రజలు ఉన్నారు. వీరిలో రెండు కోట్లమంది స్థానికులైన హిందు, క్రైస్తవ, ఇతర మతాలకు చెందిన వారు. ముస్లింలు 1.50 కోట్లమంది ఉన్నారు. వారిలో కనీసం కోటిమంది ఇక్కడి వారు కారు. వారు మియా ముస్లింలు (బంగ్లాదేశ్ నుండి వలస వచ్చినవారు). వారిని బంగ్లాదేశ్‌కు పంపించాలి" అని వీర్ లచిత్ సేన స్థానిక అధ్యక్షుడైన దీప్‌జ్యోతి గొగోయ్ చెప్పాడు.

ఇక్కడ విస్తారంగా ఉన్న హిందువులతో బెంగాలీ హిందువులు తేలికగా కలిసిపోతారని గొగోయ్ చెప్పాడు. కాని అస్సాం దిగువ ప్రాంతాలు, ముఖ్యంగా బెంగాలీ హిందువులు అధికంగా ఉన్న బరక్ లోయ వైపుకు వెళితే ఇది వాస్తవం కాదని స్పష్టమౌతుంది. "మతా న్ని తమకు వ్యతిరేకంగా వాడతారన్న వాస్తవా న్ని అర్థం చేసుకొని, గత్యంతరం లేని పరిస్థి తులలో బెంగాలీ హిందువుల కన్నా బెంగాలీ ముస్లింలే భాష, ఇతర విషయాలలో స్థాని కులతో ఎక్కువగా కలిసిపోతున్నారని" ప్రొఫె సర్ హుస్సేన్ చెప్పాడు. బెంగాలీ హిందువు లకు ఎల్లప్పుడూ ఆర్ఎస్ఎస్ మద్దతు ఉంటుంది కాబట్టి వారు తమ భాష, సంస్కృతు లను వదులుకోవటం లేదు.

జార్ఖండ్‌లో వలెనే భూమి, ఉద్యోగాలు లేకపోవటం "విదేశీయుల" వ్యతిరేక ఆందో ళనలలో ప్రధానాంశాలుగా ఉన్నాయి.

ఈ అంశంలో వీర్ లచిత్ సేనకు ప్రత్యేక మైన ప్రణాళిక ఉంది. శ్రామికులలో మియా ముస్లింలు అత్యధికంగా ఉన్న ప్రాంతాలలో ముస్లిమేతరుల సామర్థ్యం పెంచటానికి శిక్షణా శిబిరాలు నిర్వహించటం కోసం వారు ప్రణాళి కలు రూపొందిస్తున్నారు.

**ముస్లింలకు వ్యతిరేకంగా హింసాకాండ**

"విదేశీయులను" పనిలో పెట్టుకోబోమనే ముఖ్యమైన షరతుతో స్థానికంగా వ్యాపారాలు చేసుకొనే వారికి మద్దతును అందించటం కోసం నిధులను కూడా సమీకరిస్తున్నట్లు గొగోయ్ చెప్పాడు. "ముస్లింలు అధికంగా ఉన్న ప్రాంతా లను గుర్తించి, వారిని బయటికి పంపటానికి ప్రయత్నం చేయటం ముఖ్యమైన కార్యక్రమంగా ఉంది. బంగ్లాదేశీయులను బయటికి పంపక పోతే త్వరలోనే అస్సాం మణిపూర్ లాగా మారిపోతుందని గొగోయ్ చెప్పాడు. బెంగాలి ముస్లింలందరినీ అస్సాం నుండి బయటికి పంపుతామని లచిత్ సేన నాయకుడు శ్రింఖ ల్ చాలిహా సోనాపూర్ జిల్లాలోని కుచితాలి గ్రామంలో చెబుతున్న వీడియోను గొగోయ్ ఈ విలేకరికి చూయించాడు.

హింసాత్మక పద్ధతులతో బెంగాలీ ముస్లిం లను బయటికి పంపిన సంఘటనలు ఈ గ్రామంలో జరిగాయి. 2024లో అటువంటి ప్రయత్నం జరిగినపుడు పోలీసులు జరిపిన కాల్పులలో ఇద్దరు ముస్లింలు మరణించారు.


అక్కడి భూములు గిరిజనులకు చెందిన వనీ, అవి రక్షిత కేటగిరిలో ఉన్నాయనీ చెబు తూ ముస్లింలను గ్రామాల నుండి పంపివేయ టాన్ని ప్రభుత్వం సమర్థించుకుంటు న్నది. కానీ ఆ భూములను తమకు అమ్మితే కొనుగోలు చేశామని ముస్లిం భూ యజమానులు తాము కొనుగోలు చేసిన డాక్యుమెంట్లను చూయిం చారు. ఈ రచయిత కలిసిన లచిత్ సేన నాయకులలో ఒక్కరు కూడా అస్సాంలోని తెగలకు చెందిన వారు కాదు. కాని "అస్సాం ప్రజలకు సహజంగా సంక్రమించిన భూము లను" రక్షించే నాయకులుగా గిరిజన ప్రాంతాలలో తిరుగుతున్నారు.

అస్సాంలో హింసాత్మకంగా వ్యవహ రించే రెండు మెజారిటీ జాతీయవాద సంస్థలు కలిసిపోవటం వలన గొగోయ్‌కి చెందిన గ్రూపులు లాంటివి ముస్లింలకు వ్యతిరేకంగా హింసాకాండకు పాల్పడుతున్నాయి.

(అనువాదం: ఎ కోటిరెడ్డి)

# బానిసలు సుల్తానులుగా ..

## (క్రీ.శ.1200, 1400 మధ్య డిల్లీ సుల్తానులు)



రచయిత ప్రజాశక్తి మాజీ ఎడిటర్

ఎంవిఎస్ శర్మ

పశ్చిమాన పంజాబ్ నుంచి తూర్పన బీహార్, బెంగాల్ ప్రాంతాల వరకూ తురుష్కుల ఆధిపత్యం నెలకొన్న తర్వాత కూడా దాదాపు వంద సంవత్సరాల పాటు నిలదొక్కుకోడానికి వాళ్ళకి సమయం పట్టింది. మంగోలు ప్రాంతం నుండి, వాయవ్య దిశగా పదే పదే దురాక్రమణ ప్రయత్నాలు సాగుతూవచ్చాయి. వాటిని తిప్పికొట్టడం ఒక పెద్ద సవాలుగా ఉండేది. దానికి తోడు రాజ్యాధికారం కోల్పోయిన రాజపుత్రులు, సామంతులుగా ఉన్నవారు పదే పదే తిరుగుబాట్లు చేస్తూ స్వతంత్రం ప్రకటించేవారు. వీటన్నింటినీ నిలవరించ డంలో తురుష్కులు జయప్రదం అయ్యారు. అంతేగాక తమ ప్రాభవాన్ని మాళ్వ, గుజరాత్ ప్రాంతాలవరకూ విస్తరించారు. ఈ క్రమాన్ని వివరంగా తెలుసుకుందాం.

**బలమైన ఏకచ్ఛత్రాధిపత్యం దిశగా..**

ముయిజ్జుద్దీన్ మహమ్మద్ (గోరీ మహమ్మద్) అనంతరం అతడికి బానిసగా ఉన్న కుతుబుద్దీన్ ఐబక్ 1206లో అధికారం చేపట్టాడు. గోరీ మహమ్మద్ కాలంలో ఇతడు తురుష్కుల ఆధిపత్యాన్ని విస్తరించడంలో కీలక పాత్ర పోషించాడు. అక్కడ గజని రాజ్యానికి మరొక బానిస, యాల్దుజ్ అనేవాడు రాజు అయ్యాడు. గతంలో మహమ్మద్ గోరీ ఆధిపత్యం కిందనే, అంటే గజనీ రాజ్యం కిందనే డిల్లీ కూడా ఉండేది కనుక తానే డిల్లీకి కూడా సుల్తానుని అని యాల్దుజ్ ప్రకటించాడు. కాని కుతుబుద్దీన్ అందుకు తిరస్కరించి గజనీ రాజ్యంతో సంబంధాలను తెంచుకున్నాడు. దీని ఫలితంగా ఒక మేలు జరిగింది. మధ్య ఆసియా ప్రాంతంలో ఆ కాలంలో జరుగుతున్న అధికార ఘర్షణలలోకి డిల్లీ కూడా దిగబడకుండా దూరంగా ఉండడం సాధ్యమైంది. డిల్లీ రాజ్యం స్వతంత్రంగా అభివృద్ధి చెందడానికి అవకాశం కలిగింది.

కుతుబుద్దీన్ ప్రమాదవశాత్తూ గాయపడి మరణించడంతో అతడి అల్లుడిగా ఉన్న ఇల్టుట్మిశ్ 1210లో అధికారానికి వచ్చాడు. అధికారం కోసం అతడు కుతుబుద్దీన్ కుమారుడిని ఓడించాడు. తండ్రి తర్వాత కొడుకు రాజవ్వాలన్న వారసత్వ సాంప్రదాయానికి అడ్డుకట్ట వేశాడు.

ఇల్టుట్మిశ్ (1210–1236) ఉత్తర భారతదేశంలో తురుష్కుల ఆధిపత్యాన్ని కట్టుదిట్టం చేసినవాడు అని చెప్పవచ్చు. అతడు అధికారం చేపట్టడం కొందరు సామంతులకు ఆమోదయోగ్యంగా లేదు. దాంతో బెంగాల్, బీహార్ ప్రాంతానికి ప్రతినిధిగా ఉన్న ఆలీ మర్దాన్ ఖాన్ , ముల్తాన్ ప్రాంతానికి ప్రతినిధిగా ఉన్న క్వాబాచా తమను స్వతంత్ర పాలకులుగా ప్రకటించుకున్నారు. ఈ అవకాశాన్ని తీసుకుని కలింజర్, ఆజ్మీర్, బాయానా, గ్వాలియర్ ప్రాంతాలలో రాజపుత్రులు స్వతంత్రాన్ని ప్రకటించారు.

తన అధికారాన్ని సుస్థిరం చేసుకోడానికి ఇల్టుట్మిశ్ తొలుత వాయవ్యాన లాహౌర్ నుంచి స్వాధీనం చేసుకోవడం ప్రారంభించాడు. తాద్వారా గజనీ సామ్రాజ్యం నుంచి వచ్చే ప్రమాదాన్ని, ఆ తర్వాత మంగోలుల నుంచి ఎదురైన ప్రమాదాన్ని తట్టుకుని అధికారాన్ని నిలబెట్టుకోగలిగాడు. నిజానికి మంగోలులు గజనీ రాజ్యాన్ని ఆక్రమించుకోవడంతో బాటు మొత్తం మధ్య ఆసియా అంతా తమ ఆక్రమణలోకి తెచ్చుకున్నారు, వారి ఆధిపత్యం ఆ కాలంలో అటు చైనా నుండి ఇటు మధ్య ఆసియా వరకూ విస్తరించింది. వారిని సింధునది దాటి భారత ఉపఖండంలోకి రాకుండా నిలవరించాడు ఇల్టుట్మిశ్. వాయవ్య ప్రాంతం కట్టుదిట్టం అయాక బెంగాల్, బీహార్, ప్రాంతాన్ని 1226–27 లో తిరిగి డిల్లీ పెత్తనం కిందకు తీసుకురాగలిగాడు. ఆ తర్వాత రాజపుత్రులను లొంగదీసుకోడానికి చేసిన ప్రయత్నాలు పెద్దగా ఫలించలేదు. రాజపుత్రులకు తోడు చాళుక్య రాజ్య సైన్యాలు కలవడంతో తురుష్కుల సేనలు వెనుదిరగక తప్పలేదు.

**రజియా సుల్తానా (1236–1239)**

తన కుమారులకన్నా కుమార్తె రజియా రాజ్యాధికారానికి అర్హురాలని ఇల్టుట్మిశ్ భావించాడు. మత గురువులను, సామంతులను ఒప్పించి రజియాకు అధికారం అప్పగించాడు. పురాతన కాలంలో ఇరాన్ ఈజిప్టు రాజ్యాలలో మహిళలు రాజ్యాలేలడం, ముఖ్య బాధ్యతలను చేపట్టడం జరిగినా, 13వ శతాబ్దం నాటికి అటువంటి ఒరవడి లేదు. అందుచేత రజియా రాజ్యాధికారం చేపట్టడం ఒక ప్రత్యేకమైన అంశంగా చరిత్రలో ఉంది.

రజియా అధికారాన్ని తురుష్క సామంతులు, ముఖ్యులు అంత తేలికగా అంగీకరించలేదు. తమగుప్పెట్లో ఉంచుకోగల రాజు ఉండాలని వారు భావించారు. కానీ రజియా వారి ఆటలు సాగనివ్వలేదు. సాంప్రదాయాలకు భిన్నంగా ఆమె దర్బారుకు ఎటువంటి మేలిముసుగూ ధరించకుండానే వచ్చేది. సాధారణంగా స్త్రీలు ధరించే దుస్తులను విడనాడి ప్రత్యేకంగా దుస్తులు ధరించేది. యుద్ధాల్లో సైన్యాన్ని స్వయంగా ముందుండి నడిపించేది. వేటలో పాల్గొనేది. వజీరుగా ఉన్న జునైదీ, రజియాను మొదటినుంచీ వ్యతిరేకించేవాడు. అతడు కొంతమంది రాజప్రముఖుల తోడ్పాటుతో రజియా మీద తిరుగుబాటు చేశాడు. కాని ఆమె చేతుల్లో ఓడిపోయి పలాయనం చిత్తగించాడు. ఐనా రజియాకు ఎదురీత తప్పలేదు. తన చుట్టూ తనకు విశ్వాసంగా ఉండేవారిని నియమించుకోడానికి ఆమె ప్రయత్నించింది. వారిలో తురుష్కులు కానివారు గణనీయంగా ఉన్నారు. దీనిని చూపించి తురుష్క ప్రముఖులలో

> " ఎంత క్రూరంగా వ్యవహరించినా, ఆనాడు మధ్య, పశ్చిమ ఆసియా ప్రాంతం యావత్తూ ఆక్రమించుకుని ముస్లిం రాజ్యాలను నేలమట్టం చేసిన మంగోల్ సామ్రాజ్య శక్తి మాత్రం ఢిల్లీ సామ్రాజ్యాన్ని దెబ్బ తీయలేక పోయింది. బాల్బన్ సైనిక శక్తి, సన్నద్ధత దానికి కారణం. ఆసియాలో ఇస్లాం మతానికి మొనగాడుగా ఒక్క ఢిల్లీ రాజ్యం మాత్రమే ఆనాడు నిలబడింది. "

వ్యతిరేకతను రెచ్చగొట్టి వివిధ ప్రాంతాల్లో తిరుగుబాట్లు లేవదీశారు. లాహోర్‌లో తలెత్తిన ఒక తిరుగుబాటును రజియా స్వయంగా అణచివేసింది. అక్కడినుంచి తిరిగి ఢిల్లీకి వస్తున్న దారిలో రజియాను, ఆమె సన్నిహితులను కుట్రపూరితంగా భటిండా సమీపంలో నిర్బంధించారు. ఆ నిర్బంధం నుండి బైటపడిన రజియా మళ్ళీ ఢిల్లీ సింహాసనాన్ని అధిష్టించాలని చాలా వీరోచితంగా పోరాడింది. కాని ఆమె దోపిడి దొంగల చేతుల్లో మరణించింది.

### బాల్బన్ శకం (1246–1284)

రజియా అనంతరం తురుష్క ప్రముఖులు రాజ్యాధికారం కోసం తమలో తాము ఘర్షణలకు దిగారు. ఇల్టుట్మిశ్ కుమారుడు నసీరుద్దీన్ మహమ్మద్‌ను అతడికి సహాయకుడిగా ఉన్న ఉలఘ్‌కాన్ అనేవాడు ఈ ఘర్షణల క్రమంలో 1264 లో అధికార పీఠం మీద కూరోచబెట్టాడు. అతడికి తన కుమార్తెనిచ్చి వివాహం చేశాడు. ఈ ఉలఘ్ ఖాన్ బాల్బన్ అన్న బిరుదు స్వీకరించాడు. ఆ పేరుతోనే అతడిని చరిత్రకారులు ప్రస్తావిస్తారు. బాల్బన్ ప్రాబల్యం పెరిగిపోతూవుండడంతో అతడిని తక్కిన తురుష్క ప్రముఖులు పదవి నుండి తొలగించేలా రాజు మీద వత్తిడి తెచ్చారు. ఆ తర్వాత బాల్బన్ తన స్వంత బలగాన్ని కూడగట్టుకుని సైనిక పరంగానే బరిలో దిగడానికి సిద్ధపడ్డాడు. 1265లో నసీరుద్దీన్ మహమ్మద్ మరణించాడు. అప్పుడు తక్కిన పోటీదారులను వివిధ పద్ధతులలో అడ్డు తప్పించి బాల్బన్ రాజ్యాధికారాన్ని స్వయంగా చేపట్టాడు. బలమైన కేంద్రీకృత ప్రభుత్వం ఏర్పడి కొనసాగడం బాల్బన్‌తో మొదలైంది.

తన అధికారాన్ని ఎవరూ ప్రశ్నించకుండా ఉండేందుకు బాల్బన్ తానొక ఉన్నత తురుష్క రాజవంశీకుడిననీ, ఇరాన్ రాజ వంశానికి చెందినవాడిననీ ప్రకటించుకున్నాడు. తురుష్కులను మాత్రమే తన ప్రభుత్వంలో ఉన్నత పదవులలో నియమించాడు. భారతీయ ముస్లింలను అధికార పదవులకు దూరంగా పెట్టాడు. వ్యాపారులైనా సరే, ఉన్నత వంశీకులు కాకపోతే వారికి దర్శనం ఇచ్చేవాడు కాదు. అదే సమయంలో అధికారాన్ని ఎవరితోనూ పంచుకోడానికి బాల్బన్ సిద్ధపడలేదు. పూర్తి అధికారాలను తానే చెలాయిస్తూ నిరంకుశంగా పాలించాడు. ఆ క్రమంలో తన అధికారాన్ని సవాలు చేసే ప్రమాదం సన్నిహిత బంధువులనుంచి ఎదురైనా, వారిని అంతం చేసేవాడు. అదే సమయంలో సాధారణ ప్రజల విశ్వాసాన్ని పొందడానికి న్యాయ విచారణ సందర్భంగా అత్యంత నిష్పాక్షికంగా తీర్పులు చెప్పేవాడు. నేరం రుజువైతే ఎంత పెద్ద అధికారినైనా కఠినంగా శిక్షించేవాడు. తన గూఢచారులను అన్ని విభాగాలలోనూ నియమించుకుని ఆరా తీసేవాడు తప్ప ఎవరినీ నమ్మేవాడు కాదు.

ఆంతరంగిక తిరుగుబాట్లను అణచివేయడానికే గాక వాయవ్య సరిహద్దులో పెద్ద ప్రమాదంగా తయారౌతున్న మంగోలుల దాడులను తిప్పికొట్టడానికి వీలుగా కేంద్రీకృత సైనిక వ్యవస్థను బలంగా నిర్మించాడు. గంగా–యమున డెల్టా ప్రాంతం అంతా దట్టమైన అరణ్యాలతో ఉండేది. రహదారులు లేవు. పలు చోట్ల రాజపుత్రులు తమ స్వంత కోటలను నిర్మించుకున్నారు. దోపిడి దొంగల దురాగతాలు చాలా ఎక్కువగా ఉండేవి. బాల్బన్ తన సైన్యాలను దింపి ఈ దోపిడీ దొంగలందరినీ అంతం చేశాడు. రాజపుత్రుల కోటలను ధ్వంసం చేశాడు. అడవులను నరికించి బాటలు వేశాడు. ఆ ప్రాంతంలో ఆఫ్ఘనిస్తాన్ ప్రాంతపు సైనిక బృందాల స్థావరాలను నెలకొల్పాడు.

సామంతులు విధిగా చక్రవర్తి ముందు సాగిలపడి అతని పాదాలను ముద్దాడాలన్న నిబంధనను బాల్బన్ విధించాడు. అది ఇస్లాం మతానికి వ్యతిరేకమైన ఆచారమైనా పట్టించుకోలేదు. ఆస్థానంలో హాస్యాన్ని అనుమతించేవాడు కాదు. మద్యాన్ని ముట్టుకోలేదు. ఎప్పుడు బైటకు వచ్చినా చుట్టూ విచ్చుకత్తుల కాపలా ఉండేది.

ఎంత క్రూరంగా వ్యవహరించినా, ఆనాడు మధ్య, పశ్చిమ ఆసియా ప్రాంతం యావత్తూ ఆక్రమించుకుని ముస్లిం రాజ్యాలను నేలమట్టం చేసిన మంగోల్ సామ్రాజ్య శక్తి మాత్రం ఢిల్లీ సామ్రాజ్యాన్ని దెబ్బ తీయలేక పోయింది. బాల్బన్ సైనిక శక్తి, సన్నద్ధత దానికి కారణం. ఆసియాలో ఇస్లాం మతానికి మొనగాడుగా ఒక్క ఢిల్లీ రాజ్యం మాత్రమే ఆనాడు నిలబడింది.

ఐతే బాల్బన్ పాలనాకాలంలో అధికారాన్నుంచి మినహాయించబడ్డ వారు (తురుష్కులు కానివారు) అసంతృప్తితో రగిలిపోతూ అవకాశం కోసం ఎదురుచూశారు. 1286లో బాల్బన్ మరణించిన తర్వాత అలజడులు రేపడానికి వారికి అవకాశం చిక్కింది.

### మంగోలుల నుండి ఉపఖండానికి ముప్పు

భారత ఉపఖండానికి సహజమైన సరిహద్దులు అన్నివైపులా ఉండడం వలన వెలుపల నుండి దురాక్రమణలకు, దాడులకు ఉన్న అవకాశాలు తక్కువ. ఐతే, వాయవ్య సరిహద్దు మాత్రం ఇందుకు మినహాయింపు. అక్కడ ఉన్న హిందూకుష్ పర్వత కనుమల గుండా భారత ఉపఖండంలోకి ప్రవేశించడం సాధ్యం. అందుచేత ఈ పర్వత ప్రాంతాలమీద పట్టు కలిగివుండడం చాలా కీలకం. అంటే కాబూల్ నుంచి గజని, కాందహార్ వరకూ ఉన్న ప్రాంతం మీద (ఇందులో ఇప్పుడు ఎక్కువ భాగం ఆఫ్ఘనిస్తాన్‌లో ఉంది) ఆధిపత్యం సాధించాలి. ఢిల్లీ సుల్తానుల సామ్రాజ్యం ఈ ప్రాంతంమీద పట్టు సాధించలేకపోయింది. దాంతో భారత ఉపఖండానికి నిరంతరమూ వాయువ్యం వైపు నుండి ప్రమాదం పొంచివుండేది.

మధ్య ఆసియాలో ఖ్వారిజ్మీ సామ్రాజ్యం బలంగా తయారై, తన ప్రాబల్యాన్ని కాబూల్, కాందహార్, గజని వరకూ విస్తరించింది. ఇక ఆ తర్వాత ఢిల్లీ మీద పట్టు సాధించడం కోసం పూనుకోవడమే తరువాయి అన్న దశలో మంగోలులు వచ్చిపడ్డారు. మంగోలు సామ్రాజ్యాన్ని స్థాపించిన ఛెంగిజ్ ఖాన్ తాను

దైవాంశతో జన్మించానని ప్రచారం చేసుకున్నాడు. 1220లో ఛెంగిజ్ ఖాన్ ఖ్వారిజ్మీ సామ్రాజ్యాన్ని ధ్వంసం చేశాడు. మధ్య, పశ్చిమ ఆసియా ప్రాంతంలోని పలు నగరాలను కొల్లగొట్టాడు. తురుష్క సైనికులలో చాలామంది మంగోలుల పక్క చేరిపోయారు. తాను కొల్లగొట్టిన నగరాల్లోని ముఖ్య నాయకులను నరికివేయడం, చేతివృత్తుల వారిని తమ సేనలకు కావలసిన ఉత్పత్తుల తయారీలో నియోగించడం, తక్కిన వారిని బానిసలుగా అమ్మేయడం...ఇదీ ఛెంగిజ్‌ఖాన్ అనుసరించిన విధానం. ఈ విధ్వంసాన్నుంచి కోలుకోడానికి ఇరాన్, ఇరాక్ వంటి దేశాలకు ఆ తర్వాత కొన్ని శతాబ్దాలు పట్టింది.

మంగోలుల దాడులనుంచి తప్పించుకోగలిగిన చిన్న చిన్న ప్రభువులు, పండితులు, మత గురువులు అందరికీ ఏకైక ముస్లిం రాజ్యంగా ఉన్న డిల్లీయే దిక్కు అయింది. ఈ క్రమంలో కొత్తగా వచ్చినవారికి, పాతవారికి అందరికీ భారతదేశ పరిస్థితులకు అనుగుణంగా పరిణామం చెందవలసిన అగత్యం ఏర్పడింది.

> **“ మంగోలుల దాడులనుంచి తప్పించుకోగలిగిన చిన్న చిన్న ప్రభువులు, పండితులు, మత గురువులు అందరికీ ఏకైక ముస్లిం రాజ్యంగా ఉన్న డిల్లీయే దిక్కు అయింది. ఈ క్రమంలో కొత్తగా వచ్చినవారికి, పాతవారికి అందరికీ భారతదేశ పరిస్థితులకు అనుగుణంగా పరిణామం చెందవలసిన అగత్యం ఏర్పడింది. ”**

1221లో భారత ఉపఖండానికి మంగోలులనుండి ముప్పు ఏర్పడింది. ఐతే ఛెంగిజ్‌ఖాన్ సింధునదిని దాటి భారత భూభాగంలోకి రావడం కన్నా ముందు మధ్య ఆసియా ప్రాంతాన్ని కొల్లగొట్టడానికే ఎక్కువ ప్రాధాన్యతనిచ్చాడు. దాంతో ఇల్టుట్మిశ్ (అప్పటి డిల్లీ పాలకుడు)కు కొంత వ్యవధి లభించింది. దానితో అతడు అతి కష్టం మీద లాహోర్, ముల్తాన్ ప్రాంతాలమీద పట్టు సాధించాడు. మంగోలుల దాడులను తట్టుకోడానికి అది రక్షణ కవచంగా తర్వాత కాలంలో ఉపయోగపడింది.

1226లో ఛెంగిజ్‌ఖాన్ మరణించాక మంగోల్ సామ్రాజ్యాన్ని అతడి కుమారులు పంచుకున్నారు. 1240 వరకూ మంగోలుల ప్రధాన దృష్టి అంతా సిరియా, ఇరాక్‌ల మీద ఉండేది. దాంతో వాళ్ళు సింధునదిని దాటి భారత భూభాగం వైపు వచ్చే ప్రయత్నాలు చేయలేదు. ఈ లోపు డిల్లీ సుల్తానులు ఒక బలమైన సైన్యాన్ని నిర్మించడానికి వ్యవధి చిక్కింది. 1241లో తైర్ బహదూర్ అనే మంగోల్ సేనానాయకుడి ఆధ్వర్యంలో లాహోర్ ముట్టడి జరిగింది. ఆ నగరాన్ని మొత్తంగా మంగోలులు దోచుకున్నారు. 1245లో మంగోలులు ముల్తాన్‌ను ముట్టడించారు. అక్కడికి వేగంగా చేరుకున్న బాల్బన్ సేనలు చాలా కాలం పోరాడి మొత్తానికి ముల్తాన్‌ను నిలుపుకోగలిగారు.

ఈ సమయంలో బాల్బన్ ఒక పక్క సైనిక శక్తిని ప్రదర్శిస్తూనే మరోపక్క మంగోలులతో రాయబారాలు నడిపాడు. ఒక ఎత్తుగడగా మంగోలులకు పంజాబ్‌లో గణనీయ ప్రాంతం మీద అధికారం ఉండేందుకు అంగీకరించాడు. మంగోలులు బియాస్ నదిని దాటి రాకుండా జాగ్రత్తపడ్డాడు.

1292లో 1,50,000 అశ్విక సైన్యంతో మంగోలులు దండెత్తి వచ్చారు. వారిని డిల్లీ సైన్యాలు జలాలుద్దీన్ ఖిల్జీ నాయకత్వంలో ఓడించాయి. మంగోలులు సంధి చేసుకోక తప్పింది కాదు. ఆ తర్వాత ప్రస్తుత ఉజ్బెకిస్తాన్ ప్రాంతాన్ని (ట్రాన్స్ ఓక్సియానా) పాలించిన మంగోలు రాజు దావా ఖాన్ 1297లో డిల్లీ మీద దండెత్తాడు. 1299 నాటికి దాదాపు డిల్లీని ఆక్రమించుకున్నారు. వారిని అల్లావుద్దీన్ ఖిల్జీ సేనలు ఎదుర్కొన్నాయి. కొన్ని భీకర సమరాల తర్వాత మంగోలు సేనలు వెనక్కి తగ్గాయి. 1303లో మళ్ళీ మరోసారి దాడికి మంగోలులు తయారయ్యారు. ఈ మారు వారిని అల్లావుద్దీన్ ఖిల్జీ డిల్లీ వెలుపల సిరి వద్ద ఎదుర్కొన్నాడు. చివరికి మంగోలు సేనలు వెనక్కి తగ్గాయి.

మంగోలులు సాగించిన ఈ దాడులను తిప్పికొట్టగల పాటవం డిల్లీ సేనలకు ఉందని ఈ యుద్ధాలు వెల్లడి చేస్తున్నాయి. మధ్య, పశ్చిమ ఆసియా ప్రాంతంలోని తక్కిన దేశాలు ఈ మాదిరిగా మంగోలుల ధాటిని తట్టుకోవడంలో విఫలమయ్యాయి. ఈ దాడుల అనంతరం అల్లావుద్దీన్ ఖిల్జీ తన సేనలను మరింత బలంగా సిద్ధం చేసి గతంలో కోల్పోయిన లాహోర్‌ను తిరిగి స్వాధీనం చేసుకోవడం మాత్రమే కాక దానిని దాటి ఝీలం నదీ తీరం వరకూ విస్తరించాడు.

**అంతర్గత తిరుగుబాట్లు**

ఒకపక్క డిల్లీ పాలకులు మంగోలుల దాడులను తిప్పికొట్టే పనిలో మునిగివున్నప్పుడు వారు అంతర్గతంగా పలు తిరుగుబాట్లను కూడా ఎదుర్కోవలసివచ్చింది. తురుష్కుల చేతుల్లో మొత్తం అధికారం ఉందన్న కారణంగా తిరగబడిన ముస్లిం దండనాయకులు, రాజపుత్ర రాజులు పలువురు ఈ తిరుగుబాట్లకు కారకులయ్యారు. ఒకపక్క తురుష్క సేనల మీద తిరుగుబాటు కొనసాగిస్తూనే మరోవైపు తమ పొరుగు రాజపుత్ర రాజ్యాల భూభాగాలను కూడా ఆక్రమించుకోడానికి వారు ప్రయత్నించారు. ఈ తిరుగుబాట్లు తమ తమ స్వంత ప్రయోజనాలకోసం జరిగినవే తప్ప ఇదేదో “హిందూ ప్రతిఘటన” అన్నట్టు చిత్రించడం సరైనది కాదు.

ఈ ప్రతిఘటనలలో బెంగాల్, బీహార్ ప్రాంతానికి ప్రాంతీయ అధికారులుగా నియమించబడిన మహమ్మద: బిన్ భక్తియార్ ఖిల్జీ, అతడి అనంతరం ఐవాజ్ డిల్లీ ప్రభువులమీద తిరుగుబాటు ప్రకటించి స్వతంత్రం ప్రకటించుకున్నారు. అప్పుడప్పుడు డిల్లీ చక్రవర్తులు తమ అధికారాన్ని నిలబెట్టుకోడానికి ప్రాంతీయ పాలకులను దండించినా, బెంగాల్, బీహార్ ప్రాంతం ఎక్కువగా డిల్లీకి లోబడకుండా స్వతంత్రంగానే వ్యవహరిస్తూవచ్చింది.

గంగా డెల్టా ప్రాంతంలో కూడా డిల్లీ సుల్తానులను సవాలు చేసి స్వతంత్రంగా వ్యవహరించిన రాజ్యాలు ఉండేవి. ఐతే బాల్బన్ హయాం నాటికి తూర్పు రాజస్తాన్ ప్రాంతం అంతా డిల్లీ సుల్తానుల ఆధీనంలోకి వచ్చింది.

బలంగా ఏకచ్ఛత్రాధిపత్యాన్ని నెలకొల్పడం, మంగోలుల దురాక్రమణలను తిప్పికొట్టడం, గంగా డెల్టా ప్రాంతంలో, రాజస్తాన్ తూర్పు ప్రాంతంలో పూర్తి పట్టు కలిగి వుండడంతో, ఆ తర్వాత డిల్లీ సుల్తానులు పశ్చిమ భారతంలోకి దక్కనులోకి విస్తరించడం కోసం అడుగులు వేశారు.

**(తరువాయి వచ్చే సంచికలో)**

సంస్కృతి

# పిసి జోషి: భారతీయ సాంస్కృతిక పునర్జీవనం


రచయిత మార్క్సిస్టు సిద్ధాంతవేత్త

**అనిల్ రాజీమ్‌వాలే**

భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ప్రధాన కార్యదర్శిగా 1935 నుండి 1947 వరకు పనిచేసిన పి.సి. జోషి ఆధునిక భారత సాంస్కృతిక చరిత్రపై ప్రగాఢ ముద్ర వేశారు. ప్రాచీన కాలం నుండి స్వాతంత్ర్యానంతర భారతం వరకు ఆ రంగంలో ఆయన చేసిన కృషి అనితరసాధ్యమైనది. మన దేశంలో ఆధునిక సాంస్కృతిక పునరుజ్జీవనానికి చేసిన కృషి కోసం ఒక వ్యక్తికి ఏదైనా అత్యున్నత అవార్డు ఇచ్చే అవకాశం ఉంటే అది నిర్ద్వందంగా పి.సి. జోషినే వరిస్తుంది. కార్మికులను, రైతులను సంఘటితం చేయడమనేది తప్పని సరైన అత్యంత కీలకమైన విషయమన్న అంశం ప్రత్యేకంగా చెప్పవనసరం లేదు. పి.సి. జోషి తాను నివసించిన కాలంలోని పరిస్థితులను సరిగా అవగతం చేసుకున్నారు. వాటి సారాన్ని అనేక రూపాల్లో వ్యక్తం చేయడానికి ఆయన కృషి చేశారు. ఆ వ్యక్తీకరణలు అనేక రూపాల్లో విస్తృతంగా, విశేషంగా కనిపించాయి. వాటిలో సాంస్కృతిక వ్యక్తీకరణలు చాలా ముఖ్యమైనవి. ఇక్కడ కీలకమైన విషయం ఏమిటంటే కమ్యూనిస్టు పార్టీ అత్యున్నత నాయకుడే ఆధునిక సాంస్కృతిక పునరుజ్జీవనం కోసం కూడా ముందడుగు వేయడం. ఈ దృక్కోణంలో చూస్తే పి.సి. జోషి ఒక 'ఆర్గానిక్ ఇంటెలెక్చువల్' పాత్రను కొంతమేరకైనా పోషించారని చెప్పవచ్చు. ఆయన ఎంతో విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లి ఒక సామూహిక సాంస్కృతిక శక్తిని విడుదల చేశారు. ఈ దిశలో ఆయన చేసిన కృషిని ఇప్పటి వరకు ఎవరూ సరిగ్గా విశ్లేషించలేదు. ఎందుకు ఆయన దీనిపై దృష్టి సారించారు? ఎలా దానిని సాధించగలి గారు? అన్న ప్రశ్నలకు జవాబు అంత సులభంగా చెప్పలేం. దీనికి సంబంధించిన అనేక పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉంది. అయితే, ఆయనకు భారతీయ కళ, సాహిత్యం, సాహిత్య-కళా ఉద్యమాలపై లోతైన అవగాహన ఉందని స్పష్టంగా చెప్పవచ్చు. (ఉదాహరణకు 1857లో విస్మృతంగా ప్రచారంలో ఉన్న పాటలు, భారతదేశంలో సాహిత్య, సాంస్కృతిక కార్యకలాపాలు ప్రొగ్రెసివ్ రైటర్స్ అసోసియేషన్ (పిడబ్ల్యుఎ), ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ (ఐపిటిఎ) వంటి ఉద్యమాలను ప్రభావితం చేశాయి. ఈ ఉద్య మాలకు ప్రపంచవ్యాప్తంగా చోటుచేసుకున్న సాంస్కృతిక ఉద్యమాలు కూడా ప్రేరణనిచ్చాయి.

**ఫాసిజానికి వ్యతిరేకంగా ప్రపంచ రచయితల ఉద్యమం**

1935, జూన్ 21న ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో ప్రపంచ రచయితల సమావేశం జరిగింది. ఆండ్రే గిడ్, మాక్సిమ్ గోర్కీ, ఆండ్రే మాల్‌రక్స్, ఇ.ఎం. ఫోర్స్టర్ తదితరులు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశ ఫలితంగా 'ఫాసిజానికి వ్యతిరేకంగా సాంస్కృతిక పరిరక్షణ కోసం అంతర్జాతీయ రచయితల సంఘం' (International Association of Writers for the Defence of Culture Against Fascism) ఏర్పాటైంది.

అది ప్రపంచవ్యాప్తంగా ఉన్న విద్యావంతులు ఫాసిజాన్ని ఎదిరిస్తూ వేగంగా ముందుకు వస్తున్న కాలం. జర్మనీలో హిట్లర్ అధికారంలోకి రావడానికి కొద్దిగా ముందు నుంచి, ముఖ్యంగా ఆయన అధికారం చేపట్టిన తర్వాత, సమాజంలోని మేధావులు, విద్యావంతుల్లో గట్టి వ్యతిరేకత చెలరేగింది. అల్బర్ట్ ఐన్‌స్టీన్ వంటి ప్రతిభావంతులను కూడా వేటాడి, బయటకు పంపే పరిస్థితులు జర్మనీలో నెలకొన్నాయి. ఉన్నతశ్రేణి రచయితలు, శాస్త్ర వేత్తలు, ఇతర రంగాల ప్రముఖులు కూడా ఫాసిస్టుల నుండి తీవ్ర హింసకు గురవుతామనే భయంతో ఆ దేశాన్ని వదిలి వెళ్లిపోయారు. ఎటువంటి భిన్నాభిప్రాయాలనూ, విమర్శలనూ ఫాసిజం సహించలేదు. ఈ పరిస్థితులు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న విజ్ఞాన, సాహిత్య రంగాలకు చెందిన వారిలో కలకలాన్ని రేపాయి. అంతర్జాతీయ రచయితల సంఘం (International Association of Writers) ఫాసిజానికి వ్యతిరేకంగా జరిపే పోరాటంలో ఒక కొత్త అవగాహన, స్పష్టతను తీసుకువచ్చింది. రాల్ఫ్ ఫాక్స్, క్రిస్టఫర్ కాడ్వెల్, రొమె రోలా, గోర్కీ, రవీంద్రనాథ్ ఠాగూర్, మహాత్మా గాంధీ వంటి నాయకుల స్ఫూర్తి ప్రపంచవ్యాప్తంగా వ్యాపించింది. హెన్రీ బార్బస్ క్రియాశీల పాత్ర పోషించగా, లూయి అరగాన్ ఫ్రెంచ్ సాహిత్యానికి, తత్వశాస్త్రానికి, మానవీయతకు స్ఫూర్తి దాయకంగా నిలిచారు.

**పి.సి. జోషి, రచయితలు - కళాకారులు**

పి.సి. జోషి అనేక విధాలుగా ఫాసిజానికి, సామ్రాజ్యవాదంతో పాటు ఏరకమైన అన్యాయానికైనా వ్యతిరేకంగా చైతన్యవంతమైన పోరాటం చేయగల వ్యక్తిగా నిలిచారు. ఆయన వ్యక్తిత్వంలోనే అంతర్లీనంగా స్వేచ్ఛ, స్వాతంత్రం, ఆత్మగౌరవ భావనలు నిండిఉన్నాయి. అందువల్లే ఆయనలో సహజంగానే ఫాసిజం పట్ల వ్యతిరేకత వ్యక్తమైంది. 1930ల ప్రారంభం నుంచి, ముఖ్యంగా 1934-36 మధ్యకాలంలో భారతదేశంలో అభ్యుదయ రచయితల ఉద్యమం అవసరం అన్న భావన బలంగా ఏర్పడింది. దేశం నలుమూలలలోని

అనేక రచయితల సమూహాలు స్వప్న ప్రపంచాలకు, పలాయనవాదాలకు పరిమితమైన తమ పాత తరహా రచనా విధానాన్ని విడిచిపెట్టి అభ్యుదయకరమైన నూతన మార్గంలో నడవాలనే తపనతో ఉన్నారు. ఆ రోజుల్లో విస్తృతమౌతున్న సామ్రాజ్యవాద వ్యతిరేక, ఫాసిస్టు వ్యతిరేక భావనలు కూడా భారతీయ రచయితలపై ప్రభావం చూపాయి. దీంతో క్రియాశీల, సమకాలీన, ప్రజా జీవితంతో ముడిపడ్డ రచనల కోసం రచయితలు సంకల్పం తీసుకోవడానికి సిద్ధపడుతున్నారు.

భారత కమ్యూనిస్టు ఉద్యమం పి.సి. జోషి నేతృత్వంలో సాగిన కాలం అది. భారతీయ సాంస్కృతిక పునరుజ్జీవన ఉద్యమాన్ని సృజనాత్మకంగా అర్థం చేసుకునే దశగా ఆ కాలం నిలిచింది. రచయితలు, కళాకారులు భారీగా ముందుకు వచ్చి ఈ సామూహిక సృజనాత్మక కార్యకలాపంలో పాల్గొన్నారు. ఆ కాలంలో జరిగిన పరిణామాలకు సహజ ఫలితంగా అభ్యుదయ రచయితల సంఘం ఆవిర్భవించింది. పి.సి. జోషి నేతృత్వం, సరైన దిశానిర్దేశం కారణంగా ఆ అవకాశాన్ని వృదా కానీయకుండా వినియోగించకోగలిగారు.

1936 ఫిబ్రవరిలో ఒక మానిఫెస్టోను విడుదల చేశారు. దీనిపై ప్రేమ్‌చంద్, ఆబిద్ హుస్సెయిన్, దయా నరైన్ నిగమ్, అబ్దుల్ హక్ తదితరులు సంతకం చేశారు. ప్రజలను కేంద్రంగా చేసుకుని, మార్క్సిజం దృష్టికోణంలో సాహితీ ప్రక్రియలను సృష్టించాలన్న ఆలోచనలకు అది భూమికగా మారింది. అభ్యుదయ రచయితల సంఘం (ప్రోగ్రెసివ్ రైటర్స్ అసోసియేషన్)కు ఒక వ్యవస్థాపక కమిటీ ఏర్పాటయ్యింది. ఢిల్లీ, అలహాబాద్, లాహోర్, అలీగఢ్ వంటి నగరాలలో అసోసియేషన్‌కు శాఖలు స్థాపించబడ్డాయి. లండన్‌లో భారతీయ అభ్యుదయ రచయితల సంఘం ఒక సంవత్సరం ముందుగానే ఏర్పడింది. భారతదేశంలోని ప్రతి సాహిత్య కేంద్రంలో శాఖలను స్థాపించడానికి ప్రయత్నాలు జరిగాయి. పూణె, కలకత్తా, బొంబాయి, కాన్పూర్, బెనారస్ తదితర ప్రాంతాల్లో రచయితలతో సమావేశాలు, చర్చలు జరిగాయి.

భారతదేశ చరిత్రలో మొదటిసారి మద్రాస్, గుజరాత్, మహారాష్ట్ర, పంజాబ్, ఉత్తర ప్రదేశ్, బెంగాల్ వంటి విభిన్న ప్రాంతాల నుండి వచ్చిన రచయితలు లక్నోలో కలుసుకున్నారు. 1936 ఏప్రిల్ 10న అక్కడే మొట్టమొదటి సారి అఖిల భారత అభ్యుదయ

> “ భారత కమ్యూనిస్టు ఉద్యమం పి.సి. జోషి నేతృత్వంలో సాగిన కాలం అది. భారతీ య సాంస్కృతిక పునరుజ్జీవన ఉద్యమాన్ని సృజనాత్మకంగా అర్థం చేసుకునే దశగా ఆ కాలం నిలిచింది. రచయితలు, కళాకారులు భారీగా ముందుకు వచ్చి ఈ సామూహిక సృజనాత్మక కార్యకలాపంలో పాల్గొన్నారు. ఆ కాలంలో జరిగిన పరిణామాలకు సహజ ఫలితంగా అభ్యుదయ రచయితల సంఘం ఆవిర్భవించింది. పి.సి. జోషి నేతృత్వం, సరైన దిశానిర్దేశం కారణంగా ఆ అవకాశాన్ని వృదా కానీయకుండా వినియోగించకోగలిగారు. ”


పిసి జోషి

రచయితల సంఘ సమావేశం జరిగింది. ఈ సభకు పెద్దగా సన్నాహాలు చేయలేదు. కేవలం మూడువారాల సమయంలోనే ఈ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సభను భారతీయ సాహిత్య చరిత్రలో ఒక మైలురాయిగా చెప్ప వచ్చు. దేశవ్యాప్తంగా రచయితలు మొదటి సారిగా ఒకే వేదికపై వచ్చిన సందర్భమది. ఈ సభ కేవలం సాహిత్య అంశాలకు పరిమితం కాలేదు. అంతకన్నా విస్తృతమైన అంశాలు చర్చకు వచ్చాయి.

కేవలం సాహిత్య పరంగానే కాకుండా జాతీయ, సాంస్కృతిక సామాజిక అంశాలతో పాటు స్వాతంత్ర్యపోరాటం, ప్రజాస్వామ్యం వంటి అంశాలపై కూడా ఈ సభలో చర్చించారు. ఈ సమావేశమే, 'అభ్యుదయ రచయితలు' అనే కొత్త దృక్పధానికి మార్గం వేసింది. భారతీయ పునరుజ్జీవన ఉద్యమానికి ఒక కొత్త దశగా నిలిచింది. ప్రపంచవ్యాప్తంగా పెరుగు తున్న ఫాసిజపు వాతావరణానికి వ్యతిరేకంగా నిలిచింది. పెద్ద సంఖ్యలో రచయితలను, సాహితీ ప్రముఖులను అభ్యుదయ ఉద్యమంలోకి తీసుకువచ్చింది. ఈ సమావేశం తరువాత అభ్యుదయ రచయితల ఉద్యమం విస్తృతమైంది. కోల్‌కత్తాతో పాటు, దేశ వ్యాప్తంగా అనేక నగరాల్లో శాఖలు ఏర్పడ్డాయి.

1936లో జరిగిన సాహితీ సమ్మేళనం అనంతరం ప్రోగ్రెసివ్ రైటర్స్ అసోసియేషన్ వేగంగా విస్తరించింది. కోల్‌కత్తా సహా అనేక ప్రాంతాల్లో దీని శాఖలు స్థాపించారు. 1938 డిసెంబరులో కోల్‌కత్తాలో జరిగిన రెండవ మహాసభలో ప్రముఖ సాహిత్యవేత్త ముల్క్ రాజ్ ఆనంద్ మాట్లాడుతూ, 'భారతదేశంలో ఆధునిక సాహిత్య అభివృద్ధిని నిర్బంధాలు, సెన్సార్ విధానాలు తీవ్రంగా అడ్డుకున్నాయని, ఆ విధానాలు నాజీయిజం, ఫాసిజం తరహా శక్తుల అభివృద్ధికి దోహదపడ్డాయని భారతీయ రచయితలు ఇప్పుడు స్పష్టంగా గ్రహించారు' అని అన్నారు.

ఇరవైవ శతాబ్దం ప్రారంభంలో, బ్రిటిష్ పాలన కొనసాగుతున్నప్పటికీ సాహిత్యం, సాహిత్య– జాతీయవాదం అనేవి ఒక గొప్ప ఉద్వేగంతో విస్తరించాయి. బ్రిటిష్ నిబంధనలు ఈ రకాల రచనలను చట్టబద్ధంగా నిషేధించినా, రచనల ఉధృతి తగ్గలేదు. నయా సంసార్ పబ్లిషింగ్ హౌస్‌ను స్థాపితమైంది. సజ్జాద్ జహీర్ రచించిన నాటకం బీమార్, అలీ సర్దార్ జాఫ్రీ రచించిన మంజిల్, హయత్ ఉల్లా అంసారీ

> **❝ మర్థ్యాన్ని వెలికితీసి, చైతన్యపరిచే కార్యక్రమాన్ని సిపిఐ అప్పటికే ప్రారంభించింది. సిపిఐ తొలి మహాసభ (1943 మే 23 నుండి జూన్ 1వరకు) జరిగిన సందర్భంలోనే ఇప్టా ఆవిర్భావ సదస్సు జరిగింది. ఈ తొలి మహాసభ ఒక గొప్ప రాజకీయ సంఘటన మాత్రంగానే కాకుండా, గొప్ప సాంస్కృతిక సంఘటనగా కూడా చరిత్రలో నిలిచింది. పార్టీ మహాసభకు దేశంలోని వివిధ రాష్ట్రాల నుండి, విభిన్న ప్రాంతీయ, సాంస్కృతిక గుర్తింపులతో కూడిన బృందాలు తరలివచ్చాయి. ❞**

రాసిన అనోఖీ ముసీబత్, బీ.బీ బేనిపురి రచించిన లాల్ తారాలి, కృష్ణన్ చందర్, ఖాజా అహ్మద్ అబ్బాస్ స్పారోస్ వంటి రచనలతో పాటు, ప్రేమ్‌చంద్ రచనలు, 1938 ఏప్రిల్‌లో జరిగిన రైతుల కవుల మహాసభ, బాంబే, కాన్పూర్‌లలో నిర్వహించబడిన మజ్దూర్ (కార్మిక) కవుల ముషైరా, జుగల్ కిశోర్ శుక్లా రచనలు, వీటితో సమానమైన అనేక సాహిత్య కార్యక్రమాలు... ఇవన్నీ జాతీయవాదుల లోనూ, అణగారిన ప్రజలలోంచి వచ్చిన సజీవ మేధావుల్లోనూ లోతైన ఆలోచనా ప్రక్రియలను ప్రతిబింబించాయి.

### సాహిత్య రంగంలో జోషి

పి.సి. జోషి రచయితల, కళాకారుల, మేధావర్గాల ఆర్గనైజర్‌గానే కాకుండా తానే స్వయంగా ఒక సాహిత్య రచయితగా, మేధావిగా కూడా పేరుపొందారు. ఆయన రచనల్లో ఇది స్పష్టంగా కనిపిస్తుంది, ముఖ్యంగా 1857 విప్లవ కాలంలో వచ్చిన సాహిత్యంపై ఆయన అనేక పరిశీలనలు చేశారు.

'1857పై ప్రజాగీతాలు' అనే వ్యాసంలో జోషి "ప్రజల వరకు చేరే భారతీయ సంప్రదాయ పద్ధతి ప్రజాగీతాలే! 1857 తిరుగుబాటును నడిపించిన నేతలు ఈ ప్రజా గీతాలను, ఇతర జానపద రూపాలను సమర్థవంతంగా ఉపయోగించారు. బొమ్మలాట వాళ్లు తమ ప్రదర్శనల ద్వారా బ్రిటిష్ పాలనపై ద్వేషాన్ని ప్రేక్షకులలో వ్యాపింపజేశారు. అప్పటిదాకా వివిధ జాతీయ ఘటనలపై వచ్చిన జానపద గీతాలను పరిగణనలోకి తీసుకుంటే, 1857 తిరుగుబాటుపైనే అత్యధికంగా వచ్చాయి. ఇది ఆ పోరాటానికి ప్రజలలో వచ్చిన మద్దతును, జానపద కళల్లో ఉన్న విప్లవ ఆవేశాన్ని సూచిస్తుంది" అని రాశారు.

అభ్యుదయ రచయితల సంఘం, ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ (ఐపిటిఎ) స్థాపనకు ముందు నుంచీ, ఆ సంస్థలను స్థాపించిన తరువాత కూడా పిసి జోషి పలువురు రచయితలను, కళాకారులను సంఘటితం చేసి, చైతన్య పరచేవారు. స్వత హాగా రాజకీయ నాయకుడైనా, మేధావులు, కవులు, రచయితలు, శాస్త్రవేత్తలు, ప్రభుత్వ అధికారులు, పాత్రికేయులు, న్యాయవాదులు ఇలా ఎన్నో రంగాల ప్రతిభావంతుల ప్రేమనూ, గౌరవాన్నీ ఆయన పొందారు. రైతులు, కార్మికులు ఇలా సాధారణ ప్రజలు కూడా ఆయనను ఎంతో అభిమానించేవారు. సుమిత్రానందన్ పంత్, రాహుల్ సాంకృత్యాయన్, బల్రాజ్ సహ్నీ, యశ్‌పాల్ లాంటి ప్రముఖులతో పాటు సాహిత్య, కళ, శాస్త్ర, అకడమిక్ రంగాలకు చెందిన అనేక అనేక మంది జోషిని ఎంతో గౌరవంగా చూసేవారు. ఆయన చెప్పేది వినేందుకు, ఆయన రచనలను చదవటానికి వారు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండేవారు. నేషనల్ ఫ్రంట్, పీపుల్స్ వార్, పీపుల్స్ ఏజ్ తదితర పార్టీ ప్రచార పత్రికల చుట్టూ అనేకమంది ప్రసిద్ధ రచయితలు, పాత్రికేయులు, కళాకారులు, ఆర్థిక శాస్త్రవేత్తలు, చరిత్రకారులు, సినిమా, రంగస్థల ప్రముఖులను ఆయన సమీకరించారు. చిత్తప్రసాద్ వంటి చిత్రకారులు, సునీల్జన వంటి ఫోటోగ్రాఫర్లు ఆయన నేతృత్వంలో పనిచేశారు. ఆయన నేతృత్వం లోని పార్టీ పత్రికలు, ప్రచార సాహిత్యం నేటికీ ఆదర్శమే.

కమ్యూనిస్టు పార్టీ, అనుబంధ సంఘాల సాహిత్యం రాజకీయ, సిద్ధాంతపరమైన లోతుతో ఉండేది. సంఘటనలను పైపైనుండే కాకుండా, వాటి అంతరార్థాలను. కారణాలను కూడా వివరించేవారు.

### ఇప్టా (ఐపిటిఎ) ఆవిర్భావం

భారతీయ సాంస్కృతిక పునరుజ్జీవనంలో ఒక కీలకాంశంగా ఇండియన్ పీపుల్స్ థియేటర్ కళా ఉద్యమం రూపుదిద్దుకుంది. 1943లో ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ (ఐపిటిఎ) స్థాపన భారత సాంస్కృతిక చరిత్రలో అత్యంత ముఖ్యమైన ఘటనగా చెప్పవచ్చు. ఇది భారత దేశ సాంస్కృతిక జీవితంపై చెరగని ముద్ర వేసింది. 1943లో చోటుచేసుకున్న భయంకరమైన బెంగాల్ క్షామ పరిస్థితుల నేపథ్యంలో ఈ సంఘం ఆవిర్భవిం చింది. ఆ సంక్షోభ సమయంలో సృజనాత్మక వ్యక్తులు తమ గళాలను విప్పడానికి ముందుకు వచ్చారు. కళను ప్రజలకోసం, ప్రజా పక్షంగా సామాజిక మార్పుల కోసం వినియోగించడం ఇప్టా లక్ష్యం.

దేశవ్యాప్తంగా ప్రజల్లో ఉన్న సాంస్కృతిక సామర్థ్యాన్ని వెలికితీసి, చైతన్యపరిచే కార్యక్రమాన్ని సిపిఐ అప్పటికే ప్రారంభించింది. సిపిఐ తొలి మహాసభ (1943 మే 23 నుండి జూన్ 1వరకు) జరిగిన సందర్భంలోనే ఇప్టా ఆవిర్భావ సదస్సు జరిగింది. ఈ తొలి మహాసభ ఒక గొప్ప రాజకీయ సంఘటన మాత్రంగానే కాకుండా, గొప్ప సాంస్కృతిక సంఘటనగా కూడా చరిత్రలో నిలిచింది. పార్టీ మహాసభకు దేశంలోని వివిధ రాష్ట్రాల నుండి, విభిన్న ప్రాంతీయ, సాంస్కృతిక గుర్తింపులతో కూడిన బృందాలు తరలివచ్చాయి. తమ ప్రదర్శనలతో ఆకట్టుకున్నాయి. ఆంధ్ర, బెంగాల్, బీహార్, కేరళతో పాటు ఇతర ప్రాంతాల నుండి వచ్చిన కళాకారులు, బృందాలు ఉల్లాసభరితమైన కార్యక్రమాలు నిర్వహించాయి. రాజకీయంగా అత్యంత కీలకమైన ఈ సమావేశంలో ఒక్క క్షణం కూడా నిరుత్సాహంగా అనిపించలేదు. పార్టీకి ఉన్న సాంస్కృతిక గాఢ అనుబంధాన్ని, భారతదేశ సాంస్కృతిక వైవిధ్యానికి, కళా సంపదకు ఉన్న గొప్ప వైభవానికి ఈ సభ అద్దం పట్టింది.

ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ (ఇప్టా) ప్రారంభ సదస్సు 1943 మే 25న బాంబేలోని మార్వాడీ విద్యాలయంలో జరిగింది. దీనికి కొన్ని సంవత్సరాలు ముందు నుండి ఏర్పడిన అనేక సంస్థలు, వాటిలో సాగిన సిద్ధాంత చర్చలు అంతిమంగా ఇప్టా ఏర్పాటుకు దారి తీశాయి. 1836లో ఏర్పాటైన అభ్యుదయ రచయితల సంఘం 1940లో కలకత్తాలో యూత్ కల్చరల్ ఇన్‌స్టిట్యూట్ స్థాపన, 1941లో బెంగుళూరులో ఏర్పాటైన 'పీపుల్స్ థియేటర్' (శ్రీలంక మూలాలు ఉన్న అనిల్ డి సిల్వా అనే మహిళ దీనిని ఏర్పాటు చేశారు)

తదితర సంస్థలు, సంఘాల్లో జరిగిన చర్చలు ఇప్టా ఆవిర్భావానికి దారి తీశాయి. ప్రముఖ శాస్త్రవేత్త హోమి జహంగీర్ బాబా పీపుల్స్ థియేటర్ అనే పేరును సూచించారు. ఇదే అంశంపై రోమె రోలా అనే ఫ్రెంచ్ రచయిత రాసిన ఒక పుస్తకం ఆధారంగా ఆయన ఈ పేరును సూచించారు.

> ❝ బెంగాల్ కరువు సమయంలో చేపట్టిన సహాయ చర్యలు గొప్ప ప్రేరణగా నిలిచాయి. అప్పుడు బెంగాల్లోనే కాక దేశంలోని ఇతర ప్రాంతాల్లోనూ బృందాలు ఏర్పడ్డాయి. ఈ బృందాలు కేవలం ప్రజల్లో చైతన్యాన్ని పెంపొందించడమే కాదు, కరువు బారినపడ్డ ప్రజల కోసం డబ్బు, ఇతర సహాయక వస్తువులను సేకరించాయి. చిత్ర పరిశ్రమలో ఖ్యాతిగొన్న స్వరకర్త ప్రేమ్ ధవాన్, సినీ నటి ఉషా దత్, గాయని రేబా రాయ్, డ్రమ్ వాదకుడు దశరథ్ లాల్ వంటి వారు ఎందరో ఎంతో ఉత్సాహంగా ఈ సహాయ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ❞

బెంగాల్ కరువు సమయంలో చేపట్టిన సహాయ చర్యలు గొప్ప ప్రేరణగా నిలిచాయి. ఆ సమయంలో బెంగాల్‌లోనే కాకుండా దేశంలోని ఇతర ప్రాంతాల్లోనూ పలు బృందాలు ఏర్పడ్డాయి. ఈ బృందాలు కేవలం ప్రజల్లో చైతన్యాన్ని పెంపొందించడమే కాదు, కరువుతో ప్రభావితమైన ప్రజల కోసం డబ్బు, ఇతర సహాయక వస్తువులను సేకరించాయి. చిత్రపరిశ్రమలో ప్రఖ్యాతి గాంచిన స్వరకర్త ప్రేమ్ ధవాన్, సినీ నటి ఉషా దత్, గాయని రేబా రాయ్, డ్రమ్ వాదకుడు దశరథ్ లాల్ వంటి వారు ఎందరో ఎంతో ఉత్సాహంగా ఈ సహాయ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల్లో ఏర్పడిన సహాయ బృందాలను అఖిల భారత స్థాయిలో సంఘటిత పరచి, ఏకీకృత సంస్థగా రూపొందించేందుకు పి.సి. జోషి ముందడుగు వేశారు. దీనిలో భాగంగా జరిగిన ఇప్టా ఆవిర్భావ సభకు ప్రొఫెసర్ హిరెన్ ముఖర్జీ అధ్యక్షత వహించారు. జవహర్‌లాల్ నెహ్రూ, సరోజినీ నాయుడు, డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ వంటి పలువురు ప్రముఖులు తమ శుభాకాంక్షలు పంపారు. సరోజినీ నాయుడు ఆ తరువాత కాలంలోనూ ఇప్టాపై ఆసక్తి చూపించారు.

ఇప్టా తొలి ప్రధాన కార్యదర్శిగా బొంబాయ్ ఇప్టా కార్యదర్శి అనిల్ డి సిల్వా ఎన్నికయ్యారు. ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అయిన ఎన్.ఎం. జోషిని ఇప్టా తొలి అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. కార్యవర్గంలో కొందరు ప్రముఖులు కూడా ఉన్నారు. వారిలో బినోయ్ రాయ్, కె.టి. చాండి, మామా వరేర్కర్, కె.ఎ. అబ్బాస్, మఖ్దూమ్ మొహియుద్దీన్, డాక్టర్ రషీద్ జెహాన్, ఎస్.ఎ. శంభూ మిత్రా తదితరులు ఉన్నారు.

ఇప్టా తొలి నివేదికలో వివిధ కళారూపాలను సమగ్రంగా చర్చించారు. సామాజిక నిర్మాణం, మారుతున్న వర్గాల స్వరూపాన్ని, వాటి మధ్య ఉన్న పరస్పర సంబంధాలను విశ్లేషించారు. అణచివేతకు గురవుతున్న ప్రజలు కొత్త ఆశలతో జాగృతమవుతున్నారని, ఇది కొత్త కళా, సాంస్కృతిక రూపాల అవతరణకు దారి తీస్తోందని నివేదిక పేర్కొంది. స్వేచ్ఛ, సంస్కృతులపై పెరుగుతున్న ఫాసిస్టు దాడుల క్రూరత్వాన్ని కూడా నివేదిక గుర్తు చేసింది. ఆ అణచివేత ఫలితంగా నిజమైన కళా, సాంస్కృతిక వ్యక్తీకరణలు వెలుగులోకి వస్తున్నాయని తెలిపింది. ప్రేమ్‌చంద్, రవీంద్రనాథ్ ఠాగూర్ లాంటి వారు ఈ కొత్త ధోరణులకు ప్రాతినిధ్యం వహించేవారు. రచయితలు, కళాకారులలో ఉన్న ఈ ప్రగతిశీల ధోరణులను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఇప్టా పెట్టుకుంది.

కాలక్రమంలో అభ్యుదయ రచయితల సంఘం, ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ (ఇప్టా)లు శక్తివంతంగా మారాయి. హంగల్, అమర్ శేఖ్, అన్నా భౌ సాథే, నారాయణ్ సుర్వే, అమృత్‌లాల్ నాగర్, దినా పాఠక్, సలీల్ చౌధురి, నేమీచంద్ జైన్, సుధీ ప్రధాన్, శాంతి వర్ధన్, రవి శంకర్, శైలేంద్ర, సాహిర్ లుధియాన్వి, భూపెన్ హజారికా, అనిల్ బిస్వాస్, బిష్ణు దే, రాజేంద్ర రఘువంశి తదితరులు ఈ క్రమంలో కీలకపాత్ర పోషించారు.

### కేంద్ర సాంస్కృతిక బృందం (సెంట్రల్ కల్చరల్ స్క్వాడ్)

ఇప్టాతో పాటు భారత కమ్యూనిస్టు పార్టీకి చెందిన కేంద్ర సాంస్కృతిక బృందం కూడా ఈ ప్రక్రియలో గొప్ప చారిత్రక పాత్రను పోషించింది. ప్రముఖ నర్తకుడు శాంతి వర్ధన్ నేతృత్వంలో ఇది 1944 మధ్యలో ఏర్పాటయ్యింది.

బాలే నృత్యరూపాన్ని ప్రజాప్రచారానికి, ప్రజల్లో చైతన్యాన్ని కలిగించేందుకు ఉపయోగించవచ్చని పి.సి జోషి ప్రత్యేకంగా గుర్తించారు. పి.సి జోషి ప్రజా సంస్కృతిని విస్తృతంగా వినియోగించేందుకు చేసిన ప్రయత్నాల వల్ల ఎన్నో కొత్త కళా బృందాలు ఏర్పడ్డాయి. అవి ప్రజలను ఆకట్టుకోవడంతో వేగంగా ఎదిగాయి. ఈ స్క్వాడ్‌ను మొదట ముంబయిలోని అంధేరీ ప్రాంతంలో, పేరేరా హిల్ రోడ్డులో స్థాపించారు. శాంతి వర్ధన్, ఉదయ శంకర్, సచిన్ శాఖ్లియెన్, బాని దాస్‌గుప్తా, నరేంద్ర శర్మ, రవి శంకర్ తదితరులు ఈ బృందంలో ఉన్నారు. క్రమేణా దీనిలో కళాకారుల సంఖ్య 15కి పెరిగింది. రేఖా జైన్, గంగాధరన్ రెడ్డి, నేమీచంద్ జైన్, బినోయ్ రాయ్, శాంతా గాంధీ, దినా పాఠక్ వంటి వారు కూడా భాగస్వాములయ్యారు.

ఈ కళాబృందాలు దేశవ్యాప్తంగా అనేక నాటకాలను, బాలే ప్రదర్శనలను, ఇతర కార్యక్రమాలను ప్రదర్శించింది. ఉదాహరణకు 'నావల్ రివల్ట్'లిలి, 'అమర్ భారత్', 'భారత్ కీ ఆత్మా' వంటి నాటకాలు. అలాగే 'లంబాడీ' 'డివైన్ మ్యూజిషియన్' 'రామలీల', 'హోలీ', 'కలెక్టివ్ ఫార్మ్' వంటి నృత్యనాటికలను దేశవ్యాప్తంగా ప్రదర్శించారు. ఇవన్నీ ఎంతో ప్రజాదరణ పొందాయి.

జ్యోతిరీంద్ర మోయిత్రా రచించిన 'నవజీవనేర్ గాన్' ఆంధ్రాలో డా. గరికపాటి రాజారావు ప్రదర్శించిన బుర్రకథ, మలబార్ నృత్యాలు, మగాయ్ ఓజ్హా, అమర్ శేఖ్ ప్రదర్శనలు అద్భుతమైన ప్రజాప్రత్యామ్నాయాన్ని అందించాయి. ఇప్టా, కేంద్ర సాంస్కృతిక బృందం భారతీయ రంగస్థలానికి కొత్త దిశను ఇచ్చాయి. బిజోన్ భట్టాచార్యా రాసిన 'నబన్నా', శంకర్ వాసిరెడ్డి రచనలు, తోప్పిల్ భాసి రచించిన 'నీవే నన్ను కమ్యూనిస్టుని చేశావు' వంటి నాటకాలు దేశవ్యాప్తంగా పేరుపొందాయి. హబీబ్ తన్వీర్, బల్వంత్ గార్గీ, అలీ సర్దార్ జాఫ్రి, ఆచార్య అత్రేయ, ఉత్పల్ దత్, షీలా భాటియా, త్రిప్తి మిత్రా, ఋత్విక్ ఘటక్, దమయంతి సహ్నీ, బలరాజ్ సహ్నీ వంటి పేర్లు దేశమంతా ప్రఖ్యాతి పొందాయి. సిపిఐ, ఇప్టాలతో పాటు పిసి జోషి చేసిన అసాధారణ కృషికి ఇది ఫలితం.

**"ఇప్టా, కేంద్రసాంస్కృతిక బృందం దేశంలోని మారుమూల గ్రామీణ ప్రాంతాల లోపలకు వెళ్లగలిగాయి. అక్కడ వేలాది మంది ప్రజలు తమ ఇష్టమైన కళాకారులను చూడ టానికి, వారి కార్య క్రమాలను ఆస్వాదించ టానికి గుమిగూడేవారు. ఈ సంస్థలు కళా పరమైన, సాహిత్యపరమైన ఆసక్తి ఉన్న యువతీ, యువకులకు ప్రేరణగా మారాయి. ఆ సంస్థలలో సభ్యులుగా వారు చేరేవారు. దీనివల్ల భారీ స్థాయిలో శిక్షణ పొందిన కళాకా రులు, రచయితలు తయారయ్యారు."**

ఇప్టా, కేంద్ర సాంస్కృతిక బృందం దేశంలోని మారుమూల గ్రామీణ ప్రాంతాల లోపలకు వెళ్లగలిగాయి. అక్కడ వేలాది మంది ప్రజలు తమ ఇష్టమైన కళాకారులను చూడ టానికి, వారి కార్యక్రమాలను ఆస్వాదించ టానికి గుమిగూడేవారు. ఈ సంస్థలు కళాపరమైన, సాహిత్యపరమైన ఆసక్తి ఉన్న యువతీ, యువకులకు ప్రేరణగా మారాయి. ఆ సంస్థలలో సభ్యులుగా వారు చేరేవారు. దీనివల్ల భారీ స్థాయిలో శిక్షణ పొందిన కళాకా రులు, రచయితలు తయారయ్యారు. 1946లో భారత కమ్యూనిస్టు పార్టీ తరపున ఎన్నికల నిధుల కోసం చేసిన విజ్ఞప్తిలో, పి.సి జోషి స్వయంగా రచయితలు, కళాకారులు పార్టీకి క్రియాశీలక సహకారం అందిస్తున్నారని స్పష్టంగా చెప్పారు.

'పెద్ద ప్రజాదరణ కలిగిన కవులు వల్లతోల్, జోష్ మలిహాబాది, సుమిత్రానందన్ పంత్, నిరాలా, నవలాకారుడు శంకర్ బెనర్జీ. సాహితీవేత్తలు మాణిక్ బెనర్జీ తదితరులు కమ్యూనిస్టు పార్టీతో అన్ని విషయాల్లో ఏకీభవించకపోయినా, కమ్యూనిస్టు పార్టీకి మేము మిత్రులం, మేం వారి మేలు కోరుతాం అని గర్వంగా చెబుతున్నారు' అని జోషి తెలిపారు.

**పి. సి. జోషి మాటల్లో..**

'బెంగాలీ రంగస్థలానికి గొప్ప గురువు అయిన మనోరంజన్ భట్టాచార్య, అలాగే ప్రసిద్ధ సినీ ప్రముఖులు అయిన కె. ఎల్. సేహ్గల్, మోతీలాల్, జగ్రాజ్, కె. ఎన్. సింగ్, పంకజ్ మల్లిక్ లాంటి వారు మా పార్టీ రూపొందించిన సాంస్కృతిక కార్యక్రమాలను గణనీయంగా ప్రశంసించారు. అనేక సందర్భాల్లో పార్టీ నిధులకు తమ వంతు సహకారం అందించారు.'

'ప్రగతిశీల రచయితల ఉద్యమానికి, భారతీయ ప్రజా నాటక ఉద్యమానికి మా పార్టీ చురుకుగా సహకరించింది. రాజకీయ భిన్నాభిప్రాయాలు ఎలా ఉన్నా, దేశంలో ప్రతి ఒక్కరూ ఈ ఉద్యమాలను అభినందిస్తున్నారు'

'ఈ దేశంలో నిజమైన దేశభక్తి, నీతి, ప్రజాస్వామ్యం, జాతీయత కోసం మా పార్టీ పోరాడుతోంది. కార్మికులు, రైతులు ఆధారంగా ఒక కొత్త సంస్కృతిని అభివృద్ధి చేయాలనే సంకల్పం మా పార్టీకి ఉంది.'

'మా మేధావి మిత్రులు దేశంలో అత్యంత కఠిన పరిస్థితుల్లో కూడా పార్టీకి తగిన సహకారం అందించిన విషయం మాకు తెలుసు.'

'దేశంలోని అన్ని పార్టీలు ఏకతాటిపైకి వచ్చినప్పుడే సామ్రాజ్యవాద కోటను కూల్చ గలం. అప్పుడు మాత్రమే మన ప్రియమైన భారత్ స్వాతంత్ర్యం సాధించగలదు. అప్పుడు మాత్రమే మన సంస్కృతి పుష్పించి, పూర్తి వికాసాన్ని పొందగలదు' 'పార్టీకి మద్దతు ఇవ్వాలని, సాధ్యమైన అన్ని రకాలుగా సహకరించాలని మేధావి మిత్రులకు హృదయ పూర్వకంగా విజ్ఞప్తి చేస్తున్నా' అని ఆయన వివిధ సందర్భాల్లో చెప్పారు.

**ఇప్టా సినిమాలు**

ఇప్టా కొన్ని ఫీచర్ సినిమాలను కూడా నిర్మించింది. వాటిలో 'ధర్తీ కే లాల్' అనే చిత్రం భారతీయ చలనచిత్ర చరిత్రలో అతి ప్రాశస్త్య మైన చిత్రాలలో ఒకటిగా నిలిచింది. ముల్క్ రాజ్ ఆనంద్ మాటల్లో చెప్పాలంటే 'ధర్తీ కే లాల్'కి ఉన్న మహాకావ్య గుణాలు, అమెరికన్ సినిమాలు అయిన 'గ్రేప్స్ ఆఫ్ రాథ్', 'ద గుడ్ ఎర్త్' చిత్రాలతో పోల్చదగ్గవి. ఈ చిత్రం బెంగాల్‌లోని తీవ్ర క్షామ పరిస్థితుల్లో ఒక చిన్న గ్రామంలోని కొన్ని కుటుంబాల కథను ఆధారంగా తీసుకుంది. ఈ చిత్రానికి పండిట్ రవిశంకర్ సంగీతాన్ని అందించారు. ఈ తరహాలో మరికొన్ని సినిమాలను కూడా ఇప్టా నిర్మించింది.

అభ్యుదయ రచయితల సంఘం, ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ కలిసి తదుపరి కాలంలో పలు ముఖ్యమైన సమావేశాలు, సాంస్కృతిక రాజకీయ కార్య క్రమాలను నిర్వహించాయి. పి.సి. జోషి ప్రేరణతో పాటు, ఆయనే ప్రత్యక్షంగా దిశానిర్దేశనం చేసిన సందర్భాలు వీటిలో అనేకం ఉన్నాయి. ఇవి భారతదేశ చరిత్ర, సాంస్కృతి, కళ, సాహిత్య రంగాలపై చిరస్థా యిలో ముద్ర వేసిన ఘట్టాలు. వీటితో ఆ రంగాల కొత్త పునర్జీవనం ప్రారంభమైంది. ఈ కొత్త వికాసానికి కర్త పిసి జోషినే!

భారతీయ కళా- సాంస్కృతిక రంగాలకు అభ్యుదయ రచయితల సంఘాన్ని, ఇప్టాను కేంద్రంగా మార్చిన ఘనత పి.సి. జోషికే దక్కు తుంది. ఈ పునర్జీవనానికి కమ్యూనిస్టులను ప్రేరణ శక్తిగా తీర్చిదిద్దిన ఘనత కూడా ఆయనదే. కానీ, తరువాత కాలంలో ఈ పునర్జీ వన ఉత్సాహం వైభవాన్ని, శక్తిని కోల్పోయింది. జోషి సృష్టించిన గొప్ప సాంస్కృతిక వారసత్వా న్ని తిరిగి నిలబెట్ట డం. ముందుకు నడిపించ డం కోసం చాలా చేయాల్సిఉంది. దీనికోసం పిసి జోషి వేసిన బాటలో మరింత ఉత్సాహం తో, నమ్మకంతో నడవాల్సిఉంది.

(అనువాదం: పొగడపు దొరువు)


## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి ,**

**పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 9490098977**

రాజకీయ పరిణామాలు

# వ్యవసాయ రంగాన్ని దివాళా తీయించే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు



రచయిత మార్క్సిస్టు ఎడిటోరియల్ బాధ్యులు

ఎ.కోటిరెడ్డి

"రానురాను రాజు గుర్రం గాడిద అవుతుంది" అన్నచందంగా "పోను పోను సామ్రాజ్యవాదులు, కార్పొరేట్ల కోసమే మోడి పాలన" అన్న విధంగా ప్రభుత్వ విధానాలు మారుతున్నాయి. మోడి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు కొనసాగింపుగా అమెరికాతో చర్చలు జరుపుతున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం నిలుస్తుంది. ఈ ఒప్పందం మన వ్యవసాయరంగాన్ని నాశనం చేస్తుంది. వ్యవసాయంపైనా, పాడిపైనా ఆధారపడిన రైతులను దరిద్రులుగా మారుస్తుంది. పారిశ్రామిక రంగానికి తీవ్ర నష్టం కలిగిస్తుంది. మోడి ప్రభుత్వం గొప్పగా ప్రచారం చేసుకున్న "మేకిన్ ఇండియా" పథకం ద్వారా ఇప్పటికి సాధించిన వేమైనా ఉంటే అవి కూడా నీరుగారిపోతాయి.

మోడి ప్రభుత్వ విధానాల వలన మొత్తంగా దేశ ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాలు సామ్రాజ్యవాదుల ఆధిపత్యంలోకి పోతాయి. వలస కాలం నాటి పరిస్థితులు తిరిగి చోటు చేసుకుంటాయి. ప్రపంచంలో అభివృద్ధి చెందుతున్న దేశాల నుండి భారతదేశం మరింతగా వేరుపడటంతో పాటు వాటి ప్రయోజనాలకు విఘాతం కలిగించేదిగా మారుతుంది. గాజాలో ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణకాండను ఖండించటానికి కూడా ప్రభుత్వం సిద్ధం కాకపోవటంతో నరహంతక ఇజ్రాయిల్ ప్రభుత్వానికి మోడి ప్రభుత్వం ఎంత గట్టి మద్దతుదారన్నది ప్రపంచానికి స్పష్టమైంది. ఇప్పటికే అమెరికన్ బడా పెట్టుబడిదారుడు ఎలాన్ మస్క్ స్టార్‌లింక్‌కు దేశంలోకి ప్రవేశం కల్పించారు. దాని ప్రవేశంతో దేశంలోని సంస్థలు నష్టపోవటంతో పాటు మన జాతీయ భద్రత కూడా ప్రమాదంలో పడుతుందని హెచ్చరిస్తున్నప్పటికీ మోడి ప్రభుత్వం లెక్క చేయటం లేదు.

భారతదేశం అమెరికాతో చేసుకోబోతున్న విధంగా ఇప్పటికే బ్రిటన్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై సంతకాలు చేసింది. ఈ ఒప్పందం కార్లు, లిక్కర్ పరిశ్రమలపై తీవ్రమైన ప్రభావం చూపుతుందని దేశంలోని ఉత్పత్తిదారులు గగ్గోలు పెడుతున్నారు.

అమెరికాతో చేసుకోనున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కోసం ఉభయ దేశాల అధికారులు ఇప్పటికి ఐదు దఫాలుగా చర్చలు జరిపారు. తదుపరి దఫా చర్చల కోసం ఆగస్టు రెండవ పక్షంలో అమెరికా అధికారులు ఢిల్లీ వస్తారని, తర్వాత సెప్టెంబరు, లేదా అక్టోబరులో ఒప్పందం ఖరారు కావచ్చునని అధికారులు చెబుతున్నారు. జులై నెలాఖరు లోపు తాత్కాలిక ఒప్పందం కుదుర్చుకోవటం ద్వారా ఆగస్టు 1వ తేది నుండి ట్రంప్ విధిస్తానని చెబుతున్న 16 శాతం అదనపు సుంకాలను తప్పించుకోవచ్చునని ప్రభుత్వం పెట్టుకున్న ఆశలు వమ్మయ్యాయి. భారతదేశం 25 శాతం సుంకాలు అదనంగా చెల్లించాల్సిందేనని జులై 30వ తేదీన ట్రంప్ ప్రకటించాడు.

మన దేశం నుండి తమదేశంలోకి దిగుమతి అవుతున్న సరుకులపై సుంకాలు పెంచటం ద్వారా మన దేశంలో తయారైన సరుకులకు అమెరికాలో మార్కెట్‌ను కుదించటం, తమదేశం నుండి మన దేశంలోకి దిగుమతి అవుతున్న వ్యవసాయ, పాడి ఉత్పత్తులపై సుంకాలను రద్దు చేయించటం, ఆ ఉత్పత్తులను మనదేశంలో కుమ్మరించటం లక్ష్యాలుగా అమెరికా వ్యవహరిస్తున్నది. వీటితో పాటు మనదేశం నుండి దిగుమతి చేసుకుంటున్న ఉక్కు, అల్యూమినియంపై విధిస్తున్న సుంకాలను జూన్ 4వ తేదీ నుండి 25 నుండి 50 శాతానికి పెంచింది. దేశీయ మార్కెట్‌ను రక్షించుకోవటం పేరుతో ఆటో మొబైల్స్, కొన్ని రకాలైన విడిభాగాలపై కూడా 25 శాతం సుంకాలను విధించింది. ఈ సుంకాల నుండి ఊరట కావాలని మనదేశం కోరుతుండగా, ఎట్టి పరిస్థితులలోనూ వీటిని చెల్లించాల్సిందేనని అమెరికా మొండిపట్టు పడుతున్నది.

అమెరికా–భారత్ మధ్య జరుగుతున్న ఎగుమతి–దిగుమతులను పరిశీలిద్దాం. 2023–24లో మనదేశం నుండి 4,876 కోట్ల డాలర్ల అంటే 4,19,336 కోట్ల రూపాయలు వ్యవసాయోత్పత్తులు అమెరికాకు ఎగుమతి అయ్యాయి. మనదేశం నుండి అమెరికాకు ఎగుమతి అవుతున్న వాటిలో బియ్యం, బాస్మతి రకం బియ్యం, సుగంధ ద్రవ్యాలు, వివిధ రకాలైన పండ్లు, కూరగాయలు, సముద్ర ఉత్పత్తులు ఎక్కువగా ఉన్నాయి. దేశం నుండి జరుగుతున్న మొత్తం ఎగుమతులు 43,707 కోట్ల డాలర్లలో వ్యవసాయోత్పత్తుల వాటా 11.16 శాతంగా ఉన్నది. మన దేశ ఎగుమతులకు అమెరికా ప్రధాన భాగస్వామిగా ఉన్నది. మనదేశం నుండి జరుగుతున్న మొత్తం ఎగుమతులలో 17.90 శాతం సరుకులు అమెరికాకు వెళుతున్నాయి.

2024లో అమెరికా, భారతదేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 13,184 కోట్ల డాలర్లు అంటే11,13,184 లక్షల కోట్ల రూపాయలుగా ఉన్నది. అమెరికా నుండి భారత్‌కు 4,533 కోట్ల డాలర్లు, భారత్ నుండి అమెరికాకు 8,651 కోట్ల డాలర్ల ఎగుమతులు జరిగాయి. భారతదేశానికి 4,118 కోట్ల డాలర్ల వాణిజ్య మిగులు ఉన్నది. మనం విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన యంత్రాలు, అణు రియాక్టర్లు, పారిశ్రామిక ఉత్పత్తులు, ఆయిల్స్, రత్నాలు, విలువైన రాళ్ళు, వివిధ రకాలైన యంత్రాలను అమెరికా నుండి దిగుమతి చేసుకుంటున్నాం.

అమెరికా డిమాండ్లను అంగీకరించి, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం చేసుకుంటే మన ఆర్థికవ్యవస్థ కోలుకోలేని విధంగా దెబ్బతింటుంది. అమెరికా జిడిపి 30.5 లక్షల

**"కమతాలు చిన్నగా ఉండటం, దిగుబడులు తక్కువగా ఉండటం, వ్యవసాయానికి ప్రభుత్వ మద్దతు తక్కువగా ఉండటం, మార్కెట్ దోపిడి తదితరాలతో వ్యవసాయం గిట్టుబాటు కాక రైతులు అప్పుల పాలవుతున్నారు. అప్పులు తీర్చే దారిలేకపోవటంతో అనేకమంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. కౌలు రైతుల పరిస్థితి మరీ దయనీయంగా ఉంటున్నది. ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతులలో ఎక్కువ మంది కౌలురైతులే."**

కోట్ల డాలర్లు కాగా, అక్కడ ఉత్పత్తి అవుతున్న వ్యవసాయోత్పత్తుల మొత్తం విలువ 53,490 కోట్ల డాలర్లు అంటే 46,00,140 కోట్ల రూపాయలుగా ఉన్నది. అంటే జిడిపిలో వ్యవసాయరంగ వాటా 0.9 శాతం మాత్రమే. వ్యవసాయరంగంపై ప్రత్యక్షంగా 1.2 శాతం ఆధారపడి ఉన్నారు. వ్యవసాయ సంబంధిత పరిశ్రమలతో కలుపుకున్నా మొత్తం ప్రజలలో 5.5 శాతం మాత్రమే ఈ రంగంపై ఆధారపడి ఉన్నారు.

భారతదేశ జిడిపి 2024లో 3.91 లక్షల కోట్ల డాలర్లు అంటే 336.26 లక్షల కోట్ల రూపాయలు. జిడిపిలో వ్యవసాయం, అనుబంధ రంగాల వాటా 16 శాతంగా ఉన్నది. మన వ్యవసాయోత్పత్తుల విలువ 45,726 కోట్ల డాలర్లు అంటే 39,32,436 కోట్ల రూపాయలుగా ఉన్నది.

వ్యవసాయరంగంలో అమెరికాకు, మనకు ఉన్న వ్యత్యాసాన్ని, ఉపాధి కల్పనలో వ్యవసాయం మనకెంత ప్రధానమైనదన్న అంశాన్ని ప్రభుత్వం అర్థం చేసుకొని, దేశీయ ఉపాధిని కాపాడే విధంగా వ్యవహరించాలి. అమెరికాలో 20 లక్షల వ్యవసాయ కమతాలు ఉన్నాయి. 40 కోట్ల ఎకరాల భూమిని సాగు చేస్తున్నారు. ఇందులోనే తాత్కాలిక గడ్డి భూములు, తాత్కాలికంగా పంటలు వేసే భూమి, కిచెన్ గార్డెన్‌లు, పడావు పెట్టే భూములు ఉన్నాయి. సగటు కమతం విస్తీర్ణం 441 ఎకరాలు. మనదేశంలో మొత్తం వ్యవసాయ కమతాలు 10 కోట్లకు పైగా ఉన్నాయి. వ్యవసాయ కార్మికుల సంఖ్య మరో 10 కోట్లకు మించి ఉంటుంది. రైతులు, వ్యవసాయ కార్మికులు కలిపి 20 కోట్లకు పైగా కుటుంబాలు, సుమారు 50 శాతం ప్రజలు తమ జీవనోపాధి కోసం వ్యవసాయం, అనుబంధ రంగాలపై ఆధారపడి ఉన్నారు. అమెరికాలో సుమారు కోటిమంది మాత్రమే వ్యవసాయం, అనుబంధ రంగాలపై ఆధారపడి జీవిస్తున్నారు. అమెరికాలో కన్నా 50 రెట్లు ఎక్కువ ప్రజానీకం మనదేశంలో వ్యవసాయరంగంపై ఆధారపడి జీవిస్తున్నారు. దేశంలో వ్యవసాయ భూమి 21.91 కోట్ల ఎకరాలు ఉండగా, 14.11 కోట్ల ఎకరాలలో పంటలు పండిస్తున్నాం.

కమతాలు చిన్నగా ఉండటం, దిగుబడులు తక్కువగా ఉండటం, వ్యవసాయానికి ప్రభుత్వ మద్దతు తక్కువగా ఉండటం, మార్కెట్ దోపిడి తదితరాలతో వ్యవసాయం గిట్టుబాటు కాక రైతులు అప్పుల పాలవుతున్నారు. అప్పులు తీర్చే దారిలేకపోవటంతో అనేకమంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. కౌలు రైతుల పరిస్థితి మరీ దయనీయంగా ఉంటున్నది. ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతులలో ఎక్కువ మంది కౌలురైతులే. గ్రామీణ ప్రాంతంలోని ప్రజానీకంలో సగం మందికి పైగా ఉన్న వ్యవసాయ కార్మికులు పనులు దొరకక వలసలు పోతున్నారు. వ్యవసాయోత్పత్తులకు సంబంధించి స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు చేసుకొనే సమయంలో ప్రభుత్వం ఈ వాస్తవాలను గమనంలో ఉంచుకోవాలి.

అమెరికా ప్రభుత్వం వ్యవసాయరంగానికి 2,500 కోట్ల డాలర్లు అంటే 2,15,000 కోట్ల రూపాయలు ప్రత్యక్షంగా నగదు బదిలీ చేస్తున్నది. 20 లక్షల మంది రైతులకు 2,500 కోట్ల డాలర్లు అంటే అమెరికా ప్రభుత్వం ప్రతి సంవత్సరం, ప్రతి రైతుకు 10,75,000 రూపాయలు ప్రత్యక్షంగా నగదు బదిలీ చేస్తున్నది. మనదేశంలోని మోడి ప్రభుత్వం ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పేరుతో ఒక్కో రైతుకు సంవత్సరానికి 6,000 రూపాయలు మాత్రమే నగదు బదిలీ చేస్తున్నది. ఈ మొత్తం కూడా సగం మందికి పైగా రైతులకు అందటం లేదు. అమెరికాలో రైతులకు చేస్తున్న నగదు బదిలీతో పోల్చుకుంటే మన ప్రభుత్వం ఇస్తున్నది సముద్రంలో కాకిరెట్టలా ఉన్నది. అమెరికా వ్యవసాయోత్పత్తులు స్వేచ్ఛగా మనదేశంలోకి దిగుమతి అయితే అక్కడి రైతులు చేసే ఉత్పత్తులతో కాకుండా, అక్కడి ప్రభుత్వం తమ రైతులకు ఇచ్చే నగదు బదిలీతో మనదేశంలోనే మన రైతులు పోటీని ఎదుర్కోవాల్సి వస్తుంది.

**నయా ఉదారవాద ఎజెండాతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు**

ఈ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలలో నయా-ఉదారవాద ఎజెండా దాగి ఉన్నది. రైతులను దివాళా తీయించి, వ్యవసాయం అంటే పారిపోయేలా చేసి, కార్పొరేట్, బహుళజాతి సంస్థలకు భూములను అప్పగించటాన్ని సులభం చేయటానికి ఈ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు దోహదం చేస్తాయి. అమెరికాతో చేసుకుంటున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం వలన అమెరికా నుండి మన దేశంలోకి వ్యవసాయ ఉత్పత్తులు-ఉత్పత్తి విలువలో 40 శాతం వరకు అక్కడి ప్రభుత్వం నుండి సబ్సిడీలు పొందుతున్నవి- వరదలా వస్తాయి. వాటితో పోటి పడలేక మన వ్యవసాయ ఉత్పత్తులు గుట్టలు పడతాయి. రైతులు దివాళా తీస్తారు. అప్పుల పాలవటం, ఆత్మహత్యలు చేసుకోవటం పెరుగుతుంది. ఈ విధంగా వ్యవసాయ సంక్షోభం తీవ్రం కావటంతో రైతులకు గత్యంతరం లేని పరిస్థితులు ఏర్పడతాయి. అపుడు వ్యవసాయాన్ని కార్పొరేట్లకు అప్పగించటం, రైతులకు పరిహారం ఇచ్చినట్లు నటించి, వారిని భూముల నుండి తొలగించటం ప్రభుత్వాలకు సులభమౌతుంది. భూములు, వ్యవసాయం కార్పొరేట్ల ఆధిపత్యంలోకి పోతాయి.

**కోట్లమంది రైతులు, వ్యవసాయ కార్మికులు ఉపాధి కోల్పోతారు**

భూములు రైతుల చేతులలో నుండి పోయిన తర్వాత కోట్లాది మంది రైతులు, కూలీలు ఉపాధికి ఉన్న మార్గాలేమిటి? వ్యవసాయరంగంలో ఉపాధి కోల్పోయే ఈ కోట్లాది మందిని ఇముడ్చుకోగల పరిస్థితి దేశంలోని ఏ రంగానికీ లేదు. దేశంలోని నిరుద్యోగులందరికీ ఉపాధి కల్పించటంలో వ్యవసాయరంగమే పుష్పక విమానంలా ఉన్నది. దేశంలో శతాబ్దాల తరబడి వివిధ రంగాలు సంక్షోభాన్ని ఎదుర్కొన్నపుడు,

మొత్తం ఆర్థికవ్యవస్థ తీవ్ర కల్లోలాన్ని ఎదుర్కొన్న సందర్భాలలో, ఆయా రంగాలలో ఉపాధి కోల్పోయిన వారిని అక్కున చేర్చుకొని, వారందరికీ వ్యవసాయ రంగమే ఉపాధి కల్పించింది. పెట్టుబడిదారి అభివృద్ధి క్రమం, నయా-సరళీకరణ విధానాలు ప్రారంభమైన

(మిగతా 32వ పేజీలో)

# హిందూత్వ వాదం-సైన్సుకు ప్రమాదం



రచయిత మార్క్సిస్టు పత్రిక ఎడిటర్

ఎస్ వెంకట్రావు

**2015, అక్టోబర్.....** నరేంద్ర మోడీ నాయకత్వంలో కొత్తగా ఎన్నికైన బిజెపి ప్రభుత్వం నుండి సైన్సుకు ఎదురవుతున్న దాడిపై భారత దేశానికి చెందిన 100 మంది ప్రముఖ శాస్త్రవేత్తలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. బిజెపి ప్రభుత్వ విధానాలు దేశంలో హేతువు (రీజన్), సైన్సును నాశనం చేస్తున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. "... ప్రభుత్వంలోని ముఖ్య నేతలే అహేతుక, ఛాందసవాద భావజాలాన్ని ప్రోత్సహిస్తున్న వైనాన్ని ఈరోజు మనం చూస్తున్నాం" అని వారు పేర్కొంటూ ఈ వైఖరి దేశ భవిష్యత్తుకు ప్రమాదరకమని హెచ్చిరించారు. ఈ ప్రకటనపై సంతకాలు చేసిన వారిలో అనేక మంది పద్మ అవార్డు గ్రహీతలు, ఇతర అవార్డులు పొందిన వారు, అనేక ఉన్నత శాస్త్ర-సాంకేతిక సంస్థల అధిపతులు ఉన్నారు.

**2018, ఏప్రిల్ 14.....** బిజెపి ప్రభుత్వ సైన్సు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఢిల్లీతో సహా దేశంలోని అనేక నగరాలు, పట్టణాల్లో వేలాది మంది సైంటిస్టులు, మేధావులు, విద్యార్థులు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. అఖిలభారత పీపుల్స్ సైన్సు నెట్‌వర్క్, బ్రేక్‌త్రూ సైన్స్ సొసైటీ యితర సంస్థల ఆధ్వర్యంలో జరిగిన నిరసన ప్రదర్శనల్లో "శాస్త్రీయ ఆధారాలు లేకుండా, శాస్త్రవేత్తలతో సంప్రదించకుండా నరేంద్ర మోడీ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు, అనుసరిస్తున్న విధానాల"ను తూర్పార బట్టారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత మొట్టమొదటి సారిగా ప్రభుత్వం శాస్త్రవేత్తలతో సంప్రదించకుండా నిర్ణయాలు తీసుకోవడం, సైన్సు-టెక్నాలజీకి నిధులు తగ్గించేయడమే కాకుండా "ప్రభుత్వంలోని ముఖ్య నేతలే పరిణామ వాదాన్ని ఖండించడం, బోగస్ సిద్ధాంతాలనూ, బోగస్ చరిత్రనూ ప్రవేశపెట్టడం, ప్రాచీన భారత దేశంలోనే సైన్సు అంతా దాగి ఉందనే అశాస్త్రీయ ప్రకటనలు చేయడం, పురాణాలను చారిత్రక వాస్తవాలుగా ప్రచారం చేయడం మొదలైన వాటి ద్వారా సైన్సు, శాస్త్రీయ దృక్పథాల మీద ఒక పద్ధతి ప్రకారం దాడి చేస్తున్నారు" అని శాస్త్రవేత్తలు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

**2021 మే...** మణిపూర్‌లోని బిజెపి ప్రభుత్వం ఇద్దరు వ్యక్తులను జాతీయ భద్రతా చట్టం కింద అరెస్టు చేసింది. వారిలో ఒకరు పాత్రికేయుడు కిషోర్ చంద్ర వాంగ్ ఖెమ్, రెండో వ్యక్తి సైన్సు ప్రచారకుడు ఎరెండ్రో లీచోంచామ్. వారు జాతీయ భద్రతకు చేసిన హాని ఏమంటే కోవిడ్-19 తగ్గడానికి ఆవు పేడ, ఆవు మూత్రం గొప్ప ఔషధంగా పనిచేస్తాయి అని జరుగుతున్న ప్రచారానికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టు పెట్టడమే. ఎంత విచిత్రం! శాస్త్రీయ భావాలు అలవరచు కోవడం ప్రజల ప్రాథమిక విధి అని మన రాజ్యాంగం చెబుతుండగా ఆ విధిని నిర్వహించే పాత్రికేయులను ప్రభుత్వమే అరెస్టు చేస్తోంది.

శాస్త్రీయ ఆలోచనలు, హేతువాద దృక్పథాలను ప్రచారం చేయడమే జీవిత ధ్యేయంగా ఎంచుకున్న నరేంద్ర దబోల్కర్, గోవింద పన్సారే, ఎంఎం కుల్బుర్గి, గౌరీ లంకేశ్‌లను మూఢ శక్తులు ఏకంగా హత్య గావించిన సంగతి మనకు తెలుసు.

భారత దేశంలో సైన్సుకూ, సైన్సు అనుసరించే హేతుబద్ధ ఆలోచనా విధానానికి ఎంతటి ప్రమాదం ఏర్పడిందో తెలుసుకోడానికి పైన చెప్పిన ఉదాహరణలు కొన్ని మచ్చుతునకలు మాత్రమే.

సైన్సుపై దాడి చేయడమంటే భారత రాజ్యాంగంపై దాడి చేయడమే. భారత రాజ్యాంగంలోని 51 ఎ (హెచ్) అధికరణం "శాస్త్రీయ దృక్పథాన్ని, మానవత్వాన్ని, పరిశీలనా దృష్టి, సంస్కరణలను పెంపొందించడం" ప్రతి పౌరుని ప్రాథమిక విధి అని చెబుతోంది. బిజెపి ప్రభుత్వం సైన్సుమీదనే కాదు శాస్త్రీయ పరిశోధనల ఆధారంగా రాయబడిన భారత దేశ చరిత్ర మీద కూడా దాడి చేస్తోంది. దీని గురించి ప్రఖ్యాత సైన్సు కార్యకర్త ప్రబీర్ పుర్కాయస్థ 'విజ్ఞానం ఉమ్మడి సంపద' అనే పుస్తకంలో యిలా పేర్కొన్నారు: "సైన్సు మీద జరుగుతున్న ఈ దాడి చరిత్ర మీద కూడా దాడే. ప్రాచీన భారత దేశంలో గణితం, ఖగోళ శాస్త్రం, వైద్య శాస్త్రాల్లో జరిగిన వాస్తవ విజయాల స్థానంలో పుక్కిటి పురాణాలు ప్రచారం చేస్తున్నారు. పురాణాలను చరిత్రగా చూపించడం ద్వారా వాళ్లు హేతువు, విజ్ఞాన శాస్త్ర పరికరాలతో చరిత్రను అధ్యయనం చేయడానికి ఉన్న ప్రాతిపదికను నాశనం చేస్తున్నారు. వారి వికృతమైన జాతీయవాదానికి సైన్సు, చరిత్ర ఆట స్థలాలుగా మారిపోయాయి. భారత దేశం వాస్తవంగా సాధించిన విజయాలను వమ్ముచేసి, వాటి స్థానంలో పురాణగాథలను ప్రవేశపెట్టిడం ద్వారా వాళ్లు భవిష్యత్తులో హేతుబద్ధ తర్కం, శాస్త్రీయ దృక్పథంతో పురోగమించడానికి కావలసిన ప్రాతిపదికను కూడా నాశనం చేస్తున్నారు."

సైన్సు, హేతు దృక్పథంపై ఆర్ఎస్ఎస్-బిజెపి ప్రధానంగా ఏ మార్గాల్లో దాడి చేస్తున్నదో పరిశీలిద్దాం.

1. హేతువుకు, శాస్త్రీయ దృక్పథానికి విరుద్ధమైన వాదనలు
2. ఆధునిక విజ్ఞాన శాస్త్రమంతా ప్రాచీన భారత గ్రంథాల్లో ఉన్నాయని వాదించడం
3. తమ వాదనలకు అడ్డువచ్చే ఆధునిక విజ్ఞాన

> **“ బిజెపి ప్రభుత్వం విద్యా సంస్థల్లోనూ, శాస్త్ర సంస్థల్లోనూ కీలక స్థానాల్లో కాషాయీకరణ చెందిన వ్యక్తులను నియమించడం ద్వారా విద్యారంగాన్ని, పరిశోధనలను అహేతుక పంథాలో నడిపేందుకు ప్రయత్నిస్తున్నది. నూతన తరాల పిల్లల మనసుల్లో అశాస్త్రీయమైన, అహేతుకమైన, చారిత్రకంగా తప్పుడు విజ్ఞానాన్ని నింపేందుకు పాఠ్య పుస్తకాలను తిరగరాస్తున్నది. విశ్వ విద్యాలయాల్లో జ్యోతిష్యం, పౌరోహిత్యం, లాంటి అశాస్త్రీయమైన కోర్సులను ప్రవేశపెడుతున్నది. ”**

శాస్త్రాన్ని తిరస్కరించడం

4. లౌకిక తత్వాన్ని వ్యతిరేకించడం వీటిని ఒక్కొక్కటిగా పరిశీలిద్దాం.

### హేతువుకు, శాస్త్రీయ దృక్పథానికి విరుద్ధ వాదనలు

మానవజాతి చరిత్ర మొత్తంలోనూ మత ఛాందసత్వాన్ని, పిడివాదాన్ని ప్రశ్నించడం ద్వారానే సైన్సు అభివృద్ధి చెందింది. కానీ ఆర్ఎస్ఎస్ సైన్సు కన్నా మతం అధికమైనదని ప్రకటిస్తుంది. 2017 ఫిబ్రవరిలో ఏర్పాటు చేయబడిన జాతీయ గో కమిషన్ (రాష్ట్రీయ కామధేను ఆయోగ్) చైర్మన్ డాక్టర్ వల్లభ్ భాయ్ కథిరియా సైన్సునూ, ఆధ్యాత్మికతనూ కలగలిపితే “సామాజిక పరివర్తనకు, దారిద్ర్య నిర్మూలనకు, పర్యావరణ పరిరక్షణకు” ఆవు ఒక అవసరమైన సాధనమవుతుందని సెలవిచ్చారు. ప్రతి యూనివర్సిటీలోనూ కళాశాలలోనూ ‘కామధేను చైర్’ ప్రారంభించాలని ఆయన సూచించారు. ఆవు పేడతో తయారు చేసే చిప్స్ మొబైల్ ఫోన్లలో రేడియేషన్ తగ్గిస్తాయని చెప్పారు. ఆవు మూత్రం, కండెన్స్‌డ్ ఆవు మూత్రం తీసుకుంటే సర్వ రోగ నివారణ జరుగుతుందని చెప్పారు.

ఆవు మూత్రం ఆరోగ్యానికి మంచిదనీ, అది సర్వరోగ నివారిణి అనీ బిజెపి-ఆర్ఎస్ఎస్ ఒకటే ఊదరగొడుతుంది. ఆవు మూత్రంతో కరోనాను నయం చేయవచ్చునని మహమ్మారి కాలంలో టివీల్లోనూ, వాట్సాప్ గ్రూపుల్లోనూ వీళ్లు విపరీతంగా ప్రచారం చేశారు. కరోనాను నయం చేయడానికి వాళ్లు ఆవు మూత్రం తాగే కార్యక్రమాలు నిర్వహించారు. కానీ ఎక్కడా ఆవు మూత్రం తాగిన వారికి కరోనా తగ్గినట్లు దాఖలా లేదు.

2021లో కామధేను గో విజ్ఞాన ప్రచార పరిషత్ వాళ్లు జాతీయ గో విజ్ఞానశాస్త్రంపై ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించారు. దేశంలోని అన్ని విశ్వవిద్యాలయాల విద్యార్థులు ఈ పరీక్షలో పాల్గొనాలని భారత ప్రభుత్వ నిధులతో నడిచే యూనియన్ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) దేశంలోని 900 విశ్వవిద్యాలయాలకు ఉత్తరాలు రాసింది. రాష్ట్రీయ కామధేను ఆయోగ్ రూపొందించిన సిలబస్ ప్రకారం 5 లక్షల మందికి పైగా విద్యార్థులు ఈ పరీక్ష రాయడానికి రిజిస్టర్ చేయించుకున్నారు. పరీక్ష కోసం ఈ సంస్థ రూపొందించిన స్టడీ మెటీరియల్ చదివితే సైన్సును కాషాయ మూకలు ఎంతటి దుర్గతిలోకి తీసుకుపోయారో అర్థమవుతుంది. అణు ధార్మికత (న్యూక్లియార్ రేడియేషన్) నుండి కాపాడుకోడానికి ఆవు పేడ ఉపయోగపడుతుందనీ, రష్యాలోనూ, భారత్‌లోనూ దీన్ని ఉపయోగించారనీ రాశారు. ఆవు మూపురంలో సౌర ఫలకాలు ఉంటాయనీ, ఇవి సూర్య కిరణాలను బంగారంగా మారుస్తాయనీ, అది ఆవు పాలల్లోకి చేరుతుందనీ, అందువల్లనే ఆవు పాలు పసుపు రంగులో ఉంటాయని ఇందులో రాశారు. అయితే స్టడీ మెటీరియల్‌లోని ఈ అశాస్త్రీయ వాదనలపై తీవ్రమైన విమర్శలు రావడంతో పరీక్షలు వాయిదా వేశారు.

– జంతువులన్నీ ఆక్సిజన్ పీల్చుకుని, కార్బన్ డై-ఆక్సైడ్ విడుదల చేస్తాయన్న విషయం మనకు తెలుసు. కానీ, రాజస్థాన్ బిజెపి విద్యా మంత్రి వాసుదేవ్ దేవ్నాని “ఆవు మాత్రమే ఆక్సిజన్ పీల్చుకుని మళ్లీ ఆక్సిజన్ విడుదల చేస్తుంది” అని ప్రకటించారు. గోవు గురించి ఆర్ఎస్ఎస్ చేసే ఈ అశాస్త్రీయ ప్రచారం వెనుక మతతత్వ ఎజెండా ఉంది.

గో మూత్రం గురించి ఆర్ఎస్ఎస్ పరివారం చేస్తున్న ప్రచారాన్ని నమ్మి దేశంలోని అనేక మంది దాన్ని తాగి అనారోగ్యాన్ని కొని తెచ్చుకుంటున్నారు. గో మూత్రంలో 14 రకాల ప్రమాదకర బాక్టీరియాలుంటాయని భారత పశు పరిశోధనా సంస్థ ఇటీవల వెల్లడించింది. గో మూత్రాన్ని నేరుగా తాగితే కడుపులో అనేక రకాల సమస్యలు తలెత్తుతాయని నివేదిక వెల్లడించింది.

ఆర్ఎస్ఎస్ సిద్ధాంత కర్తల్లో ఒకరూ, ఆ సంస్థ రెండవ సర్ సంఘ్ చాలక్ అయిన ఎంఎస్ గోల్వాల్కర్ 1966లో ఇలా చెప్పారు: “నేటి యుగం సైన్సు యుగం అని ప్రజలు పదేపదే చెబుతుంటారు. అందువల్ల ఈ సైన్సు యుగానికి అనుగుణంగా మతంలో మార్పులు చేయాలని వారు తరచూ వాదిస్తుంటారు. కాని నేను దానికి కచ్చితంగా విరుద్ధమైన విషయాన్ని చెబుతాను... సైన్సులో వచ్చే ప్రతి పరిశోధనకు అనుగుణంగా మతాన్ని మార్చుకుంటూ పోతే మతమనేదే మిగలదు... అప్పుడు మానవ జాతి అంతా నిస్పృహకు గురవుతుంది. అందువల్ల ప్రతి సైన్సు పరిశోధనకు అనుగుణంగా మతాన్ని మార్పు చేసుకుంటూ పోవడం సరైంది కాదని నా అభిప్రాయం.”

సైన్సును ఇస్లామీకరించాలని ఇస్లాం ఛాందసవాదులు ఎలా చెబుతారో సైన్సును కాషాయీకరించాలని ఆర్ఎస్ఎస్ పరివారం అలానే చెబుతోంది.

– సంతానాభివృద్ధి గురించిన సంఘ్ పరివార్ జాత్యాహంకార విశ్వాసాలను గర్భశాస్త్ర/గృహ శంకర ‘సైన్సు’గా ప్రచారం చేస్తున్నారు. తల్లి గర్భిణిగా ఉన్నప్పుడు హిందూ మత గ్రంథాలను పఠిస్తే, భక్తి గీతాలను ఆలపిస్తే, మాంసాహారం ముట్టకుండా ఉంటే తెల్లటి రంగుతో, తెలివైన పిల్లలు పుడతారని వీరు చెబుతారు. వాస్తవానికి గర్భిణీ స్త్రీలు బలవర్ధకమైన ఆహారాన్ని తీసుకోవాలని, తగినంత వ్యాయామం చేయాలని వైద్య శాస్త్రం చెబుతుంది. బిడ్డ ఎదుగుదలకు తగినన్ని మాంసకృత్తులు కావాలి. అన్ని రకాల పోషకాలు ఉండే సమ్మిళిత ఆహారాన్ని తీసుకోవాలి. కానీ మాంసాహారానికీ తెలుపు వర్ణం, తెలివి తేటలకూ లింకు పెట్టడం వెనుక హిందూత్వ అగ్రవర్ణ అహంకారం దాగి ఉంది.

బిజెపి ప్రభుత్వం విద్యా సంస్థల్లోనూ, శాస్త్ర సంస్థల్లోనూ కీలక స్థానాల్లో కాషాయీకరణ చెందిన వ్యక్తులను నియమించడం ద్వారా విద్యారంగాన్ని, పరిశోధనలను అహేతుక పంథాలో నడిపేందుకు ప్రయత్నిస్తున్నది. నూతన తరాల పిల్లల మనసుల్లో అశాస్త్రీయమైన, అహేతుకమైన, చారిత్రకంగా తప్పుడు విజ్ఞానాన్ని నింపేందుకు పాఠ్య పుస్తకాలను తిరగరాస్తున్నది. విశ్వ విద్యాలయాల్లో జ్యోతిష్యం, పౌరోహిత్యం, లాంటి అశాస్త్రీయమైన కోర్సులను ప్రవేశపెడుతున్నది.

> ❝ రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఢిల్లీలో హిందీ దివస్ సభలో మాట్లాడుతూ క్వాంటమ్ ఫిజిక్స్‌లో వార్నర్ హీసెన్ బర్గ్ రూపొందించిన అస్థిరతా సిద్ధాంతం (థియరీ ఆఫ్ అన్‌సెర్టైనిటీ) వేదాలనుండి తస్కరించిందేనన్నారు. రవీంద్రనాథ్ ఠాగోర్‌తో హీసెన్‌బర్గ్ వేదాల గురించి జరిపిన చర్చల సందర్భంగా ఆయన ఈ సూత్రం పసిగట్టేశాడని మంత్రి 'వెల్లడించారు'. ❞

బిజెపి ప్రభుత్వ హయాంలో శాస్త్ర పరిశోధన, అభివృద్ధి తిరోగామి దిశలోకి మళ్లింది. పూర్తిగా హిందూత్వ వ్యూహాలపై ఆధారపడిన అంశాలపై పరిశోధనలను ప్రోత్సహిస్తున్నది. అలాంటి పరిశోధనలకే అధిక నిధులు సమకూరుస్తున్నది. పాంచజన్య, రామసేతు, రామాయణ మహాభారతాల చారిత్రకతకు సంబంధించిన పరిశోధనల పేరుతో భారీగా నిధులు కేటాయిస్తున్నది. యోగా వ్యవసాయం, గో మూత్ర వ్యవసాయం వంటి అశాస్త్రీయ కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్నది.

సైన్సు హేతువుకు వాహకంగా పనిచేస్తుంది. వివేకాన్ని వ్యక్తీకరిస్తుంది. అలాంటి సైన్సును హిందూత్వ బలంగా వ్యతిరేకిస్తుంది. ఒకవైపు తన పురాణాలకు చట్టబద్ధత కల్పించడం కోసం అది సైన్సు-టెక్నాలజీని ఉపయోగించుకుంటూనే మరోవైపు సైన్సునూ, శాస్త్రీయ దృక్పథాన్నీ వ్యతిరేకిస్తుంది. హేతుబద్ధత, విమర్శనాదృష్టి ఆధునిక ప్రపంచ దృక్పథంలో కీలకాంశాలు. ఈ రెంటినీ ఆర్‌ఎస్‌ఎస్ ప్రవచించే 'హిందూత్వ సిద్ధాంతం' విస్మరిస్తుంది, తిరస్కరిస్తుంది. శాస్త్ర విజ్ఞాన ఫలితాలైన సాంకేతిక ఉత్పత్తులను అంటే టెక్నాలజీని ఆరాధిస్తుంది, సముపార్జించుకోడానికి ఆరాటపడుతుంది, అదే సమయంలో ప్రతి భావాన్నీ, ప్రతి విశ్వాసాన్నీ విమర్శనాయుతంగా ప్రశ్నించే అవకాశాన్ని పూర్తిగా మూసేస్తుంది. ప్రశ్నించేతత్వాన్ని చంపేయడమంటే సైన్సు అభివృద్ధికి దారులు మూసేయడమే.

**ఆధునిక విజ్ఞాన శాస్త్రమంతా ప్రాచీన భారత గ్రంథాల్లో ఉన్నాయని వాదించడం**

2014లో నరేంద్ర మోడీ నాయకత్వంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రధాని మోడీతో సహా ఆ పార్టీకి చెందిన ముఖ్య నాయకులు చేసిన కొన్ని ప్రకటనలు చూద్దాం!

– ప్రధాని 2015లో ముంబయిలో జరిగిన వైద్యనిపుణుల సదస్సులో మాట్లాడుతూ మన దేశంలో ప్రాచీన కాలంలోనే ప్లాస్టిక్ సర్జరీ తెలుసుననీ, వినాయకుడు ప్లాస్టిక్ సర్జరీ చేయడం వల్ల అలా ఏర్పడ్డాడనీ, మహాభారతంలో కర్ణుడు జనిటిక్ ఇంజనీరింగ్ వల్ల పుట్టాడనీ చెప్పారు.

– హర్ద్వార్‌కు చెందిన బిజెపి ఎంపీ లోక్ సభలో మాట్లాడుతూ ''లక్షల సంవత్సరాల క్రితమే రుషి కణాదుడు అణ్వస్త్ర పరీక్ష జరిపాడు'' అని చెప్పుకొచ్చారు.

– కేంద్ర మంత్రి ('ఆయుష్' శాఖ) శ్రీపాద్ నాయక్ 2016లో బెంగళూరులోని స్వామి వివేకానంద యోగా అనుసంధన సంస్థాన్‌లో ఒక రకమైన యోగా చేస్తే క్యాన్సర్ తగ్గిపోతుందని చెబుతూ దాన్ని తాను నిరూపిస్తానన్నారు.

– రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఢిల్లీలో హిందీ దివస్ సభలో మాట్లాడుతూ క్వాంటమ్ ఫిజిక్స్‌లో వార్నర్ హీసెన్ బర్గ్ రూపొందించిన అస్థిరతా సిద్ధాంతం (థియరీ ఆఫ్ అన్‌సెర్టైనిటీ) వేదాలనుండి తస్కరించిందేనన్నారు. రవీంద్రనాథ్ ఠాగోర్‌తో హీసెన్‌బర్గ్ వేదాల గురించి జరిపిన చర్చల సందర్భంగా ఆయన ఈ సూత్రం పసిగట్టేశాడని మంత్రి 'వెల్లడించారు'.

2015 జనవరిలో జరిగిన 102వ భారత సైన్సు కాంగ్రెస్‌లో ఏకంగా 'ప్రాచీన భారత సైన్సు' అనే ఒక ప్రత్యేక సభ ఏర్పాటు చేశారు. వేలాది ఏళ్ల క్రితమే భారత దేశంలో విమానాలు తయారు చేసేవారని బిజెపి నాయకులు ఆ సభలో పేర్కొన్నారు. ఈ విమానాలు ఏ కొలతల్లో ఉండేవో చెబుతూ కాషాయ సిద్ధాంత వేత్తలు పత్రం ప్రవేశపెట్టారు. ఇవి భూమ్మీద ఒక చోటినుండి మరో చోటికి వెళ్లడమే కాదు అంతరిక్షంలో కూడా ఒక గ్రహం నుండి మరో గ్రహానికి విహరించేవని 'వెల్లడించారు'. ఆ విధంగా సైన్సు మహాసభను వాళ్లు ఒక తమాషాగా మార్చేశారు. ఈ సైన్సు కాంగ్రెస్‌లో ఒక వక్త మాట్లాడుతూ రెండు నిమిషాలు శంఖాన్ని పూరిస్తే ఆ శబ్దం అనేక మానవ రుగ్మతలను నయం చేస్తుందని చెప్పాడు. మరో వక్త ''శివుడు ప్రపంచంలోనే అతి గొప్ప పర్యావరణ వాది'' అని చెబితే ఇంకో వక్త అయస్కాంత క్షేత్ర పరిజ్ఞానం న్యూటన్ కన్నా 1500 సంవత్సరాల ముందే మన శాస్త్రాల్లో ఉందని సెలవిచ్చాడు. సైన్సు కాంగ్రెస్‌లో ఇలా జరిగింది కాబట్టే భారత సంతతి అమెరికన్ నోబెల్ బహుమతి గ్రహీత వి. రామకృష్ణన్ ఈ సభను ఒక సర్కస్‌గా వర్ణిస్తూ, తాను భవిష్యత్తులో ఇటువంటి సభలకు రానని చెప్పి అమెరికా వెళ్లిపోయారు.

– గుజరాత్‌లో ఏకంగా పురాణాలనే సైన్సుగా మార్చేసి బోధిస్తున్నారు. భారతీయ సంస్కృతిలోని 'వాస్తవాలు' అనే పేరుతో ప్రతి విద్యార్థి చదవాల్సిన అనుబంధ పాఠ్య పుస్తకాలను అక్కడి ప్రభుత్వం అచ్చొత్తించింది. అందులో చెప్పిన ఒక 'సైన్సు' సంగతి చూడండి!

''స్టెమ్ సెల్ పరిశోధన తామే చేశామని అమెరికా చెప్పుకుంటోంది. కానీ శరీర భాగాలు పునఃసృష్టి చేసే పేటెంట్‌ను డాక్టర్ బాలకృష్ణ గన్‌పత్ మతపుర్కార్ ఇప్పటికే పొంది వున్నారు...నిజానికి ఈ పరిశోధన ఇప్పటిది కాదనీ, దీన్ని మహాభారతం నుండి డాక్టర్ మతపుర్కార్ గ్రహించారనీ వింటే మీరు ఆశ్చర్యపోతారు. కుంతికి సూర్యునిలాంటి వెలుగు నిచ్చే కొడుకుండేవాడు. రెండేళ్ల నుండి గర్భం దాల్చని గాంధారికి ఈ విషయం తెలిసింది. ఆమె గర్భవతి అయింది కానీ అబార్షన్ అయింది. ఆమె కడుపునుండి పెద్ద మాంసపు ముద్ద బయటకొచ్చింది. ఇది తెలిసి మహర్షి ద్వైపాయన సహాయం కోరారు. ఆయన ఈ మాంసానికి కొన్ని ఔషధాలు కలిపి చల్లని కుండలో పెట్టాడు. తరువాత ఆ మాంసం ముద్దను తీసి నూరు భాగాలు చేసి, ఒక్కో భాగాన్ని నేతితో నిండిన ఒక్కో కుండలో పెట్టాడు. రెండేళ్ల తరువాత అందులో నూరుగురు కౌరవులు తయారయ్యారు. ఇది చదివిన తరువాత స్టెమ్‌సెల్స్ తన పరిశోధన కాదనీ మహాభారత సమయంలోనే వున్నదనీ మతపుర్కార్ తెలుసుకున్నాడు''... గుజరాత్‌లోని బడిపిల్లలచేత బలవంతంగా చదివిస్తున్న తేజోమయ భారత్ పుస్తకం 92-93 పేజీల్లో ఈ విషయం రాశారు.

> "వేదాల్లోనే గణితం ఎంతగానో అభివృద్ధి చెందిపోయిందన్న తప్పుడు ప్రచారంతో నేడు "వేద గణిత శాస్త్రాన్ని"విశ్వవిద్యాలయాల్లో కూడా ప్రవేశ పెడుతున్న కాషాయ పరివారం నిజానికి ఆ తరువాతి కాలంలో భారత దేశంలో అభివృద్ధి చెందిన గణిత శాస్త్రాన్ని గురించి గానీ, సైన్సును గురించి గానీ పట్టించుకోవడం లేదు."

ఆర్ఎస్ఎస్ దేశవ్యాపితంగా నడుపుతున్న పాఠశాలల నెట్వర్క్ 'విద్యాభారతి' ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన దీనానాథ్ బత్ర ఈ పుస్తకాన్ని ఇంకా ఇటువంటి అనేక పుస్తకాలను రాశారు. కానీ శరీరభాగాల పేటెంట్ పొందినట్లు ఆయన చెబుతున్న డాక్టర్ గన్పత్ మతపుర్కార్ ఎంతటి శాస్త్రవేత్తో తెలుసుకుందామంటే ఆయన గురించిన సమాచారం ఏదీ ఎక్కడా దొరకడం లేదు.

బత్రా గారు పాఠ్యపుస్తకాల్లో ఆటోమొబైల్ పుట్టుక గురించి మరో పురాణ గాథ కూడా రాశారు. మోటార్ కారు వేదకాలంలోనే ఉందనీ, దాన్ని అనశ్వరథం అని రుగ్వేదంలో పిలిచారనీ రాశారు. "సాధారణంగా రథాన్ని గుర్రాలు లాగుతాయి. కానీ అనశ్వరథం అంటే గుర్రాలు లేకుండా యంత్రంతో నడిచే రథం అన్నమాట. దాన్నే మనం ఈనాడు మోటారు కారు అంటున్నాం.దాన్ని రుగ్వేదం అనాడే పేర్కొంది" అని ఆయన చెప్పారు.

– కేంద్ర వ్యవసాయ శాఖా మంత్రి రాధా మోహన్ సింగ్ 'యోగా వ్యవసాయం' గురించి 'కనిపెట్ట'గా, కాషాయ 'వ్యవసాయ శాస్త్రవేత్త' సుభాష్ పాలేకర్ ఆవు మూత్రంతో వ్యవసాయం 'కనిపెట్టా'రు.

ప్రధాన మంత్రి, మంత్రులతో సహా అధికార పార్టీ నాయకులు, వారి అంతేవాసులు ప్రచారం చేస్తున్న ఈ విషయాలన్నీ పూర్తిగా అశాస్త్రీయమైనవి. ఎందుకంటే అవి శాస్త్రీయ పరిశోధనా పద్ధతికి నిలవవు. వాటిని ఎక్కడా, ఎవరూ పరిశోధిం చలేదు. పేరెన్నికగన్న ఏ శాస్త్ర పరిశోధనా గ్రంథంలోనూ ప్రచురించ బడలేదు, శాస్త్రీయ సమీక్ష (పీర్ రివ్యూ)కు నిలవలేదు. కేవలం మన పురాణాల్లోనూ, ప్రాచీన గ్రంథాల్లోనూ పేర్కొన్న పదాలను తీసుకువచ్చి, వాటి చుట్టూ కథలు అల్లి సైన్సుగా ప్రచారం చేస్తున్నారు. మత చిహ్నాలకు, మత నమ్మకాలకు విలువ కల్పించడం కోసం అశాస్త్రీయమైన వాటికి శాస్త్రీయత ముద్ర వేస్తున్నారు. హిందూ నాగరికత అధిపత్యాన్ని నిరూపించే ఆరాటంలో వారు పురాణాలకూ, శాస్త్ర విజ్ఞానానికీ మధ్య ఉన్న తేడాను చెరిపి వేస్తున్నారు. మనం దేశంలో గతంలో జరిగిన శాస్త్ర పురోగతిని వారు కల్పి తాలు, మూఢాచారాలతో కలగలిపేస్తు న్నారు. ప్రాచీన పౌరాణిక కల్పితాలను, ఆధునిక పరిశో ధనల ద్వారా అభివృద్ధి చెందిన శాస్త్ర విజ్ఞానాన్ని సమా నం చేయడం ద్వారా వారు ప్రజలలో తీవ్రమైన గందరగోళం సృష్టిస్తున్నారు.

వేదాల్లోనే గణితం ఎంతగానో అభివృద్ధి చెందిపోయిందన్న తప్పుడు ప్రచారంతో నేడు "వేద గణితశాస్త్రాన్ని"విశ్వవిద్యాలయాల్లో కూడా ప్రవేశ పెడుతున్న కాషాయ పరివారం నిజానికి ఆ తరువాతి కాలంలో భారత దేశంలో అభివృద్ధి చెందిన గణిత శాస్త్రాన్ని గురించిగానీ, సైన్సును గురించి గానీ పట్టించుకోవడం లేదు. ❋

# వ్యవసాయ రంగాన్నిదివాళా తీయించే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు

(28వ పేజీ తరువాయి)

తర్వాత గ్రామాలలో ఉపాధి కానరాక జీవనాధారం వెతుక్కొంటూ కోట్లాది మంది పట్టణాలు, నగరాలకు వలసలు వెళుతున్నారు. 2020లో కోవిడ్-19 వ్యాప్తిని అరికట్టటం పేరుతో మోడి ప్రభుత్వం హఠాత్తుగా లాక్డౌన్ విధించినపుడు ఆ నగరాలు, పట్టణాల నుండి గ్రామాలకు చేరిన కోట్లాది మందికి తిరిగి వ్యవసాయ రంగమే ఉపాధి కల్పించింది. ఇపుడు అమెరికా షరతులకు తలొగ్గి స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం చేసుకొంటే వ్యవసాయ రంగం దివాళా తీసే పరిస్థితులు ఏర్పడతాయి. ఉపాధికి పెట్టనికోటగా ఉన్న వ్యవసాయరంగం దెబ్బతింటే వలస పాలన కాలంలో జరిగిన దానికి మించి దేశంలో ఆకలి చావులు సంభవిస్తాయి.

వ్యవసాయరంగంపై మన ఆధిపత్యం లేకపోతే, మన ప్రజలకు అవసరమైన, దేశ ప్రయోజనాలకు అనుగుణంగా వ్యవసాయ పంటలు పండించటం సాధ్యం కాదు. ఫలితంగా మనదేశ ప్రజల ఆహారభద్రతకు కూడా ప్రమాదం ఏర్పడుతుంది. కార్పొరేట్లు, సామ్రాజ్యవాద సంస్థలకు లాభాలు రావటానికి అవసరమైన పంటలను మాత్రమే పండించటానికి కార్పొరేట్ సంస్థలు పూనుకుంటాయి. దేశంలోని వ్యవసాయ భూములలో మన ప్రజలకు అవసరమైన ఆహారపంటలను పండించటం కన్నా, ఉత్తరాది దేశాలలోని ప్రజలకు అవసరమైన ఉత్పత్తులను పండిస్తే వారికి ఎక్కువ లాభాలు వస్తాయి. అందువలన వారు వాణిజ్య పంటలకే ప్రాధాన్యత ఇస్తారు. మరి మన ప్రజలకు ఆహార లభ్యత సంగతేమిటి? మనం పండించిన ఎక్కువ విలువ గల వాణిజ్య పంటలను అమ్ముకొని, ఆ డబ్బుతో తక్కువ విలువ కలిగిన ఆహారధా న్యాలను అంతర్జాతీయ మార్కెట్లో కొనుక్కో వచ్చునని మన ప్రజలను నమ్మించటానికి సామ్రాజ్యవాదులు ప్రచారం చేస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్ స్వేచ్ఛగా లేదు. సామ్రాజ్యవాదుల ఆధిపత్యంలో ఉంది. ప్రపంచంలోని ఆహార నిల్వలలో ఎక్కువ భాగం సామ్రాజ్యవాద సంస్థల చేతులలో ఉన్నాయి. సామ్రాజ్యవాదులు ఆహారధాన్యాలను తమ రాజకీయ, ఆర్థిక ప్రయోజనాలను సాధించు కోవటానికి ఉపయోగిస్తారు. మనకు ఆహారధాన్యాలు అవసరమైతే సామ్రాజ్యవాదులు డబ్బు తీసుకొని ఆహారధాన్యాలను అందించరు. అంతర్జాతీయంగా వారి రాజ కీయ ప్రయో జనాలకు అనుగుణంగా మనదేశం వ్యవహ రించటానికి సిద్ధపడితేనే ఆహార ధాన్యాలను అందజేస్తారు. అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఆహారధాన్యాలను సరఫరా చేయకుండా దేశంలో కల్లోల పరిస్థితులను సృష్టించటానికి, తమను వ్యతిరేకించే ప్రభుత్వాలపై ప్రజలలో అసంతృప్తిని పెంచటానికి పూనుకుంటారు. అందువలన మన దేశ ప్రయోజనాలను పరిరక్షించుకోవం ప్రాతిపదికగా ప్రభుత్వం అమెరికాతో చర్చలు జరపాలి. ఒకవేళ ఇందులో మోడి ప్రభుత్వంపై ఈ దిశలో ఒత్తిడి తేవడం కోసం ప్రజలు, ప్రతిపక్ష పార్టీలు, పౌర సమాజం ఐక్యంగా ఉద్యమించాలి. మనదేశ ప్రయోజ నాలను కాపాడుకోవాలి. ❋

స్ఫూర్తి

# కష్టకాలంలో కమ్యునిస్టులకు స్ఫూర్తి ప్రదాత కామ్రేడ్ కొరటాల



రచయిత భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కమిటీ మాజీ కార్యదర్శి

**పి. మధు**

సిపిఐ(ఎం) నాయకులు కామ్రేడ్ కొరటాల సత్యనారాయణ జీవితం కష్టకాలంలో ఉన్న కమ్యూనిస్టులకు స్ఫూర్తి నిస్తుంది. 19 సంవత్సరాల క్రితం 2006 జులై 1న 83 సంవత్సరాల వయస్సులో ఆయన మరణించాడు. ఎన్నో ఉద్యమాలు, రహస్య జీవితం, జైళ్ళు, నిర్బంధాలు ఎదుర్కొని నిలిచిన నాయకుడు కామ్రేడ్ కొరటాల. కడలూరు జైలులో నిరాహారదీక్షలు, లాఠీచార్జీలు, జైలు నిర్బంధాలు ఎదుర్కొన్నాడు. 1949లో అరెస్టయి కడలూరు జైలులో 3 సంవత్సరాలు కఠిన కారాగార శిక్ష అనుభవించాడు. 28 రోజులపాటు జైల్లో నిరాహారదీక్ష చేశాడు. నాలుగు గోడల మధ్య దీక్షా శిబిరం మీద లాఠీచార్జీ జరిగింది. అది 1950 తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటం జరుగుతున్న నిర్బంధ కాలం. ఆంధ్రలో తెలంగాణా పోరాటానికి దన్నుగా నిలిచిన గుంటూరు జిల్లా నుండి కొరటాల ఉద్యమాల్లోకి వచ్చాడు. కమ్యూనిస్టు పార్టీని బ్యాన్ చేసిన రోజులవి. రాజాజీ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జైళ్లల్లో స్వాతంత్ర సమర యోధుల మీద తీవ్ర నిర్బందకాండ సాగింది. ఒక్కొక్క జైలుది ఒక్కొక్క కథ. అండమాన్ జైలుది ఒక కథ, సేలం జైలుది మరో కథ, కడలూరు జైలుది ఇంకో కథ. ఇలా మీరట్ లాహెూర్, వెల్లూరు లాంటి జైళ్ల కథలు చాలా ఉన్నాయి. కొరటాల పార్టీ జీవితాన్ని గురించి అర్థం చేసుకోవాలన్నట్లయితే అనాటి జైళ్ల నిర్బందాన్ని అర్థం చేసుకోవాలి.



నాలుగు గోడల మధ్య రాజకీయ ఖైదీల్ని క్రిమినల్ నేరస్తుల్లాగా నిర్బందించడాన్ని ప్రశ్నించినందుకు లాఠీచార్జీలు, చంపడాలు జరిగాయి. అండమాన్ నికోబార్‌లో ఫోర్టు బ్లేయర్‌లో సెల్యూలార్ జైలు వలస కారాగారం. బ్రిటీష్ వారు రాజకీయ ఖైదీలను దేశం నుండి బహిష్కరించినట్లు దూరంగా ఉన్న అండమాన్ నికోబార్ ద్వీపానికి తరలించారు. స్వాతంత్ర సమరయోధుల్ని క్రిమినల్స్‌గా పరిగణించి అమానవీయంగా ఒంటరిగా మరొకరితో కలవకుండా చిన్న గదిలో రోజుకు 22 గంటలు సెల్‌లోనే బంధించడం సెల్యూలార్ జైలు ప్రత్యేకత. ఈ జైల్లో హరేకృష్ణ కోనార్, బినయ్‌కృష్ణ చౌదరి లాంటి బెంగాలు విప్లవకారులు నిర్బందించబడ్డారు. బలవంతంగా ఖైదీల చేత పని చేయించేవాళ్లు. పారిశుధ్యం, ఆహారం అతి నాశిరకంగా ఉండేవి. మానసికంగానూ, శారీరకంగానూ నిర్బందం అమలయ్యే జైలే సెల్యూలార్ జైలు. నిర్భాందానికి అది మారుపేరు.

మరోక జైలు సేలం జైలు. 22 మంది కమ్యూనిస్టు ఖైదీలను తుపాకులతో కాల్చి చంపిన జైలు ఇది. క్రిమినల్ నేరస్తుల్లాగా కమ్యూనిస్టు ఖైదీల్ని జైల్లో తలకి నల్లని టోపీలు, ప్రత్యేక దుస్తులు ధరించేవారు. నిర్బంధ పని అమలు చేసేవారు. దీన్ని ప్రశ్నించినందుకు వంద మందిని ఒక హాల్లో బంధించి తలుపులు బిగించి కిటీకీల్లోంచి తుపాకులతో కాల్చి చంపారు. యుద్ధతంత్రంలో చేతికి దొరికిన శత్రు సైనికుడిని కూడా పట్టుకొని చంపకూడదు. కానీ సేలంలో 17 మందిని కాల్చి చంపారు, గాయపడ్డ ఐదుగురిని పట్టుకొని చిత్రహింసలతో చంపారు. కొరటాలది కడలూరు జైలు జీవితం. ఈ జైలు కథ వేరు. ఈ జైల్లో మోటూరు హనుమంతరావు కూడా నిర్బందించబడ్డారు. ప్రజల్లో పేరెన్నిక కలిగిన నాయకుల్ని, దేశానికి స్వతంత్రం కావలని కోరిన వారిని బంధించారు. కొరటాల నిరాహార దీక్షలు, లాఠీదెబ్బలు, నిర్బంధం ఈ జైల్లోనే అనుభవించాడు. కొందరు చెప్పిన దాన్ని బట్టి జైల్లో కొరటాల ఆరోగ్యం బాగా దెబ్బతిన్నది.

కొరటాల పని విధానం అసలు సిసలైన ప్రజాపంథా. ఆయన స్నేహశీలి. ప్రజల నుండి గమనించి, వారి సేవలకు అంకితమైన లక్షణం ఆయనది. చేనేత కుటుంబం నుంచి ఆయన రాకపోయినా ఆయన్ని చాలామంది పద్మశాలి కులస్తుడుగా భావించేవారు. కొందరు రేపల్లిలో ఆయన గాంధీ మహాత్ముడయ్య అని అనేవారు. అలుపెరగకుండా ప్రజాపంథా అమలు చేసిన జీవితం ఆయనది. బూర్జువా వ్యవస్థలో ఆయన కృషి ప్రత్యేకమైంది. పార్టీ ప్రజాపునాది పెరగడానికి పార్లమెంటరీతత్వం ఆటంకం అని

నమ్మిన నాయకుడు ఆయన. యువతకు ప్రాధాన్యతనిచ్చి ప్రోత్సహించిన నాయకుడా యన. వారి కృషికి మనం పునరంకితం కావాలి. కష్టకాలంలో కమ్యునిస్టులకు స్ఫూర్తిప్రదాత కామ్రేడ్ కొరటాల

కమ్యూనిస్టులు పెరగడం లేదని వారి ప్రాధాన్యత తగ్గిందని కొందరు వాదిస్తున్నారు. బలం తగ్గిన మాట నిజమే, కానీ వారి ప్రాధాన్యత తగిందన్నది సరైన విమర్శ కాదు. కమ్యూనిస్టులు ఉన్న చోటే అణగారిన వర్గాల హక్కులు రక్షించబడుతున్నాయి. పార్లమెంట్, అసెంబ్లీలో బలం ఉన్నా, తగ్గినా కష్టజీవుల కోసం పోరాడుతున్నది కమ్యూనిస్టులే. ఈ పోరాటాలే ప్రజలకు ఊరటనిస్తున్నాయి. సొంత ప్రయోజనాలకంటే ప్రజా ప్రయోజా నాలే ముఖ్యమని నమ్మినవారు కమ్యూనిస్టులు. ప్రపంచంలో ట్రంప్ పరిణామాలు కానీ, ఇజ్రాయిల్– ఇరాన్ దేశాల మధ్య యుద్ధ పరిణా మాలు గాని, కమ్యూనిస్టులు సామ్రాజ్యవాదం గురించి చెప్పేది నిజమని నిరూపిస్తున్నాయి. అమెరికా ఫస్ట్ అనే నినాదంతో రెండోసారి అధికారానికి వచ్చిన ట్రంప్‌ని అక్కడ ప్రజలు, దేశదేశాల్లోని ప్రభుత్వాలు, ప్రజలు తీవ్రంగా ప్రతిఘటిస్తున్నారు. రానున్నది మంచి కాలమని నిలదీస్తున్నారు. ఇదే ఈ రోజు కమ్యూనిస్టు ఉద్యమానికి సానుకూల అంశం. ట్రంప్ పెంచిన టారిఫ్‌ల వల్ల ఇతర దేశాలతోపాటు భారత ఆర్థిక వ్యవస్థ చిక్కుల్లో పడింది. 2024తో పోలిస్తే 2025 ప్రథమ మూడు మాసాల్లో జిఎస్‌టి వసూళ్లు బాగా పడిపోయాయి. వ్యాపారాలు కుదేలు అయిన స్థితిని ఇది బట్టబయలు చేస్తుంది.

**సంక్షోభంలో ట్రంప్ టారిఫ్ విధానాలు**

2025 జనవరి 20వ తేదీన ట్రంప్ తన టారిఫ్ విధానాలను ప్రకటించారు. వాణిజ్య లోటును తగ్గించుకొవడం, స్థానికంగా దేశంలో ఉత్పత్తి పెంచుకోవడం, చట్ట విరుద్ధంగా వచ్చే వలసలను నివారించడం కోసం ఈ విధానాల్ని అనుసరిస్తున్నట్లు ప్రకటించాడు. "ఇంటర్‌నేషనల్ ఎమర్జన్సీ ఎకనమిక్ పవర్స్ యాక్టు"ను వినియోగించి టారిఫ్ చర్యలు చేపట్టాడు. దిగుమతులపై పన్నును 2.5 శాతం నుండి అమాంతంగా 27 శాతానికి పెంచాడు. కొన్ని దేశాలపై ఇంతకంటే అధికంగా పన్నులు విధించాడు. శతాబ్ధ కాలంలో ఇంత భారీగా పన్నులు పెంచిన సందర్భం ఇంతకుముందు ఎన్నడూలేదు. ప్రజల్లో వెంటనే అలజడి ప్రారంభమైంది. దాంతో 2025 జూన్ 17న ఈ టారిఫ్‌లను 15.8 శాతానికి తగ్గించాడు. అమెరికాలో ఫెడరల్ కోర్టులు ఈ యాక్టు కింద ఈ చర్యలు రాజ్యాంగ విరుద్ధమని కొట్టేశాయి. కాలిఫోర్నియా గవర్నర్ సరాసరి కోర్టులో కేసునే వేశాడు. అమెరికా వ్యాపారంలో ఎక్కువగా లోటు ఉన్న చైనా మీద 10 నుండి 125 శాతం టారిఫ్ పెంచాడు. అలాగే వాణిజ్య లోటు ఎక్కువగా ఉన్న కెనడా, మెక్సికో దేశాల మీద కూడా టారిఫ్ రేటు 25 శాతం పెంచాడు. పెంచిన టారిప్ మీద విచారణ పూర్తికానందున అమలులో ఉన్నాయి. ఫలితంగా ఆర్థిక రంగంలో సంక్షోభం, వినియోగదారులకు ధరలు పెరుగుదల, అమెరికాలోని వ్యాపారస్తులకు తమ దిగుమతుల మీద ఎక్కువ చెల్లించాల్సిరావడం సగటున అమెరికా కుటుంబం 2025 జూన్ 17నాటికి 1,200 డాలర్లు భారం భరించాల్సి వచ్చింది. అమెరికా అనుసరించిన టారిఫ్ విధానాలను ప్రతిఘటించడానికి చైనా ప్రతిఘటనా టారిఫ్‌ను ప్రకటించింది. 125 శాతం ప్రతిఘటనా టారిఫ్‌ను పెంచింది. దానితో పాటు యుఎస్‌లో కీలకంగా అవసరమైన క్రిటికల్ మినరల్ ఎగుమతుల్ని చైనా అపేసింది.

యూరోపియన్ యూనియన్, జపాన్ మొదలగు దేశాలు అమెరికా టారిఫ్‌ను ప్రతిఘటించే విధానాలను చేపడతామని ప్రకటించాయి. ఫ్రెంచ్ ప్రెసిడెంట్ ఇమాన్యుల్ మాక్రాన్ అమెరికాలో పెట్టే ఐరోపా పెట్టుబడులను ఉపసంహరించాలని ప్రకటించాడు. కార్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు, నిత్యావసరాలు, లిక్కర్ విపరీతంగా పెరగడంతో జె.పి.మార్గన్ అనే ఆర్థిక సంస్థ 2025 అంతానికి 60 శాతం మాధ్యం ఏర్పడుతుందని పేర్కొన్నది. నికీ, ఆపిల్ లాంటి కంపెనీల వాటాలు భారీగా తగ్గిపోయాయి. అమెరికాలో దేశ ఉత్పత్తి తగ్గడంతో పాటు 7 శాతం వేతనం మధ్యతరగతి కుటుంబానికి తగ్గింది. అమెరికా మిత్రులుగా ఉన్న కెనడా, మెక్సికో దేశాలతో పాటు యూరోపియన్ యూనియన్ తీవ్ర నిరసనను వ్యక్తం చేశాయి. జర్మన్ ఆర్థిక మంత్రి రాబర్ట్ హాబేక్ మొత్తం ఐరోపా యూనియన్ ఐక్యంగా ట్రంపుపై వత్తిడి తెచ్చి టారిఫ్ తగ్గేలా చేయాలని కోరాడు.

ట్రంప్ ఏకపక్షంగా, షడన్‌గా టారిఫ్‌ను పెంచడం వల్ల అమెరికా వ్యవస్థ మీద విశ్వాసాన్ని దెబ్బతీసిందని కొన్ని యూనివర్సిటీలో ప్రొఫెసర్లు ప్రకటించారు. ఆఫిషియల్ సోషల్ మీడియాలో కాక, ముందుగా తన సొంత సోషల్ మీడియా వేదికగా ట్రంప్ టారిఫ్‌లు ప్రకటించడంతో మార్కెట్ మ్యానిపులేషన్‌ను ట్రంపు ప్రోత్సహించాడని ప్రభుత్వం మీద విమర్శకులు దాడి చేసారు. 2025 ఏప్రిల్ 16న కాలిఫోర్నియా గవర్నర్ "గవిన్ న్యూసం" కోర్టులో ఒక లా సూట్ ట్రంపు చర్యలు చెల్లవని వేశాడు. ఈ ట్రంప్ టారిఫ్ విధానాలు 2019 కోవిడ్ సమయంలో మార్కెట్‌లో నెలకొన్న అస్థిరత్వం, మాధ్యం, నిరుద్యోగం స్థాయిని మించాయని ప్రకటించాడు. ట్రంపు ప్రకటించినట్లుగా అమెరికాలో మాన్‌ఫెక్చరింగ్ రంగం పెరగలేదు. పైగా ఖర్చులు పెరిగాయి. సరుకుల సరఫరా బాగా తగ్గింది.

రాజకీయ రంగంలో కూడా దీనియొక్క ప్రభావం బలంగా ఉంది. ట్రంప్ సొంత పార్టీ అయిన రిపబ్లిక్ పార్టీ నుండి డెమోక్రటిక్ పార్టీలోకి కొందరు చేరారు. రాజకీయంగా దీని ప్రభావం 2026లో జరిగే మధ్యంతర ఎన్నికల్లో ఉండనున్నట్లు వార్తలొచ్చాయి. అమెరికా ఫస్ట్ అన్న నినాదంతో ఆర్థిక రంగంలో స్థిరత్వం, రక్షణ, ఉత్పత్తిరంగంలో పెరుగుదల ఉంటుందని ట్రంప్ మద్దతుదారులు పేర్కొన్నది జరగలేదు. అమెరికా నాయకత్వం మీద సడలుతున్న విశ్వాసం అంతర్జాతీయ రాజకీయ పరిణామాల్లో తీవ్రంగా ఉంటుందని ఆక్స్‌ఫోర్డు యూనివర్సిటీ ప్రొఫెసర్ "గోల్డిన్ లీగల్" మే నెలలో పేర్కొన్నారు. రాజకీయంగా ప్రమాధకర పరిణామాలు ఎదుర్కోవలసి ఉంటుందని హెచ్చరించాడు. 2025లో ట్రంపు ప్రారంభించిన టారిఫ్ విధానాలు ఆర్థిక రంగంలోనూ, దౌత్యరీత్యా సంబంధాలలోనూ అనేక ఆటుపోట్లు చవిచూడాల్సి ఉంటుందని పరిణామాలు తెలియజేస్తున్నాయి.

ట్రంపు టారిఫ్ విధానాల మీద చైనా ఏప్రిల్ 11న తన ప్రతిఘటనా టారిఫ్‌లు ప్రకటించడం అమెరికాకు కొత్త సమస్యలు తెచ్చింది. "2024 వైట్‌హౌస్ ఫాక్ట్ షీట్" ప్రకారం చైనాతో అమెరికా వాణిజ్య లోటు 295.4 బిలియన్ల డాలర్లు. ఇది చాలా భారీగా ఉందని, భరించడం కష్టమని తగ్గించుకోవడానికి టారిఫ్ పెంచినట్లుగా అమెరికా పేర్కొన్నది. అమెరికా ఆర్థిక వ్యవస్థ చిక్కుల్లో ఉందనడానికి ఇది ఉదాహరణ. చైనా ప్రతిఘటనా టారిఫ్‌లే కాదు అమెరికాకు కీలకంగా అవసరమైన క్రిటికల్ మినరల్ ఎగుమతుల్ని ఆపేసింది. వస్తువుల ధరలు పెరగడం, సెమికండక్టర్లు, ఆటోమోటివ్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్‌కు అవసరమైన మినరల్స్ అందుబాటులో లేకపోవడం వల్ల అమెరికాలో ట్రంప్ పాలనా వ్యవస్థ మీద వత్తిడి పెరిగింది. చైనాతో సంప్రదింపులు ప్రారంభమయ్యాయి. 10 శాతంకి టారిఫ్‌లు తగ్గిస్తామని ద్వైపాక్షిక చర్చల్లో అమెరికా పేర్కొన్నది. సమానత్వం, ఉభయులకి ప్రయోజనం అన్న అంశాలు ఆధారంగా చర్చలు జరగాలని చైనా ప్రతిపాదించింది. ఏకపక్ష చర్యలు కుదరకవని చెప్పింది.

ఎట్టి పరిస్థితుల్లోనూ చర్చలు లేవని అన్న అమెరికా దిగివచ్చి చర్చలు జరపడం ప్రారంభ మైంది. అమెరికా టారిఫ్ విషయంలో ప్రతిఘ టన, ద్వైపాక్షిక చర్చలు అన్నది విధానంగా చైనా ఎంచుకొంది. అమెరికాలో ట్రంప్ మిత్రుల్లో ప్రతికూలత ఒక్కటే కాదు, అంతర్జా తీయంగా కూడా తమ అలైస్‌గా (మిత్రులు) ఉన్న దేశాలలోనూ ఆందోళనలు ప్రారంభమ య్యాయి. చైనా అమెరికాతో వ్యవహరించే సందర్భంలో ప్రపంచంలో అమెరికా టారిఫ్‌తో నలిగిపోతున్న వారిని దృష్టిలో పెట్టుకొని సంప్ర దింపులు సాగిస్తున్నట్లు చైనా ప్రకటించింది. ప్రత్యామ్నాయ వ్యాపార మార్గాలవైపు ప్రపంచంలో ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి.

ట్రంపు టారిఫ్ విధానాలతో భారతదేశ వ్యవసాయం, పాల ఉత్పత్తులు తదితర రంగాలు భారీగా దెబ్బతినే పరిస్థితులు నెలకొన్నాయి. అమెరికాకు మిత్రులుగా ఉన్న కెనడా, మెక్సికో లేదా ఐరోపా యూనియన్ లాంటి దేశాలు లాగా అయినా దేశంలో ప్రభుత్వం ప్రతిఘటన చేయడం లేదు. అమెరి కాలో జనాభా సంఖ్య కంటే భారతదేశంలో రైతుల సంఖ్య ఎక్కువగా ఉండటం, అసలే వ్యవసాయం సంక్షోభంలో ఉండటం ఈ తరుణంలో ట్రంపు టారిఫ్‌లు మన వ్యవసాయ రంగాన్ని భారీగా దెబ్బతీసే ప్రమాదం నేపథ్యం లో నరేంద్ర మోడి దేశాన్ని అమెరికా టారిఫ్‌కు అనుకూలంగా నడపడం మన వ్యవసాయానికి తీవ్ర నష్టం. 2025 జీఎస్‌టి కలెక్షన్లు వృద్ధి రేటు (గ్రాస్ కలెక్షన్సు) 2024 వృద్ధి రేటు (గ్రాస్ కలెక్షన్సు)తో పోలిస్తే బాగా తక్కువగా ఉన్నాయి. అంతేకాదు ఇది 4 సంవత్సరాల వృద్ధి రేటు కంటే తక్కువ.

తీవ్ర సంక్షోభంలో ఉన్న అమెరికా ఆర్థిక వ్యవస్థ బలప్రయోగంతో టారిఫ్‌ను ఇతరుల మీద రుద్ది గట్టెక్కడం అంత తేలికైన పని కాదని అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు ప్రకటిస్తున్నాయి.

**ఇజ్రాయిల్‌కి కళ్లెం-పశ్చిమాసియాకు శాంతి**

ఇరాన్-ఇజ్రాయిల్ మధ్య పన్నెండు రోజుల యుద్ధంతో తీవ్ర ఉద్రిక్తతల మధ్య కాల్పుల విరమణ జరిగింది. ఇరాన్‌లోని న్యూక్లియర్ కార్యక్రమాల్ని కట్టడి చేయడంలో విజయం సాధించినట్లుగా ఇజ్రాయిల్ ప్రకటిం చింది. ఇజ్రాయిల్ ప్రకటించిన అంశాలు మరింత సంక్లిష్టమైన అంశాలుగా సమీక్షల్లో వెల్లడవుతున్నాయి. ఈ యుద్ధంలో ఇరాన్ భౌతికంగా భారీగా నష్టపోయింది. న్యూక్లియర్ కార్యక్రమ వసతుల మీద ఇజ్రాయిల్ దాడి చేసి ధ్వంసం చేసింది. దాడిలో ఉన్నత సైనికాధికా రులు కొందరు మరణించారు. ఇరాన్ ఎయిర్ డిఫెన్స్ బలహీనంగా ఉన్నదని రుజువైంది. 600 మంది ఇందులో ఎక్కువ భాగం ఇరాన్ పౌరులు ఈ యుద్ధంలో మరణించారు. దశాబ్దాలు గాకపోయిన కోలుకోవడానికి కొన్ని సంవత్సరాలు పట్టవచ్చు. యుద్ధంలో కేవలం భౌతిక నష్టాలే కాదు జయాపజయాలు అర్థం కావడానికి ఇతర విషయాలు కూడా పరిశీలన చేయాలి. భౌతికంగా నష్టాలు జరిగినా ఇరువు రు మధ్య బలాబలాల్లో తేడాలున్నా ఇరాన్ మాత్రం యుద్ధంలో లొంగిపోలేదు. పైగా తిప్పికొట్టే ప్రయత్నం ఇరాన్ చేసింది.

జూన్ 13న ఇజ్రాయిల్ దాడి నుండి వెంటనే ఇరాన్ తేరుకొన్నది. డ్రోన్, బ్యాలెస్టిక్ మిసైల్స్ వినియోగించి తిరుగు దాడి చేసింది. ఇజ్రాయిల్ ఎయిర్ డిఫెన్స్‌లో దశలవారి రక్షణ కవచాలున్నాయని, చేదించడం ఎవరితరం కాదన్న ప్రచారం బూటకం అని తేలింది. ఇరాన్ దాడిలో కొంత మంది మరణించారు కూడా. ఈ యుద్ధంతో ఇరాన్‌లో అధికార పీఠం మార్పిడి తప్పదని ప్రకటించిన ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమిన్ నెతాన్యాహు తన వైఖరిని పక్కన పెట్టి సీజ్‌ఫైర్‌కు అంగీకరించాడు. అమెరికా ట్రంపు రంగంలోకి దిగి ఇరాన్ పాలకులు షరతులు లేకుండా లొంగిపోవాలని డిమాండ్ చేశాడు. ఇరాన్‌లోని మూడు న్యూక్లియర్ ప్రాజెక్టుల మీద అమెరికా బాంబులు వేసి యుద్ధ ఉద్రిక్తతను పెంచాడు. అయినా ఇరాన్ లొంగలేదు. ఖతార్‌లోని దోహ, ఇరాక్, అమెరికా సైనిక స్థావరాల మీద డ్రోన్లు - బ్యాలెస్టిక్ మిసైల్స్‌తో తిరిగి దాడి చేసింది. ఈ దశలో కాల్పుల విరమణకు అమెరికా ఇజ్రాయి ల్ సిద్ధమయ్యాయి. పశ్చిమ ఆసియాలో ఇజ్రా యిల్ సృష్టించిన ఈ యుద్ధం వల్ల వచ్చే సమస్యలు, పర్యవసానాలు ఆ ప్రాంత స్థిరత్వానికి ఆటంకాలు ముందుకొచ్చాయి. ఇజ్రాయిల్ ఈ ప్రాంతంలో అస్థిరతను సృష్టిం చి, అధిపత్యాన్ని సాధించడానికి చేసిన ప్రయత్నాల్ని ఇరాన్ వమ్ము చేసింది. ఇరాన్ తన శక్తిని, బలాన్ని అసెర్టు చేసుకొంది. యుద్ధం లో భౌతికంగా కొన్ని నష్టాలు జరిగినా అమె రికా, ఇజ్రాయిల్ వత్తిడికి ఇరాన్ లొంగలేదు.

యుద్ధం ప్రారంభించినప్పుడు ఇరాన్‌లో న్యూక్లియర్ కార్యక్రమాలు రూపుమాపడం సాధ్యం కాదని ముందుగానే ఇజ్రాయిల్‌కి తెలుసు. తన వద్ద న్యూక్లియర్ ఆయుధాలు ఉండవచ్చు, కానీ ఇరాన్ న్యూక్లియర్ సామర్థ్యాన్ని ఆవిష్కరించరాదన్న అధిపత్య దోరణి యుద్ధానికి కారణం. మరోపక్క ఇజ్రాయిల్ తనకుతానుగా ఒంటరిగా ఇరాన్‌లోని న్యూక్లియర్ స్థావరాల్ని ధ్వంసం చేయడం సాధ్యంకాదని తెలుసు. అమెరికా సహకారంతోనే ఆ పని చేయాలని పూనుకొని భంగపడింది. ఇజ్రాయిల్ సాగించే యుద్ధానికి అమెరికా సహకరిస్తూ ఇరాన్‌లో అణుస్థావరాలపై దాడి చేసింది. కానీ వెనువెంటనే కాల్పుల విరమణ అమలు చేయాలని ఇజ్రాయిల్‌పై వత్తిడి చేసింది. కాల్పుల విరమణతో పశ్చిమాసియాలో ఇజ్రాయిల్ ఆధ్వర్యంలో యూనిపొలార్ స్థితికి (ఏకపక్ష ఆధిపత్యం) అడ్డుకట్ట వేసింది. ఇరాన్ తిరిగి తన అణుశక్తి సంబంధ కార్యక్రమాన్ని బలోపేతం చేసుకుంటూ రష్యా, చైనా దేశాలతో సంబంధాలను మెరుగుపర్చుకొని నైతిక బలాన్ని కూడకట్టుకొనే అవకాశం వచ్చింది. అఫ్ఘనిస్తాన్ లోనూ, ఇరాక్‌లోనూ, లిబియాలోనూ భంగపడి న అమెరికా ఇరాన్‌లో పూర్తిగా మునిగి మరో పరాజయానికి సిద్ధం కాదలుచుకోలేదు.

ఈ పరిణామాలతోనే బెంజిమిన్ నెతాన్యా హుకు కాల్పుల విరమణ తప్ప మరో ప్రత్యామ్నాయం లేకపోయింది. ఇరాన్ నాయ కుడు ఆయాతుల్లా ఖమేనీని అధికార పీఠం నుండి తొలగిస్తామన్న తలంపును నెతాన్యాహు ఉపసంహరించుకొన్నాడు. అమెరికా ఇంటిలిజెన్స్ ఏజెన్సీల అంచనా ప్రకారం ఇరాన్‌లో అణుసంబంధిత కార్యకలాపాలు కొన్ని నెలలు ఆలస్యం కావచ్చు. కానీ ఆచరణలో అణు సంబంధిత కార్యక్రమాల్ని పూర్తిగా తుడిచిపెట్టాలన్న ఇజ్రాయిల్ తలంపు సాధ్యం గాలేదు. ఇరాన్‌పై అణుబాంబుల నేరం మోపి లొంగదీసుకోవచ్చన్న ప్రయత్నం విఫలమైంది. అందువల్లే ఎటువంటి ఆలస్యం లేకుండా ద్వైపాక్షిక చర్చలతో కాల్పుల విరమణకు సిద్ధమయ్యారు. ద్వైపాక్షిక చర్చల్లో ఇరాన్‌కి అమెరికా ఇచ్చిన హామీల ప్రకారం తక్షణం చర్చలు జరపాలి. పశ్చిమాసియాలో శాంతిని, సుస్థిరతని కాపాడడానికి వీలుగా ఇజ్రాయిల్ దూకుడుకి అమెరికా కళ్లెం వెయ్యాలి. అమెరికా సన్నిహిత మిత్రుడైన ఇజ్రాయిల్, ఇరాన్ లాంటి దేశాల మీద దాడులు చేసేదానికి అవకాశం ఉన్నంత కాలం ఆ ప్రాంతంలో శాంతికి, సుస్థిరతకు అవకాశం ఉండదని అమెరికా గుర్తించాలి.

అమెరికా అండతో గాజాలో ఇజ్రాయిల్: సృష్టిస్తున్న మారణ కాండపై ప్రపంచ వ్యాపితంగా నిరసన వ్యక్తమవుతోంది. చివరికి ఇజ్రాయిల్ ప్రజలు కూడా ఈ మారణ కాండకు నిరసన తెలుపుతున్నారు. మరోవైపు అమెరికా నాయకత్వంలోని జి7 దేశాల్లో లుకలుకలు బయలుదేరగా చైనా, రష్యా, భారత్‌ల నాయకత్వంలోని బ్రిక్ కూటమి విస్తరిస్తరణ, వాటి నిర్ణయాలు అమెరికా ఆధిపత్యానికి ఎదురవుతున్న ప్రతిఘటనను తెలియజేస్తున్నాయి. ❋

Date of Publication : 30th of every month. Date of Posting : 5th & 7th of every month.
Postal Regd. No. D/VJ/172/2024-26, Marxistu Monthly Magazine, Volume 21, issue: 3 Vijayawada
RNI Reg. No. APTEL/2006/17554 - Rs. 15/- Total Pages : 36

# సురక్షిత దేశాల జాబితాలో 66వ స్థానంలో భారత్



నేటి ప్రపంచంలో సురక్షితంగా ఉన్న 146 దేశాల జాబితా తయారు చేయగా భారత దేశం అందులో 66వ స్థానాన్ని ఆక్రమించింది. విశేషమేమంటే అభివృద్ధి చెందిన దేశాలైన అమెరికా, బ్రిటన్‌ల కన్నా భారత్ మెరుగైన స్థానంలో ఉన్నది. అదే సమయంలో పౌరుల భద్రత విషయంలో భారత్ కన్నా శ్రీలంక, పాకిస్థాన్‌లు మెరుగైన స్థానంలో ఉన్నాయి. నంబియో భద్రతా సూచీని ప్రతి ఏడాది రూపొందిస్తుంటారు. ఆయా దేశాలు ఇచ్చిన వాస్తవ సమాచారం ఆధారంగా ఈ సూచీని రూపొందిస్తారు.

ఆయా దేశాల్లోని శాంతి భద్రతల పరిస్థితి సాపేక్షంగా నిర్ధారించి ఈ సూచీని తయారు చేశారు. 100 స్కోరుకు గాను ఎక్కువ స్కోరు సాధించిన దేశాన్ని అతి సురక్షిత దేశంగా తక్కువ స్కోరు వచ్చిన దేశాలను అత్యంత తక్కువ సురక్షిత దేశంగా పరిగణిస్తారు.

146 దేశాలకు సంబంధించి తయారు చేసిన భద్రతా సూచీలో అండోర్రా అనే అతి చిన్న దేశం అగ్రస్థానంలో ఉంది. ఈ దేశానికి 84.7 స్కోరు వచ్చింది. ఫ్రాన్స్‌కూ, స్పెయిన్‌కూ మధ్యలో ఉన్న ఒక చిన్న ద్వీప దేశం అండోర్రా. దీనితోపాటు మొదటి అయిదు స్థానాల్లో పశ్చిమాసియా దేశాలైన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ -84.5), కతర్ (84.5), ఓమన్ (81.7) వాటితోపాటు తైవాన్ (82.9) ఉన్నాయి.

ఈ జాబితాలో భారత దేశం 55.7 స్కోరుతో 146 దేశాలకు గాను 66వ స్థానంలో నిలిచింది. 78.0 స్కోరుతో చైనా 15వ స్థానంలోనూ, 57.9 స్కోరుతో శ్రీలంక 59వ స్థానంలోనూ, 56.3 స్కోరుతో పాకిస్థాన్ 65వ స్థానంలోనూ ఉన్నాయి 38.4 స్కోరుతో బంగ్లాదేశ్ 126 స్థానంలో ఉంది.

51.7 స్కోరుతో బ్రిటన్ 87వ స్థానంలోనూ, 50.8 స్కోరుతో అమెరికా 89 స్థానంలోనూ ఉండి వర్ధమాన దేశాల కన్నా శాంతి భద్రతలు బాగా దిగజారిన దేశాల్లో చోటు సంపాదించుకున్నాయి. శాంతి భద్రతల విషయంలో చిట్టచివరి దేశాల్లో వెనిజులా, పపువా న్యూగినియా, హైతీ, ఆఫ్ఘనిస్థాన్, సిరియాలు ఉన్నాయి.

సురక్షిత సూచీ అనేది నేటి ప్రపంచంలో పర్యాటకం, విదేశీ పెట్టుబడులను ప్రభావితం చేస్తుంది. అమెరికా, బ్రిటన్‌లలో శాంతి భద్రతల యంత్రాంగం ఉన్నప్పటికీ అక్కడ నగరాల్లో జరుగుతున్న నేరాలు, నిత్యం జరిగే కాల్పులు ఆ దేశాలను సురక్షిత దేశాల జాబితాలో వెనక్కు నెట్టేశాయి.

**చిరునామా**

**మేనేజర్,**

**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 94900 99422**

**చందా వివరాలు**

విడిపత్రిక: **రూ.15,** సంవత్సర చందా:**రూ.150,** పోస్టు ద్వారా రూ. **180** పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు. లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి. ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చందాదారుని చిరునామా**

**పోస్టు స్టాంపు**

ఇంటి నెంబరు ..........

వీధి ..........

గ్రామం ..........

మండలం లేదా పట్టణం ..........

జిల్లా ..........

e m a i l : marxistap@gmail.com
venkataraosankarapu@gmail.com

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed at Prajasakti Printers & Publishers Private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 94900 99422.
Editor : S. Venkatarao.